


02-1983
ంలో అత్యధికంగా చదవబడుతున్న ఏకైక తెలుగు మాసపత్రిక!
4 రూ/-
ఫిబ్రవరి '83

ఈ సంక్రాంతికి మీ యింట
ఆప్కో పండించు
రంగుల పంట



శోభాయమానమైన సంక్రాంతి రంగులను, ఆప్కో మీ కోసం
రమ్యమైన నమూనాల్లో, మృదువైన నిండు నీలి,
అస్తమించు రవి అరుణ కాంతి, స్వచ్ఛమైన ఆకుపచ్చ,
తళుకులీను రాగి రంగులలో సృష్టించింది. ఈ సంక్రాంతికి కళ్లు మిరుమిట్లుగొలిపే
షర్టింగులు, క్రేప్ మెటీరియల్స్, చీరెలు, రెడీమేడ్స్ ఇంకా గృహోపకరణములగు వస్త్ర
సముదాయాలనెన్నింటినో మీకు సమర్పిస్తోంది.
సంక్రాంతికి ఆప్కోషావుకి వస్తారు కదా!

ఆప్కో
చేనేతలు


ఇంత అద్భుతమైన ఈ పండుగ కానుక
14 జనవరి '83 వరకు మాత్రమే!

KIRON/APCO/831



ఇది హఠాత్తుగా తయారైనదేం కాదు కాని, ఉక్కులో 200 సంవత్సరాల ఉత్కృష్ట కౌశల్యపు ఫలితమే ఇలాంటి రేజర్ బ్లేడ్ విల్ట్ఎడ్జ్.

విల్ట్ఎడ్జ్.
ప్రపంచపు సర్వోత్తమ బ్లేడుల వెనుకవున్న విల్కిన్సన్ వారి 200 సంవత్సరాల నిశిత నైపుణ్యంతో భారత దేశంలో తయారైన రేజర్ బ్లేడ్.



విల్ట్ఎడ్జ్.
దిగుమతి చేయబడిన ఉక్కుతో తయారై, యాంత్రిక సానరాయి మరియు తోలుపట్టీ మీద పదును పెట్టబడి గోథిక్ ఆర్చ్ ఆకారం పొందిన మొనతో కూడిన రేజర్ బ్లేడ్— ఈ గోథిక్ ఆర్చ్ మొన ఎన్నో సంవత్సరాల తీవ్ర సంశోధన ద్వారా ఉత్కృష్టం చేయబడి మరియు పి.టి.ఎఫ్.ఇ పూత కల్గినది. షేవింగ్ టెక్నాలజీలో సంభవించిన మహత్వపూర్ణమైన వైశిష్ట్య ప్రగతి. మీకు మును పెన్నడూ లభించని అతి నున్నని, సురక్షితమైన మరియు చక్కటి షేవ్‌ను అందించడానికి, అహా... షేవ్ తర్వాత షేవ్... ఎన్నో-మరెన్నో షేవ్‌లు. నిజానికి ఎన్ని ఎక్కువ షేవ్‌లంటే దీనికోసం కాస్త ఎక్కువ పైకాన్ని ఖర్చు పెట్టడానికి మీరు ఏమాత్రం వెనుకాడరు.

విల్ట్ఎడ్జ్.
ఇది మీపై చెరగని ముద్రను వేసి పోతుంది—దీని నాణ్యత అసమానం, దీనితో లభించే షేవ్‌లు అధికం.

విల్ట్ఎడ్జ్: మరింత ఎక్కువ పొందాలని అభిలషించేవారి కోసం- ఎక్కువ షేవ్‌లు, ఎక్కువ సుఖం, ఎక్కువ సంతృప్తి.

Wiltech India Ltd.

Rediffusion/WIL/1784h/

సంస్థాపకులు
వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
లీలావతి రాఘవయ్య

పుట్టినరోజు సంచిక

సంపుటి 21 ఫిబ్రవరి 1983 సంచిక 1

ఇదీ వరస...

ఓ మనిషీ	6	శ్రీశ్రీ
మళ్ళీ కొన్ని కూనలమ్మ పదాలు	8	ఆరుద్ర
ఫ్లాష్ బ్యాక్	14	యద్దనపూడి సులోచనా రాణి
డబ్బు టు ది పవర్ ఆఫ్ డబ్బు (సీరియల్)	17	యండమూరి వీరేంద్రనాథ్
రైలు పట్టాలు	39	రావి కొండలరావు
ఆ అనుభవం కావాలి (సీరియల్)	49	వి. మోహన్ కుమార్
హ్యూమరాలజీ (నెల నెలా హాస్య బోనస్)	66	యెర్రంశెట్టి శాయి
జ్యోతి పుట్టిన రోజు జ్ఞాపకం	92	
పై సందర్భంగా డా॥ అక్కినేనితో ఇంటర్వ్యూ	93	జ్యోతి
వంశ దీపం	102	వి. ఎ. కె. రంగారావు
పదవిడించి పదబంధ ప్రహేళిక	106	శ్రీశ్రీ
సౌభాగ్యలత (సీరియల్)	113	కౌసల్యాదేవి రామశాస్త్రి

.... ఆపైన ఝుమ ఝుమలాడే బాపు కార్టూన్లు
(రహస్యం: మళ్ళీ నెల మరికొన్ని)

ఈనెల నవలానుబంధం


స్థిరతా నహి నహి రే

రచన :

ఆకెళ్ల సత్యనారాయణమూర్తి

జ్యోతి పి.బి. నెం. 1824, హైదరాబాదు - 20

ముఖచిత్రం : యన్. టి. రామారావు



తొలిమాట

పుట్టినరోజు



పాఠకులకు, రచయితలకు, ఏజంట్లకు, చందాదారులకు, శ్రేయోభిలాషులకు జ్యోతి పుట్టినరోజు పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతోంది ....

ఇరవై యేళ్ళ నుంచీ సాహితీకాంతితో వెలుగుతున్న జ్యోతి ఆవిర్భావం జరిగింది 1963 సంక్రాంతిన .... సాయంత్రం చంద్రుడి మొగ్గలా.......

ఆ రోజు నుంచీ ఈరోజు వరకు ఆకర్షణీయంగా మీకు నచ్చేలా ఇంత కాలం తేజస్సుతో చైతన్యమార్గంలో నడవడానికీ, విజయవంత మవడానికీ కారణం మీరే.... జ్యోతిని అనుకరించడానికీ, అనుసరించడానికీ ప్రయత్నించిన ఇతర పత్రికలు కొన్ని అభివృద్ధిలోకి వచ్చినందుకు మాకు సంతోషం. అవి ఇంకా అభివృద్ధి కావాలని జ్యోతి కోరుకుంటోంది....

కొత్త రచయితలని, రచయిత్రులని, కార్టూనిస్టులని, చిత్రకారులని పరిచయం చేసి మంచి కథలతో సత్సాహిత్యాన్ని, సద్విమర్శని, అభిరుచినీ పెంచిన జ్యోతిని ఇలాగే కలకాలం మీరు ప్రోత్సహిస్తారని తెలిసే కొత్త కొత్త శీర్షికలు ఎన్నో ప్రవేశ పెట్టబోతున్నాం.

పుట్టినరోజు పండగ సందర్భంగా ఈ సంచికలో ప్రత్యేకించి శ్రీ శ్రీ పదబంధ ప్రహేళిక, గేయం, ఆరుద్ర కూనలమ్మనీ, రావి కొండలరావు కథనీ ప్రచురించాము. నవలల పోటీ వివరాలు ప్రచురించాము. గెలుపొందిన రచయితలందరికీ జ్యోతి ప్రత్యేక ప్రశంసలు.... గెలుపొందని వారికీ జ్యోతి అభినందనలు.... వారి సహాయ సహకారాలు ఎప్పటికీ జ్యోతికి వుంటాయని అభిలషిస్తున్నాము.

ఇకనుంచీ సరికొత్త సీరియల్స్‌తో, శీర్షికలతో, జ్యోతి సరికొత్త ముస్తాబులతో వస్తుంది నెలనెలా....

ఈ జ్యోతి విడుదలకి జరిగిన కొంత ఆలస్యానికి చింతిస్తున్నాము.

తాజావార్త వొచ్చేసింది....తెలుగుదేశం ఎన్నికలలో విజయం సాధించింది. రాష్ట్రంలో తెలుగుదేశం పరిపాలన ధర్మబద్ధంగా, వాగ్దానాల ననుసరించి జరుగుతుందని ఆశిద్దాం— మార్చి సంచికలో శ్రీ ఎన్. టి. రామారావుతో ఇదివరలో జ్యోతి జరిపిన ఇంటర్వ్యూ పునఃప్రచురిస్తాము.

అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు....

వి. వెంకటరాఘవయ్య

ఓ మనిషీ!

ఓ మనిషీ! అయ్యో మనిషీ!
బాణం గురి పెట్టిన వాడా!
మందుగుండు కనిపెట్టినవాడా!
ఎందుకు నీ ఆరాటం!
ఇక చాలును పోరాటం!

ఓ మనిషీ! ఓహో మనిషీ!
అపారమైనది నీ అధికారం!
విశిష్టమైనది నీ విజ్ఞానం!
చేయకు దుర్వినియోగం!
దూరకు పద్మవ్యూహం!

ఓ మనిషీ! మేల్కో మనిషీ!
నిన్నటి స్వప్నం నేటి యథార్థం!
అసాధ్యమన్నది అతి సామాన్యం!
ఇరుల తెరలలో ఉంది భయం!
ఎదిరిస్తేనే దిగ్విజయం!

శ్రీ శ్రీ

మళ్ళీ కొన్ని కూనలమ్మ పదాలు

ఆరుద్ర

నీతి పథమె నీది
నిత్యసత్యము నీది
మరల చేసెద ప్రోవి
ఓ కూనలమ్మా !

అస్తమించని సవిత
విస్తరించిన సరిత
నీ పేరుగల కవిత
ఓ కూనలమ్మా !

కూలిపోవును భూజము
కూలిరాజ్యమె నిజము
తేల్చినది మార్క్సిజము
ఓ కూనలమ్మా !

ధనీ కవితే మొన్న
మనీ కవితే నిన్న
మినీ కవితే మిన్న
ఓ కూనలమ్మా !

విరసమందున కూడ
విస్సన్నయల పీడ
కలదు శ్రీశ్రీ తోడ
ఓ కూనలమ్మా.

అతడు చెప్పినదెల్ల
అగునె ? వేదము కల్ల
అసలు వేదమె డిల్ల
ఓ కూనలమ్మా !

గద్దరొకడా ? తప్పు
ఇద్దరనుటే యొప్పు
జోడు కవితలు చెప్పు
ఓ కూనలమ్మా

పరుషవాక్కుల హద్దీ
కరకు చెరకుల కద్దీ
కే.వి. రమణా రెడ్డి
ఓ కూనలమ్మా

జ్యోతి భాగ్యలక్ష్మి నవలల పోటీ

ఫలితాలు

మొదటి బహుమతి : రూ. 6,000

అనుక్షణం	వి. రాజారామమోహనరావు

రెండవ బహుమతి : రూ. 4,000

ఘాలి	వీరపల్లి వీణావాణి

మూడవ బహుమతి : రూ. 2,500

శస్త్ర విన్యాసం-అస్త్రసన్యాసం	వి. మోహన్‌కుమార్

కన్సొలేషన్ బహుమతుల మొత్తం : రూ. 7,500

శిధిల సంధ్యాగమనం	వీరభద్రరావు వమ్మి
ఈదేశం ఒక హిమాలయం	తురగా జానకీరాణి
తూరుపు కొండలు	వారాల కృష్ణమూర్తి
దీపశిఖ	ఎ. శ్యామలారాణి
మబ్బులు తడపని ఆకాశం	చెల్లూరి సీతారాజేశ్వరరావు
ఆవలి తీరం	సదానంద శారద
చీకటి కాల్చిన వెన్నెల	తల్లావఝ్ఝుల సుందరం
లోయలూ-శిఖరాలు	పాలకోడేటి సత్యనారాయణ
ఆడ బొమ్మ	సింహ ప్రసాద్
మధ్యతరగతి మందహాసం.	పి. సత్యవతి

వచ్చే సంచికలో మొదటి బహుమతి నవలతోబాటు, న్యాయనిర్ణేతల తీర్పు వివరాలు ప్రచురిస్తాము.

ఉత్తరాలు

ప్రముఖ హిందీ, తెలుగు హీరోయిన్‌ల ముఖచిత్రంతో జనవరి 83 జ్యోతి ఆకర్షణీయంగా ఉంది. ముఖ్యంగా "ప్రయోగం" కథ సాహితీ రంగములో ఒక ప్రయోగం లాంటిది. స్వార్థాన్ని గూర్చి పవని నిర్మల ప్రభావతి గారు కడు రమ్యంగా వర్ణించారు. వారికి నా కృతజ్ఞతలు. "నగరాలు, నాగరికత పెరిగేకొద్దీ, మనిషిలోని మానవత్వము నశించి పోతుంది" నిజంగా ఈ వాక్యం అక్షరాలా సత్యం. ఇక "ఆ అనుభవం కావాలి" సీరియల్‌లో సెక్స్ మోతాదు మించుతున్నట్లుగా తోస్తుంది. ప్రయోగం కథ మాత్రం జనవరి జ్యోతికే హైలైట్. రచయిత్రి గారికి ప్రచురించిన మీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఎం.డి. షఫియుద్దీన్, కొత్తగూడెం.

★ ★

జయసుధ, రేఖల ముఖచిత్రం చాలా ఆకర్షణీయంగా వుంది, "ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్" (బొంబాయి) నుంచి మన "జ్యోతి" మాసపత్రిక "ది లార్జెస్ట్ సర్క్యులేటెడ్ మంత్లీ"గా పరిగణించడం నిజంగా ఆనందించదగ్గ విషయం. ప్రభావతి గారి "ప్రయోగం" కథ బావుంది. "యండమూరి" గారి "డబ్బు" సీరియల్ ఎంతో టెన్షన్‌గా సాగుతోంది. థాంక్స్ టు "యండమూరి"

-విజేంద్రనాధ్ ప్రసాద్. ఆదోని

★ ★

మీరు ప్రచురిస్తున్న యండమూరి వీరేంద్రనాథ్ సీరియల్ "డబ్బు టు ది పవర్ ఆఫ్ డబ్బు" చాలా ఇంటరెస్టింగా సాగుతోంది. జనవరి సంచికలో గాంధీని భలే చిక్కుల్లో పడేశారు - తర్వాత ఏమౌతుందోనన్న సస్పెన్స్ భరించలేక

పోతున్నాం. కౌసల్యాదేవి గారి 'సౌభాగ్యలత' కూడా చాలా ఆసక్తిగా సాగుతోంది. ఆఫీసుల్లో జరిగే అవినీతిని చాలా చక్కగా వివరిస్తున్నారు. కథలోని 'మహేష్' లాంటివారు సంఘానికి చీడపురుగులు. కొత్తగా ప్రారంభించిన సీరియల్ "ఆ అనుభవం కావాలి" చాలా వెరైటీగా ఉన్నది. ప్రచురిస్తున్నందుకు అభినందనలు. కథల మాసపత్రికలలో జ్యోతికి ప్రథమస్థానం వచ్చినందుకు నా శుభాకాంక్షలు. యర్రంశెట్టి శాయిగారి 'హ్యూమరాలజీ' కోసం ఎదురు చూస్తూ.....

ఆర్.వి.ఎస్. శాస్త్రి ఒంగోలు.

★ ★

జ్యోతి ఎప్పటికప్పుడు నూతన అంశాలను సంతరించుకుని మమ్మల్ని ఆనందింపచేస్తోంది. కథలు, సీరియల్స్ ఎంతో ఉత్సాహంగా సాగుతున్నాయి. మీరు మాకు అందజేసిన ABC వారి రిపోర్ట్ చాలా సంతోషాన్నిచ్చింది. అసలు మొదటినుంచీ జ్యోతిని గమనిస్తున్న పాఠకుడిగా నా అంచెనా ఫలించింది. అన్నిటిలోనూ ప్రత్యేకతను అందజేసిన మొదటి మాసపత్రికగా మేమంతా భావించడమే గాదు. అది రుజువు చేసింది ఈ 'రిపోర్టు'. జ్యోతి ఇలాగే కొనసాగాలని నా ఆకాంక్ష. బైండింగ్, ప్రింటింగ్ విషయమై మరికొంత శ్రద్ధ వహించగలరని మా జ్యోతికి మనవి చేస్తున్నాం.

శ్యామసుందరరావ్ వి. విశాఖపట్నం.

★ ★

కంగ్రాట్స్ ! ABC రిపోర్ట్ ద్వారా తెలిసిన న్యూస్‌కి మీకే గాదు, నా సహ పాఠకులకందరికీ నా శుభాకాంక్షలు. మీలాటి ఇతర మాసపత్రికలని మించి మీరు సాధించిన ఫలితం మీదే గాదు-మాదీ నంటాను. మీరేమంటారు? కార్టూన్లు, కథలు హైలైట్స్ ఈసారి.... కొత్త సీరియల్ కొంచెం డల్‌గా వుందేమో నని పిస్తోంది.

సి. కమలాకర్, ఏలూరు.

జ్యోతి పుట్టినరోజు పండుగ సందర్భంగా అభినందనలు

ఫ్లాష్ బ్యాక్

యద్దనపూడి సులోచనారాణి

ఇది కీ.శే. శ్రీ రాఘవయ్యగారు తెలుగు పాఠకులకోసం వెలిగించిన జ్యోతి.

చాలాసంవత్సరాల క్రితం ఒక మధ్యాహ్నవేళ రాఘవయ్యగారు, రమణ, బాపు కలిసి కొత్తగా పెట్టిన "జ్యోతి" మాసపత్రికకి, సీరియల్ కావాలని అడగటానికి రావటం గుర్తుకు వస్తోంది. అప్పటికి 'పెళ్ళి ప్రయాణం' 'తొలిమజిలీ' 'అమూల్య' 'ఐ లవ్ యూ' 'నాకీ అదృష్టం చాలు' కథలని, అప్పుడప్పుడూ సరదాకి మాత్రమే వ్రాస్తున్న నేను, సెక్రటరీతో ఒక్కసారిగా నవలా రచయిత్రిని అయిపోయాను. ఆ 'నవల' జ్యోతి పాఠకులని, వారి 'అభిమానం' నన్నూ వుక్కిరి బిక్కిరి చేసిన సంవత్సరం అది। 'నేనేం గొప్పగా వ్రాశాను? అందరూ నన్ను ఎందుకింత పొగుడుతున్నారు' అని తడబడే దాన్ని. మనిషి జీవితంలో సక్సెస్ ఏ వయసులో వచ్చినా థ్రిల్‌గానే వుంటుంది. కానీ చిన్నతనంలో, ఆవేశంతో ఇంద్ర ధనస్సుని చూసినా, సూర్యాస్తమయం చూసినా, వుదయం వేళ, పచ్చిక మీద మంచు బిందువులు కనిపించినా, చెప్పలేని సంతోషంతో మనసు వుప్పొంగిపోయే కష్టనిష్ఠూరాలు తెలియని, జీవితపు తొలి పొద్దులో, సక్సెస్ వస్తే, దాని వలన కలిగే ఆనందం అనిర్వచనీయమైనది. సెక్రటరీ తర్వాత కథలు వ్రాయటానికి టైమ్‌లేనంతగా, సీరియస్‌గా 'సీరియల్స్ కమిటెడ్ రైటర్‌ని' అయి

పోయాను. జీవన తరంగాలు, మీనా లాంటి సీరియల్స్, వాటి పాపులారిటీ, సినిమాలు శతదినోత్సవాలు, ఫంక్షన్స్, అవార్డ్స్, పాఠకుల అభిమానం, పబ్లిషర్స్ ఆదరణ, జీవితం అంతా బిజీ! బిజీ! బిజీ! నేను కెరీర్‌ని కోర లేదు. కెరీర్ నన్ను స్వంతం చేసుకుంది.

ఈ మధ్యలో రాఘవయ్యగారు పోయారు. లీలావతి గారిని, రాఘవయ్య గారు వెలిగించిన యీ జ్యోతిని పాఠకుల కోసం కాపాడటం ధర్మం అంటూ, ఆమె కర్తవ్యం గుర్తు చేస్తూ పూరడించటం గుర్తుకు వస్తోంది. రాఘవయ్య గారి తర్వాత, కాలం కడలిలో ఎదురయిన సమస్యల పెను తుఫాను గాలులకి లీలావతి గారు, తన 'స్వశక్తి' అనే కొంగు అడ్డంపెట్టి, రెపరెప లాడుతున్న జ్యోతిని ఆరిపోకుండా రక్షించుకోవటమే కాదు, అది దేదీప్యమానంగా వెలుగొందేలా, తన శక్తిని చమురుగా అర్పించారు.

అభినందనలు

అందుకే, ఈ శుభసమయంలో, ఈ 'జ్యోతిని' వెలిగించిన రాఘవయ్య గారిని గుర్తు చేసుకుంటూ, దాన్ని నిలబెట్టిన లీలావతిగారిని అభినందించటం!

దేనైనా నెలకొల్పడం సులభం! పేరు రావటం తేలిక. కానీ, దాన్ని పది కాలాలపాటు నిలబెట్టుకోవాలంటే, ఏకాగ్రత, నిరంతర కృషి, పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మస్థయిర్యం, ఒంటరి పోరాటం, నిజాయితీ, వీటన్నిటితో పాటు ముఖ్యంగా అదృష్టం కూడా ఎంతో అవసరం!

అది ఒక సంస్థ అయినా సరే!

ఒక వ్యక్తి అయినా సరే!

ఈ శుభ సమయంలో, జ్యోతికి నా హృదయ పూర్వకమైన అభినందనలు.

యండమూరి వీరేంద్రనాథ్

సీరియల్

డబ్బు డబ్బు

(జరిగిన కథ)

టేప్‌లో సంభాషణ విన్న హారిక నిర్ణయం మారింది.... సిటీలో దారుణమైన స్ట్రైక్- కొల్పుల్లో వార్డ్ బాయ్ మృతి.... గాంధీ రామ్మోహనరావుల భేటీ- లొంగిపోయే ప్రపోజల్‌ని ఇరిటేట్ చేశాడు రామ్మోహన్‌రావు. డ్రాస్టిక్ యాక్షన్ కోసం హోం మినిష్టర్‌తో భేటీ- లక్ష్మి నిరాహారదీక్ష. గాంధీ ఐడియాతో స్ట్రైక్‌కి దెబ్బ.... ప్లేన్‌లో ఢిల్లీ వెళ్ళబోయే గాంధీకి దుర్వార్త- లక్ష్మి సూసైడల్ ఎటెంప్ట్.

-ఇక చదవండి-

అతడు విసిరేసిన రిసీవరు గాలిలో వూగుతూంది.... అతడి మనసులాగే.

ఆస్పత్రిలో లక్ష్మిని వూహించుకున్నాడు. వళ్ళంతా కాలిపోయి....మృత్యువుతో పోరాడుతూ....

దీనికి కారణం తనేనా........

ఊహూ - ఆలోచించటానికి ఇదికాదు టైమ్. మైక్‌లో విమానం బయల్దేరటం సంగతి చెప్పబడుతూంది. అతడికో క్షణంపాటూ ఈ ప్రయాణం అదీ మానుకొని ఆస్పత్రికి వెళ్ళాలన్న కోరిక బలంగా కలిగింది. కానీ వెంటనే తన ఆలోచన తనకే చిత్రమనిపించింది. ఈ విమానంలో తనతోపాటే హోంమినిస్టర్ వస్తున్నాడు - అక్కడ ప్రధానమంత్రి తమ రాకకి ఎదురుచూస్తూ వుంటాడు.

అతడు విద్యార్థివైపు చూసేడు.

"ఏ డాక్టరు లక్ష్మిని చూస్తున్నది ?"

"క్యాజువాలిటి"

"నువ్వు వెంటనే డాక్టర్ ఘోష్‌ని తీసుకెళ్ళు. అతని సలహామీద ఇంకెవర్నన్నా స్పెషలిస్ట్ సర్వీసెస్ కావాలంటే ఏర్పాటు చెయ్యి. ఐ వాంట్ ది బెస్ట్ ట్రీట్‌మెంట్. బైదిబై నీ దగ్గర డబ్బేమన్నా వుందా -?"

"యస్.బీ.లో ఐదువేలదాకా వుండొచ్చు"

గాంధీ చప్పున బ్రీఫ్‌కేస్‌లోంచి చెక్‌బుక్ తీసి నాలుగు చెక్కులు సంతకం పెట్టి ఇస్తూ "కరెంట్ ఎకౌంట్‌లో లక్షదాకా వుంటుంది. ఎంత డబ్బు ఖర్చయినా వెనుకాడకు. నేను వచ్చేసరికి లక్ష్మి మామూలు మనిషి కావాలి. ప్రతీ రెండు గంటలకీ ఢిల్లీలో నాకు ఫోన్‌చేసి పరిస్థితి ఎలా వున్నదీ వివరించు. హోటల్‌లో నేను లేకపోతే మెసేజి పెట్టు." అంటూ హడావుడిగా రన్‌వే వైపు పరుగెత్తాడు.

విద్యార్థి అతడివైపే చూస్తున్నాడు. గాలికి అతడి చేతిలో చెక్కులు వూగుతున్నాయి.

ం ం ం ం

నాలుగూనలభై అయిదుకి హోం మినిస్టరు, గాంధీ వున్న కారు ప్రధానమంత్రి కార్యాలయంలోకి ప్రవేశించింది. సరిగ్గా అయిదింటికి ప్రధానమంత్రి గదిలోకి ఆహ్వానం వచ్చింది. హోంమినిస్టరు ప్రధానమంత్రికి గాంధీని పరిచయం చేస్తూ "ఆంధ్రరాష్ట్రపు పేపరు ఉత్పత్తిని కంట్రోలు చేస్తున్న ముగ్గురు పారిశ్రామికవేత్తల్లో ఒకరు"గా వర్ణించారు. ప్రధానమంత్రి చెయ్యి సాచేరు. గాంధీ దాన్ని అందుకుని షేక్‌హాండ్ ఇచ్చాడు. ఇస్తూంటే అతడి మనసంతా అదో రకమైన ఉద్విగ్నతలో నిండిపోయింది. మెడికల్ షాప్‌నుంచి రిక్షా డబ్బుల్లేక పరుగెత్తిన స్టేజీనుంచి.... అయిదు సంవత్సరాల్లో, దేశంలోకెల్లా అత్యున్నత పదవిలోవున్న ప్రధానమంత్రితో సంభాషణలు జరపగల స్థాయికి చేరుకోవటం !

ఇదంతా స్వశక్తా ? అదృష్టమా ??

ప్రధానమంత్రి ఏదో అడగటంతో ఆలోచన్లనుంచి తేరుకుని ఈ లోకంలోకి వచ్చాడు. ఈ లోపులో కేంద్ర ఆర్థికమంత్రి కూడా వచ్చి చేరుకున్నాడు. సమావేశం ప్రారంభం అయింది.

ఆ తరువాత సంభాషణ పది నిమిషాలపాటూ జరిగింది. గాంధీ పరిస్థితి వివరించాడు. "నాది తటస్థవర్గం. నేను కాక మరో రెండు వర్గాలున్నాయి. ఒక వర్గం (రామ్మోహనరావుది) పేపరు ధర తగ్గించటానికికూడా సిద్ధపడుతూంది. దీనికి కారణం రిటైలర్సు వీరి క్రింద వుండటమే. ఇంకోవర్గం (అంజిరెడ్డిది) ఆ ధరకి సప్లయి చెయ్యలేమన్న నెపంతో మిలును మూసుకుని కూర్చుంది. ఇదీ రాష్ట్రంలో పరిస్థితి".

"మిగతా రాష్ట్రాల్నుంచి పేపర్‌ని పంపిస్తే ?"

"సమస్య పేపరు కాదు." అన్నాడు కేంద్ర ఆర్థికమంత్రి సుహార్తో భాదరి. "- నోట్‌బుక్స్-టెక్స్ట్‌బుక్స్ ప్రింటింగ్ విషయంలో ఎడ్యుకేషన్ మినిస్టర్ సరయిన శ్రద్ధ తీసుకోలేదు. కొన్ని లక్షల పుస్తకాలు ప్రింటవ్వాలి ఇంకా...."

"ఇంత చిన్నపనే చెయ్యలేనివాడు చీఫ్ మినిస్టర్ అవుదామని ప్రయత్నిస్తు న్నాడే" అంటూ నవ్వేరు ప్రధానమంత్రి. ఈ గదిలో కూర్చొనే ఈయన అన్ని విషయాలు తెలుసుకుంటాడనుకుంటా' అనుకున్నాడు గాంధీ. నిజానికి విద్యాశాఖా మంత్రి ఇలా జాప్యం చెయ్యటానికి కారణం రాష్ట్రంలో అల్లర్లు పెరగాలనే. యీ విషయంకూడా యీయనకి తెలుసునేమో....

"గవర్నమెంటు ప్రెస్సులు ఏం చేస్తున్నాయ్?"

"బ్యూరోక్రసీ - వర్క్ టు రూల్ నెపంమీద స్ట్రయికు చేస్తున్నారు."

ప్రధానమంత్రి ఆలోచనలో పడ్డారు. ఆయన దేనిగురించి ఆలోచిస్తున్నారో తెలీదు. కొంచంసేపు అయ్యాక ఆయన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "మనం ఏదైనా డ్రాస్టిక్ యాక్షన్ తీసుకుంటే మిల్లులవాళ్ళు కోర్టుకు వెళ్తారా ?" అని అడిగారు.


"వెళ్ళరు. వాళ్ళిద్దరూ చెరో మినిస్టర్‌కీ కావల్సినవాళ్ళు. అంత తొందరగా బైటపడ్తారనుకోను. అసంతృప్తి వర్గంగా మిగుల్తారంతే" అన్నాడు ఫైనాన్స్ మినిస్టర్.

"రామ్మోహనరావు ముఖ్యమంత్రిని బాగా సపోర్ట్ చేస్తున్నాడనుకుంటా - మరి అంజిరెడ్డి ?"

"విద్యాశాఖా మంత్రిని"

మొత్తం అంతా అర్థమయిపోయినట్టూ ఆయన నవ్వేరు. గాంధీవైపు తిరిగి, "మీ ప్రపోజల్ ఏమిటి ?" అన్నారు.

"రాష్ట్రంలో గోడౌన్స్‌లోవున్న సరుకంతా బైట పెట్టేటట్టు వుత్తర్వు ఇస్తాం. మన భవిష్యత్తు కార్యక్రమం - మన రాజకీయవుటాలోచనలు చెప్పకుండా అంజిరెడ్డినీ, రామ్మోహనరావునీ కాంట్రాక్టులు సంతకం చేయిస్తాం. బియ్యంలాగే, పేపరుకూడా ఆ ఉత్పత్తిలో సగం, ప్రభుత్వానికి లెవీ ధరకి ఇప్పించేటట్టూ మిల్లు అధికారుల్ని వొప్పిస్తాం. ఆ లెవీధరని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. నోట్ పుస్తకాల తయారీనీ, టెక్స్ట్ పుస్తకాల ప్రింటింగ్‌నీ ప్రభుత్వం రాష్ట్రంలోవున్న ప్రైవేటు ప్రెస్సులకు కాంట్రాక్టు ఇచ్చి నిర్ణీతమైన కాలంలో ఇవ్వమని శాసిస్తుంది. ఇదంతా యుద్ధ ప్రాతిపదికమీద జరగబోతున్నట్టు రాష్ట్ర ప్రజలకు ప్రకటన ఇస్తాం. దాంతో అలజడి, స్ట్రయికు తగ్గిపోతాయి".



తనకి నాలుగు గాలిపటాలు చిక్కుకున్నాయి! అవీ ఒడాయి!!!

ప్రధానమంత్రి నవ్వి "అలజడీ, స్ట్రయికూ తగ్గటానికి అదికాదు మందు వాళ్ళకి కావల్సింది అధికారంలో మార్పు" అంటూ ఫైనాన్స్ మినిస్టర్ వైపు తిరిగి, "ఈ లెవీధర నిర్ణయించటం అన్న ఆలోచన ఎలా వుంది ?" అని అడిగారు.

"సూపర్బ్" అన్నారు సుహాస్తో చౌదరి.

"ఇంకేమన్నా విషయం చెప్పవలసింది వుందా ?"

"ఉంది"

"ఏమిటి ?"

"సోల్ సెల్లింగ్ ఏజెంట్లు ఉత్పత్తిదారుల మీద కోర్టుకు వెళ్ళకుండా చూడాలి. ప్రభుత్వం అంటే భయపడతారేమోకానీ, మమ్మల్ని బ్రతకనివ్వరు. అందుకని-"

"ఊ ! అందుకని -?"

"పేపరు పరిశ్రమలో సోల్ సెల్లింగ్ ఏజెన్సీని తాత్కాలికంగా BAN చేస్తూ ఆర్డినెన్స్ కావాలి."

ఆ గదిలో సూది పడితే వినబడేటంత నిశ్శబ్దం వ్యాపించింది. తను ప్రధానమంత్రిని చాలా ఇరుకులో పెడ్తున్నానని గాంధీకి తెలుసు. కానీ "ఇవ్వు - తీసుకో" పద్ధతిలో ఇదంతా తప్పదు. ఆయన వ్యవహార దక్షత ఇప్పుడు బైట పడుతుంది. తన భవిష్యత్తంతా ఆయన తీసుకోబోయే నిర్ణయం మీద ఆధారపడి

వుంటుంది. రామ్మోహన రావుకి విద్యార్థి వ్రాసిచ్చిన అగ్రిమెంటు కాన్సిల్ అవ్వాలి అంటే ఆయన ఈ నిర్ణయం తీసుకోవాలి.

ప్రధాన మంత్రి కేంద్ర ఆర్థిక మంత్రివైపు "ఏం చేద్దాం" అన్నట్టు చూసేరు.

"గాంధీ చెబుతున్న కారణం సరి అయినదిగానే కనబడుతూంది". అంటూ సుహోర్తో ఛాదరి ఆటు ఓటు వెయ్యడంతో ప్రధానమంత్రి మరి ఆలోచించకుండా "ఓ.కే" అన్నారు.

కేవలం ఒక తెల్లవారు ఝామున అడవిలో పిట్టల్ని వెతుక్కుంటూ వెళ్ళిన పరిచయం తనకి ఇంతగా వుపయోగపడుతుందనుకోలేదు గాంధీ. "థాంక్యూ సర్-థాంక్యూ."

"వీటన్నిటివల్లా మనకి రాష్ట్రంలో వ్యతిరేకత వస్తుందేమో ..." సందేహం వెలిబుచ్చారు.

"అంజిరెడ్డి మన 'పార్టీ'ని కాదనడు. ఒప్పుకోనిదల్లా రామ్మోహనరావే."

"మరెలా ?"

"ఆఖరి ఆయుధం ద్వారా బెదిరించి ఒప్పించాలి"

"ఏమిటది ?"

"నేషనలైజేషన్"

సమావేశం మధ్యలో హోం మినిస్టర్ ఢిల్లీనుంచి లైటినింగ్ కాల్ చేసి పరిస్థితి వివరించి అతడి నిర్ణయం అడిగాడు.

"ఎవరొప్పుకున్నారు ఇదంతా ?" అట్నుంచి అడిగాడు రామ్మోహనరావు.

"గాంధీ"

"నేను చచ్చినా దీనికి ఒప్పుకోను" గాంధీ పేరు వినగానే రామ్మోహనరావు అట్నుంచి ఆవేశంతో అరిచాడు.

"కానీ రాష్ట్రంలో శాంతి సుస్థిరతా సాధించాలంటే మీరీ పనికి ఒప్పుకోవాలి."

"ఒప్పుకోను"

గాంధీ నిర్లిప్తంగా యీ సంభాషణ వింటున్నాడు. అతడు అనుకున్నట్టుగానే, తన పేరు రాగానే రామ్మోహనరావు ఆవేశంతో "తప్పుడు" నిర్ణయం తీసుకుంటున్నాడు. తీసుకోనీ. అదే తనకి కావలి ంది.

"మీరు ఒప్పుకోకపోతే మేం మరింత కఠినమైన నిర్ణయం తీసుకుంటాం" అన్నాడు ఫోన్లో హోం మినిస్టరు గాంధీ అతడికి సరిగ్గా ఇలాగే మాట్లాడమని చెప్పాడు. అట్నుంచి మాట్లాడుతున్న రామ్మోహనరావుకి ఇటు ఫోన్ పక్కన సెంట్రల్ ఫైనాన్ మినిస్టర్ వున్నాడని తెలీదు.

ఏమిటా కఠినమైన నిర్ణయం" వ్యంగ్యంగా అడిగాడు.

"చెప్పానుగా. పేపర్ పరిశ్రమని జాతీయం చెయ్యటం -"

ఆ మాటలకి రామ్మోహనరావు మరింత మండిపడి "మీరు రాష్ట్రానికే మంత్రి అన్న విషయం మర్చిపోతున్నట్టున్నారు. కేవలం ఒక రాష్ట్రంలోనే నేషనలైజ్ చేస్తారా! చెయ్యండి చూద్దాం" అని ఫోన్ పెట్టేసేడు. ఈ మాటలన్నీ తూ.చ. తప్పకుండా ప్రధానమంత్రిని చేరుకున్నాయ్. "ఒక రాష్ట్రంలో పరిస్థితి ఇంత అల్లకల్లోలంగా వున్నప్పుడు, అంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్న ఆ రామ్మోహనరావు ఎవరు?"


ఎవరు?"

ప్రస్తుత ముఖ్యమంత్రి అండ చూసుకుని ఇలా పేట్రేగిపోతూన్న ఒక పారిశ్రామికవేత్త."

"కొంచం తగ్గించండి" తాపీగా అన్నారాయన.

(ఇది జరిగిన పది రోజులకి రామ్మోహనరావు ఫ్యాక్టరీ కార్మికుల్లో మెజారిటీ వర్గం మెరుపు సమ్మె చేసింది. అధికారంలో వున్న రాజకీయ పార్టీ అండ వున్న కార్మికవర్గం అది. అకారణంగా ప్రభుత్వం తన తరపున మనిషిని మేనేజిమెంట్‌లో నామినేట్ చేసింది. అంతేకాక శివకైలాస్ బ్యాంక్ డైరెక్టర్‌గా రామ్మోహనరావుని తీసేస్తూ ఉత్తర్వులు వెళ్లాయి. అసలు కారణం తెలియని రామ్మోహన రావు ఈ దెబ్బ మీద దెబ్బకి తట్టుకోలేకపోయాడు - డబ్బుపోయినా పర్లేదు - పారిశ్రామికవేత్తకి పరువుపోతే కష్టం - అన్నది అతడు భారతదేశాన్ని వదిలి వెళ్ళిపోతూ డైరీలో వ్రాసుకున్న ఆకరి వాక్యం.)

"ఇప్పుడు మనం చర్చించినదాంట్లో లీగల్ కాంప్లికేషన్స్ ఏమైనా వున్నాయేమో చూడండి. ఏది ఏమైనా రెండురోజుల్లో రాష్ట్ర పరిస్థితిమీదా-- మన నిర్ణయం మీదా నేనొక ప్రకటన ఇవ్వాలి. అన్నీ సిద్ధం చేయండి" అంటూ లేచారు. ఆయన్తోపాటే అందరూ లేచి నిలబడ్డారు.



"మీరు తిరిగి ఎప్పుడు వెళ్తున్నారు?" రాష్ట్రమంత్రిని అడిగారు ప్రధానమంత్రి.

"ఈ సాయంత్రమే" అన్నాడు హోం మినిస్టర్. "రాష్ట్రంలో పరిస్థితి బావోలేదు."

"రేపుకూడా ఉండండి." సాలోచనగా అన్నారు ప్రధానమంత్రి. "పేపరుతోపాటూ రాష్ట్రంలో పరిస్థితీ వెంటనే బాగుపడే రాజకీయ నిర్ణయం కూడా తీసుకుందాం."

అందులో అర్థం బోధపడి హోం మినిస్టర్ మొహం వెయ్యికాండిల్ బల్బ్‌లా వెలిగిపోయింది. అందరూ వున్నారని వూరుకున్నాడుగానీ లేకపోతే గాంధీని గాలిలోకి ఎత్తేసేవాడే.

....

ఆతరువాత పరిస్థితుల్లో తొందర తొందరగా మార్పొచ్చింది. ముఖ్యమంత్రి మారటంతో ప్రతిపక్షాలు తమ పట్టు సడలించుకున్నాయి. పేపర్ కంట్రోలు పెట్టి వారంలోగా టెక్స్ట్‌బుక్స్ రిలీజ్ చేస్తామని ప్రధానమంత్రి స్వయంగా ప్రకటించడంతో విద్యార్థి నాయకులు చల్లబడ్డారు. అలాగే పుస్తకాలు మార్కెట్టులో కొచ్చాయి. స్ట్రైక్ కాలాఫ్ అయింది.

○ ○ ○ ○

"ఇది అన్యాయం చేతులో పేపరు విసిరికొడ్తూ అన్నాడు, అంజిరెడ్డి ఢిల్లీలో ఒక పెద్ద హోటల్‌రూమ్‌లో గాంధీ ఎదురుగా అతడు ఆవేశంతో పచార్లు చేస్తున్నాడు.

ఈ నాటకీయమైన ముగింపుకి అందరికన్నా ఎక్కువగా షాక్ తిన్నవాడూ, మండిపడినవాడూ అతడే. అయితే గాంధీ అతడు చిందులు తొక్కినంతసేపూ తాపీగా కూర్చొని, ఆ తరువాత సోఫాలోంచి లేచాడు.


"నేనిదంతా మీ దగ్గిర్నుంచే నేర్చుకున్నాను. ఒకరకంగా ఈ రంగంలో మీరు నాకు గురువులు. మీరు నాకు చెప్పిన మొదటి పాఠం ఈ రంగంలో ఎవరూ ఎవరికీ ఏమీకారని - తనకోసం ఏపనైనా చేయొచ్చనీ. అదే సూత్రాన్ని మీమీద ప్రయోగించాను. ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవటంద్వారా విద్యాశాఖా మంత్రి ఆఖరి చదరంగపు ఎత్తువేసి ముఖ్యమంత్రి అవుతాడని మీరన్నారు. ఆ ఎత్తు ఏమిటాఅని బుర్ర బద్దలు కొట్టుకొని ఆలోచించాను. అదృష్టవశాత్తు అది స్ఫురించింది. మీరన్నారు జ్ఞాపకం ఉందా- 'పేపరు బిజినెస్సుకన్నా ముఖ్యమంత్రి బిజినెస్సు వందరెట్లు పెద్దది' అని. అదేదో నేనో ఎందుకు చెయ్యకూడదని అనిపించింది. సారీ గురువుగారూ...."

అంజిరెడ్డి వస్తున్న కోపాన్ని తమాయించుకుని, "అంత గొప్ప ఆలోచన నీకు స్ఫురించిందే అనుకో- దాన్ని మా విద్యాశాఖామంత్రి కోసమే ఉపయోగించవచ్చుగా-- మధ్యలో హోం మినిస్టర్‌ని పైకి లాగటం ఎందుకు?" అన్నాడు.

"ఇదికూడా మీరు చెప్పిన విద్యే గురూగారూ. విద్యాశాఖామంత్రి రెడ్డి కాబట్టి- హోం మినిస్టరు కమ్మ కాబట్టి- నాదీ అదే కులంకాబట్టి"

అంజిరెడ్డి పళ్లు పటపటలాడించి, " ఈ విజయాన్నంతా నువ్వు శాశ్వత మనుకుంటున్నావా?" అని అరిచాడు.

గాంధీ నవ్వేడు. "రాజకీయాల్లో ఎవరి విజయమూ శాశ్వతం కాదు అని మీకూ తెలుసు. పాతిక సంవత్సరాలుగా మకుటంలేని మహారాజులా పాలిస్తూ వచ్చారు యీ ఫీల్డుని. ఏదో చిన్నదెబ్బ నామూలాన తగిలిందే అనుకోండి. చూసీ చూడనట్టు కాస్త వదిలెయ్యలేరా- నన్నూ ఓ యాభై లక్షలు చేసుకో నివ్వండి. నా పందెం టైము దగ్గర పడుతూంది."



గాంధీ చిన్నపిల్లాడిలా మాట్లాడేసరికి అంజిరెడ్డి మొహంలో కోపం తాలూకు ఛాయలు తగ్గినయ్ కొద్దిగా "నువ్వు నన్ను కొట్టిన దెబ్బ ఎంత పెద్దదో నీకు తెలియటం లేదు. యీ పాతిక సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎవరూ నన్ను కలలోకూడా ఇలా చేయగలమని అనుకొని వుండరు తెలుసా?" అన్నాడు వెళ్ళటానికి ఉద్యుక్తుడవుతూ.

"మనవూరు వెళ్ళాక 'గురువుని మించిన శిష్యుడు' సినిమా కలిసి చూద్దాం."

"నో థాంక్స్ - యూ బ్రూటస్" అని అంజిరెడ్డి వెళ్ళిపోబోతూంటే "ఒక్కమాట" అన్నాడు గాంధీ. గుమ్మం దగ్గర అతడు ఆగేడు. గాంధీ అతడి దగ్గిరకి వెళ్ళి చెయ్యి చాచి, "కెన్ వియ్ షేక్ అవర్ హాండ్స్?" అని అడిగాడు. అంజిరెడ్డి గాంధీ కళ్ళలోకి సూటిగా ఒక్కక్షణం చూసి, చెయ్యి అందిస్తూ "గెలిచానని సంబరపడబోక. ఎప్పుడో ఒకప్పుడు నిన్ను చితకబాదేస్తాను" అన్నాడు.

"అంతటి సమర్థులే మీరు. పోతే యీ కథకు సంబంధించినంతవరకూ వదిలిపెట్టేయండి పాపం నన్ను" అన్నాడు గాంధీ.

అంజిరెడ్డి వెళ్ళిపోయాడు. అతడి వెనుకే తలుపు మూసుకుపోయింది. గాంధీ మొహంలో సడెన్‌గా మార్పొచ్చింది. ముందున్న చిలిపితనం పోయింది. టేబిల్ దగ్గరకు వెళ్ళి కాగితాలు చేతిలోకి తీసుకున్నాడు.

అవన్నీ టెలెక్స్ మెసేజిలు. లక్ష్మి పరిస్థితిమీద ఆస్పత్రి నుంచి. ప్రతీ రెండుగంటలకీ విద్యార్థి పంపుతున్నవి! వరుసగా ఒక్కొక్కటీ చదవసాగేడు.... అలాగే వుంది. కొద్దిగా సీరియస్అయింది— పరిస్థితి విషమిస్తూ వుంది. ఆక్సిజన్ పెట్టారు. కండిషన్ క్రిటికల్. స్టార్ ఇమ్మీడియట్లీ..

'స్టార్ ఇమ్మీడియట్లీ' అన్న చివరి టెలెక్స్ పట్టుకుని వుండిపోయాడు గాంధీ. ఎలా? బయల్దేరటం? కొత్త ముఖ్యమంత్రినుంచి తను పొందవలసిన సహాయం ఇంకా పొందలేదు. ఈ లావాదేవీలన్నీ ఢిల్లీలోనే పూర్తయితే తనకి మంచిది, తన ముందున్నది హిమాలయ పర్వతమంత పెద్దపని. పందొమ్మిదో తారీఖు ఎంతో దూరంలో లేదు.

హోటల్నుంచి అతడు ఆస్పత్రికి ట్రంక్ కాల్ చేసాడు. అట్నుంచి విద్యార్థి ఎత్తుకున్నాడు.

"ఎలావుంది".

"కష్టం అంటున్నారు డాక్టర్లు. బాగా విషమించింది."

"డామిట్!" అరిచాడు గాంధీ. "- వాళ్ళకి చేతకాకపోతే జెస్లోక్ కి తీసుకు వెళ్తామని చెప్పు. డబ్బుకి వెనకాడవద్దని చెప్పానుగా"

అట్నుంచి విద్యార్థికూడా కంఠం పెద్దదిచేసి "డాక్టర్లకీ డబ్బుకీ లోటులేదు. మీరు వెంటనే ఎందుకు రారు? ఇక్కడ పరిస్థితి ఎలావుందో మీకు తెలుస్తూందా అసలు" అన్నాడు. గాంధీ గతుక్కుమన్నాడు. ఎప్పుడూ నమ్రతగా, నెమ్మదిగా వుండే విద్యార్థే ఇంత ఇలా ఇరిటేట్ అవుతున్నాడంటే లక్ష్మి పరిస్థితి ఎలా వుందో తను వూహించుకోగలడు.

"ఓ.కె, నేను రెండుమూడు రోజుల్లో వస్తున్నాను. ఇలాగే ఎప్పటికప్పుడు నాకు పొజిషన్ చెప్తూవుండు." అని ఫోన్ పెట్టేశాడు.

బైట అతడికోసం కేంద్ర ఆర్థికమంత్రి తాలూకు కారు ఎదురుచూస్తూంది. రెండు కోట్ల రూపాయల పెట్టుబడితో నెలకొల్పబడే పరిశ్రమ తాలూకు చర్చ కోసం.

29

"అమ్మా హారికా" అంటూ లోపలికి వచ్చాడు రామ్మోహనరావు. ఆయన చేతిలో ట్రావెలింగ్ ఏజెంట్ తాలూకు కాగితాలు వున్నాయి. "వచ్చే గురువారమే మన ప్రయాణం."

కిటికీ దగ్గర నిలబడి బైటకు చూస్తున్న హారిక వెనక్కి తిరిగింది. ఆమె తలంటుకొని వుండడంవల్ల కిటికీలోంచి వచ్చేగాలికి ముంగురులు నెమ్మదిగా వూగుతున్నాయి. ఆమె కనురెప్పల క్రింద నీలినీడ ఆ సాయంత్రపు మసకచీకట్లో అస్పష్టంగా మెరుస్తూంది.

"ఎప్పుడు నాన్నా ప్రయాణం?"

"పద్దెనిమిదో తారీఖు సాయంత్రం ఫ్లయిట్‌కి".

"మొన్న పందొమ్మిదన్నావ్‌గా"

"ఒకరోజు ముందు వెళ్ళిపోదాం అమ్మా"

"భయమేస్తోందా నాన్నా"

నెమ్మదిగా ఆమె అడిగిన ప్రశ్నకి రామ్మోహనరావు చప్పున తలెత్తి చూసేడు. కూతురు తనవైపే చూస్తూవుండడం గమనించి చూపు తిప్పుకున్నాడు.

"పందొమ్మిదో తారీఖు సాయంత్రం వెళ్తాం నాన్నా. ఫ్లయిట్ టైముకూడా మనగురించే సరీగ్గా పెట్టినట్టున్నారు ...అయిదుగంటలా అయిదు నిముషాలకి."

"కానీ.."

"నీకేం భయంలేదు నాన్నా! నిన్ను ఇంత దారుణంగా ఓడించినవాడు నీ అల్లుడవడులే"


రామ్మోహనరావు మొహం పాలిపోయింది. "అంటే.... అంటే"అన్నాడు. ఆతరువాత ఏం మాటాడాలో తెలియడంలేదు.

"మీ పందెం గురించి నేను మాట్లాడటంలేదు నాన్నా. గాంధీ అది గెలుస్తాడో లేదోకూడా నాకు తెలీదు. అందుకే ప్రయాణాన్ని పందొమ్మిదో తారీఖుకి వాయిదా వెయ్యమంటున్నా. యీ నాటకపు ఆఖరి అంకాన్ని చూసే వెళ్ళిపోదాం.... తెరజారేక."

"నీ మాటలు నాకేం అర్థంకావటంలేదమ్మా. నాకేదో భయంగావుంది."

ఆ అమ్మాయి మొహంలో సడెన్‌గా మార్పొచ్చింది.

"నీ కూతురుకీ ఒక వ్యక్తిత్వం వుంటుందన్న విషయం మర్చిపోయి ఆమెనో వస్తువులాగా పందెంలో వొడ్డినప్పుడు నీ ఈ భయం ఏమైంది నాన్నా నీ ప్రత్యర్థి ఎంత బలమైనవాడో తెలుసుకోకుండా అతడితో తలపడి సర్వం కోల్పోతున్నప్పుడు- అప్పుడు ఈ భయం ఏమైంది"



రామ్మోహనరావు తడబడి "అంటే.... అంటే నిజంగా అతడు గెలవబోతున్నాడా?" అని అడిగాడు.

"లేదు నాన్నా. నేనూ ఇంకొకరూ కలిసి వేసిన యీ ఆట తాలూకు చివరి ఎత్తుతో గాంధీ పూర్తిగా ఓడిపోబోతున్నాడు".

రామ్మోహన్‌రావ్ మొహంలో సంతోషం ప్రతిబింబించింది.

"నువ్వూ - ఇంకొకరూనా? ఎవరా ఇంకొకరు?" అని ప్రశ్నించాడు ఆత్రంగా.

"ఆ ప్రశ్నకి జవాబు మనం శాశ్వతంగా యీ దేశాన్ని వదిలి వెళ్ళిపోతున్నప్పుడు - విమానంలో చెప్తాను." ఆమె కంఠంలో కనిపించిన విషాదానికి విచలితుడై, ఆమె దగ్గరకు వెళ్ళాడు.

ఆమె కిటికీవైపు తిరిగివుంది. అతను తడబడే కంఠంతో "నేను.... నేనిలా డబ్బు సంపాదనమీద పందెంకట్టి నీ మనసు నొప్పించానా అమ్మా" అని ప్రశ్నించాడు.

ఆమె వెనుదిరగలేదు. అటే చూస్తూ అన్నది "డబ్బుకన్నా ప్రేమను సంపాదించుకోడం కష్టం నాన్నా పందెం అదే అయితే గాంధీ ఒకసారి కాదు.... రెండుసార్లు గెలిచాడు."

"నాకేం అర్థం కావటంలేదమ్మా"

"హిందీలో ఒక సామెత వుంది నీకు తెలుసా?" ముగింపువరకు తీసుకు రాలేని కథని మలుపుత్రిప్పి ఆపెయ్యి." అని. అదే ఇప్పుడు జరుపు అవ

పోతుంది నాన్నా. నువ్వు నిశ్చింతంగా వుండు. గాంధీ పందెం గెలిచి నీమీద యుద్ధానికి రాబోవటంలేదు".

"చివరి క్షణంలో ఆఖరి ఎత్తువేసి గాంధీని ఓడించి మనకు సాయపడబోతున్న ఆవ్యక్తి ఎవరో ముందేచెప్తే నేను వెళ్ళి కృతజ్ఞతలు చెప్తాగా"

"నువు అనుకున్నంత దారుణంగా గాంధీ ఏమీ ఓడిపోబోవటంలేదు. ఇంతకన్నా పెద్ద పందేన్ని ఎదుర్కోబోతున్నాడు. నన్ను ఓడి దాన్ని గెలుస్తాడా, మనల్ని గెలిచి దాన్ని ఓడతాడా- చూద్దాం."

"అంటే........"

దానికి సమాధానం చెప్పకుండా "నన్ను కొంచంసేపు ఒంటరిగా వదిలి పెట్టు నాన్నా" అంది హారిక.

రామ్మోహనరావు ఏదో అనబోయి వూరుకొని, వెనుదిరిగి వెళ్ళిపోయాడు. హారిక అలాగే బయటకు చూస్తూ వుంది. ఆమె కంఠం మామూలుగానే వుండటంతో అతడికి అనుమానం రాలేదుకానీ లేకపోతే ఆమె బుగ్గలమీద జారుతున్న కన్నీటి ధారల్ని చూసి వుండేవాడే.

ㅤㅤㅤㅤoo ㅤㅤㅤㅤoo ㅤㅤㅤㅤoo


"వాయువేగ్"

భారతదేశంలోకెల్లా శ్రేష్ఠమైన కార్లు తయారుచేసే కంపెనీ అది. షా అండ్ షా లిమిటెడ్. ఢిల్లీ నుంచి సంవత్సరానికి ఇరవైవేల కార్లు తయారుచేసే సంస్థ.

కేంద్రంలో అధికారంలో వున్న రాజకీయ పార్టీ అధ్యక్షుడి అల్లుడు దాని మానేజింగ్ డైరెక్టరు. అతడిమీద ఒత్తిడి తీసుకొచ్చి కాంట్రాక్టు పూర్తి చేయించారు. ఆర్థికమంత్రి సాయంతో రెండ్రోజుల్లో లైసెన్సు లభించింది. అంతకు మునుపే కంపెనీ రిజిష్టరు అయింది. ఇరవై లక్షల పెట్టుబడితో షా అండ్ షాకి సబ్సిడీ కంపెనీ తయారైంది. అదేరోజు పేపర్లలో ఒక అందమైన ప్రకటన వెలువడింది.

మీరు ఒక స్కూటర్ కావాలనుకుంటున్నారా!

భారతదేశపు అత్యంత ఆధునాతనమైన కార్ల తయారీ కంపెనీ 'వాయువేగ్'- స్కూటర్ల ఉత్పత్తిని ప్రారంభిస్తుంది. దేశంలో



తయారయ్యే అన్ని స్కూటర్లకంటే మిన్నగా రూపొందించబడే ఈ స్కూటరు కేవలం మూడువేలకి మాత్రమే (ఇక్కడ ఒక స్కూటరు బొమ్మ ముద్రించబడింది. నిజంగా అది చాలా ఆకర్షణీయంగా వుంది). ఆశాభంగం పొందకుండా వుండటానికిగానూ వెంటనే మీ డీలర్ దగ్గరగానీ, కంపెనీకి అయిదువందల రూపాయిలు డ్రాఫ్టు పంపటం ద్వారాగానీ మీ పేరు రిజిస్టరు చేయించుకోండి.

అదీ ప్రకటన. భారతదేశపు అన్ని పేపర్లలోనూ ఒకేరోజు వచ్చింది. ఈ వార్త ప్రజల్లో గొప్ప సంచలనం రేకెత్తించింది బ్యాంకుల దగ్గర 'క్యూ' ల్లో నిలబడ్డారు జనం. 'వాయువేగ్' కంపెనీకి వున్న పేరు అలాంటిది. కార్ల తయారీలో అగ్రస్థానం వహించిన కంపెనీ స్కూటర్లు ఉత్పత్తి చేస్తుందంటే జనం ఎగబడటం సహజం. దానికి తోడు మార్కెట్‌లో వున్న స్కూటర్లు నాలుగైదువేలు బ్లాక్‌లో అమ్ముడుపోతున్నాయ్.

"మనం ఏ యంత్రసామగ్రీ లేకుండా ఫ్యాక్టరీ ఎలా ప్రారంభిస్తాం?" విద్యామంత్రి (ప్రస్తుత ముఖ్యమంత్రి) అడిగాడు.

గాంధీ చిరునవ్వుతో, "ప్రజల సొమ్ముతో-కొందాం" అన్నాడు. సంభాషణ ఫోన్‌లలో జరుగుతుంది. గాంధీ ఇంకా ఢిల్లీలోనే వున్నాడు.

"కోటి రూపాయలదాకా కావాల్సివుంటుంది."

"ప్రజలే ఇస్తారు"

"నాకు నమ్మకం లేదు" అన్నాడాయన. ఆయన రాజకీయాల్లో పడి పోయాడే తప్ప బిజినెస్ వ్యవహారాలు తెలియవు.

"పోనీ మీ షేరు అమ్మేస్తారా?"

"ఎంతకి?"

"ఇరవై లక్షలకి"

ఆయన వూపిరి బిగపెట్టి "ఎంత?" అని అడిగాడు.

"ఇరవై లక్షలు. మీరు వొప్పుకుంటే రేపు నేను తీసుకొచ్చి ఇస్తాను. రేపు ప్రొద్దున్నే విమానంలో వస్తున్నాను".

"రేపు నేను మావూరు బేతంచెర్ల వెళ్తున్నాను".

"అక్కడికే తీసుకొచ్చి ఇస్తాను"

"సరే"

గాంధీ ఫోన్ పెట్టేసాడు.

రేపు.

రేపటికల్లా తన ప్రకటన చదివి ప్రజలు అంతడబ్బు డిపాజిట్టు చేస్తారా.... చేసారు.

ఆ మరునటి రోజు— డీలర్ల దగ్గర వసూలైన మొత్తమూ, డైరెక్టుగా డ్రాఫ్టుల రూపంలో వచ్చింది కలుపుకుంటే పదిలక్షలు తేలింది.

మరునటి రోజు గాంధీ ఢిల్లీనుంచి బయల్దేరాడు.

విమానాశ్రయంలో విద్యార్థి ఎదురు చూస్తున్నాడు.

"మిగతా డబ్బు రెడీ చేసావా?" గాంధీ అతడిని అడిగాడు. అతడి చేతిలోంచి బ్రీఫ్‌కేస్ తను అందుకుంటూ,

"విమానం దిగగానే మీరడిగే మొట్టమొదటి ప్రశ్న ఇంకొకటి అవుతుందనుకున్నాను" అన్నాడు.

"ఏమిటి?"

"లక్ష్మి ఎలావుందీ అని".

గాంధీ గతుక్కుమని "సారీ. లక్ష్మి ఎలావుంది" అన్నాడు.

"అలాగే వుంది. ఇంటెన్సివ్ కేర్‌లో పెట్టారు. ఇంకా ఆక్సిజన్ ఎక్కిస్తున్నారు".

"పద అక్కడికి వెళ్దాం. తనని చూసి, అట్నుంచి అటే మనం బేతంచెర్ల వెళ్ళాలి".

"ఎందుకు?"

మిగతా సంభాషణ కార్లో జరిగింది. కారు ఆస్పత్రివైపు వెళ్తోంది.

"ముఖ్యమంత్రి తాలూకు షేరు ఇరవైలక్షలకి కొనేసాను. మనం డిపాజిట్స్ ద్వారా ఇంతడబ్బు సంపాదించగలమని నమ్మకం కుదరటం లేదు. ఇదీ మనమంచికే. పూర్తి షేర్లన్నీ మనకే వుంటాయి".

"ఇందులో ముఖ్యమంత్రి పెట్టుబడి ఎంత?"

"అయిదుపైసల వాటా"

"నేనడిగింది పెట్టుబడి ఎంతా? అని."

గాంధీ నవ్వేడు. "ఏమీ లేదు."

విద్యార్థి అర్థంకానట్టు చూసేడు.

"వాయువేగ్ కంపెనీ మానేజింగ్ డైరెక్టర్‌ని వప్పించటానికీ, మన రాష్ట్రంలో కావాల్సిన లైసెన్సులు ఇప్పించటానికీ ముఖ్యమంత్రికి అయిదుపైసల వాటా ఇవ్వవలసి వచ్చింది."

"ఆయనకి మనమీద అంత నమ్మకం ఎలా కుదిరింది?"

"పేపర్ స్ట్రయిక్ మాన్పించి ఆయన ముఖ్యమంత్రి అయ్యేందుకు పరోక్షంగా సాయపడింది మనమే కదా. మళ్ళీ ఆయన మనస్సు మార్చుకోకముందే ఇరవై లక్షలూ ఆయనకి ఇచ్చెయ్యాలి."

"మనం ప్రజల్ని మోసం చెయ్యటం లేదుగా".

"లేదు లేదు, అంతా చట్టబద్ధంగానే చేస్తున్నాం. వచ్చే సంవత్సరం యీపాటికల్లా మన స్కూటరు మార్కెట్‌లో వుంటుంది. మనం చేస్తున్నదల్లా డిపాజిట్లు వసూలు చేయటమే. ఇదేమీ కొత్తకాదు. దేశంలో జరుగుతూవున్నదే. పోతే మనం కొద్దిగా పెద్ద ఎత్తులో ఆకర్షణీయంగా చేస్తున్నాం, అంతే...."

కారు ఆస్పత్రిముందు ఆగింది.

ఇద్దరూ లోపలికి దాదాపు పరుగెత్తుతున్నట్టు వెళ్ళారు. విద్యార్థి వెళ్ళి నర్సుతో

మాట్లాడాడు. దూరంనించి చూస్తున్న గాంధీకి అతడి మొహంలో టెన్షన్, దిగులూ కొట్టొచ్చినట్టు కనబడింది. గాంధీ దగ్గరకు వస్తూ "ఆపరేషన్ ధియేటర్ కి తీసుకెళ్ళారట".

గాంధీ వ్యాకులమైన కంఠంతో "ఆపరేషన్ ధియేటర్ గా మైగాడ్" అన్నాడు. అతడికి ఓ క్షణం ఏంచెయ్యాలో తోచలేదు. టైమ్ చూసుకున్నాడు. పన్నెండు కావొస్తుంది. బైట ఎండ తీక్షణంగా వుంది.

"ఎంతసేపు జరుగుతుందట ఆపరేషన్?"

"దాదాపు గంట"

"ఉహూ- అంత ఆలస్యం అయితే మళ్ళీ చీకటి పడిపోతుంది. ఇంత డబ్బుతో రాత్రివేళ ప్రయాణం మంచిదికాదు."

విద్యార్థి వులిక్కిపడి "ఏమిటి మీరంటున్నది?" అని అడిగాడు. గాంధి దాన్ని పట్టించుకోకుండా నర్స్ వైపు నడుస్తూ "ఈమేనా యీ వార్డ్ కి హెడ్ నరు" అని అడిగాడు. విద్యార్థి తలూపేడు. గాంధీ అయిదు వందరూపాయిల నోట్లు ఆమెకి చాటుగా అందిస్తూ "లక్ష్మి అనే పేషెంటు ఆపరేషన్ ధియేటర్ లో వుంది. ఆమె బయటకు రాగానే పోస్ట్ ఆపరేషన్ ట్రీట్ మెంట్ బాగా జరగాలి" అన్నాడు.

అంత డబ్బు ఒక్కసారిగా రావటం జీవితంలో మొట్టమొదటిసారి చూసిన నర్సు తబ్బిబ్బై, "తప్పకుండా! ఎవరికీ జరగనంత విధంగా నా స్వంత మనిషిలా చూసుకుంటా" అంది. గాంధి విద్యార్థి దగ్గరకివచ్చి 'పద' అన్నాడు.

"ఎక్కడికి?"


"బేతంచర్ల"

"ఇక్కడ పరిస్థితి ఇలా వుండగానా?"

"దానికన్ని ఏర్పాట్లూ చేసేంగా".

"లక్ష్మికి ఎలా వుంటుందో?"

"సాయంత్రానికి తిరిగి వచ్చేస్తాంగా" అన్నాడు గాంధీ. "లక్ష్మికి ఏమీ కాదూ అని నా మనసు చెబుతూంది. ఇదేదో అందమైన ఆత్మవంచన అనుకోక. మనం ఇక్కడ వుండి చేసేది ఏమీలేదు. ఈరోజు పోస్ట్ ద్వారాను. టి.టి.ల ద్వారానూ మరో పాతికలక్షలు వస్తాయని వూహిస్తున్నాను. ఈ విషయం చీఫ్



మినిస్టర్ కి తెలిస్తే తను ఆ అయిదుపైసల షేరే వుంచుకుంటానంటాడు. మనం ఎంత తొందరగా ఆయన డబ్బు ఆయనకి ఇచ్చేసి ఆయన్ని వదిలించుకుంటే మంచిది. పోతే ఇంత డబ్బుతో కార్లో డ్రైవర్ తో వెళ్ళటం ఇష్టంలేదు నాకు- అందుకే నిన్ను రమ్మంటున్నాను. వెధవ సెంటిమెంట్లు మానెయ్యి. లక్ష్మి నీకన్నా నాకెక్కువ!.... తనకేమీకాదు. SHE IS BEING ATTENDED BY THE CITY'S BEST DOCTORS. సెంటిమెంట్స్ వదిలి టైమ్ వాల్యూ గుర్తించు. రేపే పంధొమ్మిదో తారీఖు. రేపు సాయంత్రం అయిదింటిలోగా నా భవిష్యత్తు తేలిపోతుంది. లక్ష్మి అంటే నాకు ప్రేమ లేదనుకోక. కానీ నేను చెబుతున్నది ఏమిటంటే- బి ప్రాక్టికల్...."

విద్యార్థి కన్నార్పకుండా గాంధీవైపు చూసేడు. అకస్మాత్తుగా అతడి పెదవులమీద నవ్వు వెలసింది. "ప్రా....క్టి....క....ల్...." అన్నాడు. "....ఒకే పదండి వెళ్దాం".

o o o o o

వాళ్లు కర్నూలు చేరుకునేసరికి అయిదయింది. అక్కడ్నుంచి బేతంచర్ల వైపు వెళ్తూవుండగా టైరు పంచరయింది. వాళ్ళదగ్గిర జాకీ లేదు. ఆ రోడ్డు మీద వాహనాలు చాలా తక్కువ. అంతా రాళ్ళ ప్రదేశం రాయలసీమ పేరు సార్థకం చేసుకుంటున్నట్టు.

బాగా అలసిపోయి వుండటంవల్ల గాంధీకి నిద్రొస్తూంది. విద్యార్థి డ్రైవ్ చేస్తున్నాడు. ఆరింటికే చీకటి పడింది.

అంతలో కారు పెద్ద గుంటలోపడి కుదపటంతో గాంధీ కళ్లు విప్పాడు. దాహంతో గొంతు ఆర్చుకుపోతూంది. చుట్టూ పెద్ద బండరాళ్లు, మధ్యలో మట్టి రోడ్డు.

"మనం దారి తప్పేమనుకుంటా" అన్నాడు విద్యార్థి "మెయిన్ రోడ్డుమీద డైవర్షన్ అని వ్రాసి వుంది. దాంతో ఇటు తిప్పాను".

"నాకు దాహంగా వుంది"

"ఇప్పుడెలా ఇంత చీకట్లో"—

"కారు వెనక్కి తిప్పు"

"ఎడ్లబండి దారి ఇది. ఇక్కడ రివర్స్ అవదు"

"నాకు దాహంతో నోరు ఆర్చుకుపోతూంది"

విద్యార్థి కారు ఆపుచేశాడు. గాంధీవైపు చూసి నవ్వేడు. "నేను మీకన్నా బలమైన వాడిని కదా! ఎలా నన్ను నమ్మి ఇరవైలక్షలు తీసుకొచ్చారు?" అని అడిగాడు. అతడు సడన్‌గా యీ టాపిక్ తీసుకొచ్చేసరికి ముందు గాంధీకి అతడేం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. అర్థం అయ్యాక నవ్వేడు. "నువ్వు నన్నేం బెదిరించక్కర్లేదు. నువ్వెలాటి వాడివో— న్యాయానికి ఎంత గౌరవం ఇస్తావో నాకు తెలుసు" అన్నాడు.

విద్యార్థి కూడా నవ్వేడు. "నిజమే నేను న్యాయాన్ని గౌరవిస్తాను. మిమ్మల్ని గౌరవిస్తాను. నాకు తెలివుంది. మేలురకం పేపరు వుత్పత్తి చేయగల నేర్పు వుంది. ఇద్దరం మన జీవితాలు ఒకేచోట ప్రారంభించాం. నేను మిమ్మల్ని మొదట్నుంచీ గమనిస్తూ వచ్చాను. మీరు ఇప్పుడు కోటీశ్వరుడు కాబోతున్నారు. నేనింకా ప్లాంట్ ఇంజనీర్‌గానే వుండిపోతాను. నా తెలివిని మీరు వుపయోగించుకొని కోట్లు సంపాదిస్తున్నప్పుడు- అదే తెలివిని నా కోసం చట్టబద్ధంగా నేను ఎందుకు వుపయోగించుకోకూడదు?".

"చట్టబద్ధంగానా- ఎలా?"

"నా వాటర్‌జగ్‌లో వున్న నీళ్ళని గ్లాసు ఇరవైలక్షల రూపాయలకి అమ్మటం ద్వారా?"

గాంధీ స్థాణువయ్యాడు. చుట్టూ రాళ్ళు- చీకటి అతడిని పరిహసిస్తూన్నట్టు అనిపించింది. దాహం మరింత ఎక్కువైంది. ఎక్కడా నరసంచారం వున్న జాడే కనబడలేదు.

(ఇంకా వుంది)

రైలు పట్టాలు

టాక్సీ డ్రైవరు వేసిన సడెన్ బ్రేక్‌తో సుబ్బారావు దుబ్బున ముందుకు తూలాడు. ఆ తూలడంలో అతని చెయ్యి ముందున్న పెట్టెమీద సరిగ్గా పడడం, పడీపడగానే పెట్టె పట్టుకోడం, టాక్సీ తలుపుతీసి బయటికి రావడం, ఇంకో చేత్తో బెడ్డింగు లాగి చంకలో పెట్టుకోడం- అన్నీ ఒక్కసారే జరిగినంత వేగంలో జరిగిపోయాయి. చేతిలో వున్న పదిరూపాయలనోటు టాక్సీవాడికి అందచేసి, సుబ్బారావు పరుగు లంకించుకున్నాడు స్టేషన్లోకి. తను వెళ్ళవలసిన బండి వచ్చేసి, అతని కోసమే నిరీక్షిస్తున్నట్లు బయల్దేరడానికి సిద్ధంగా వుంది. పరుగెడుతున్న సుబ్బారావు చెవిలో గంట శబ్దం పడింది. వింటూనే చూపుకూడా అటు మరల్చి చూస్తే సిగ్నల్ ఇచ్చేసి వుంది. ఇంకా తను, ఈ ఓవర్‌బ్రిడ్జి ఎక్కి, అవతలి ప్లాట్‌ఫామ్ మీదికి పరుగెత్తాలి. ఎప్పుడో మరిచిపోయిన పరుగు అవసరం కొత్తగా కలగడంతో ఆయాసపడిపోతూ, నలభై ఏళ్ల సుబ్బారావు ప్లాట్‌ఫామ్ మీద పడ్డాడు. ఓవర్ బ్రిడ్జిమీద వుండగానే గార్డు ఈల వినిపించింది. బ్రిడ్జి దిగగానే ఇంజన్ మోత వినిపించింది. ఇహ లాభంలేదని ఎదురుగా తలుపు తెరుచుకొని వున్న ఒక పెట్టెలోకి ఎక్కాడు. బండి కదిలిన కుదుపుకి ముందుకి తూలడంతో, చేయూత ఇచ్చి అతన్ని పట్టుకున్న అటెండెంటు ముఖం కనిపించడంతో తను మొదటి తరగతిలో పడినట్టుగా గ్రహించుకున్నాడు.

"ఓ.... ఫస్టుక్లాసా...." అన్నాడు బండి ఎక్కగలిగినందుకు 'అమ్మయ్య' అనుకున్న తేలికమనసునే, కొత్త ఇబ్బందిలో పడిపోతూ.

"ఏం.... సెకెండ్ క్లాసు టిక్కట్టా"

"అవును రిజర్వుడే. ఆలస్యమైపోయింది. ఛట్టున ఇందులో ఎక్కేయాల్సివచ్చింది. తర్వాత స్టేషన్ వరకూ ఎక్స్ట్రా డబ్బు కట్టేసి, మారిపోతానులెండి...."

ముఖాన అల్లుకున్న చెమట కళ్ళజోడుమీద నీటిపొరగా అలుముకోడంతో అతని కళ్లు అటెండెంటుకి కనిపించలేదు- కనిపించి ఉంటే, అతని

రావి కొండలరావు

దీనావస్థ మరింతగా కళ్ళలో ప్రస్ఫుటంగా కనిపించేది. రొప్పుతున్న సుబ్బారావు చెమటను తుడుచుకుంటున్నాడు. చూడ్డానికి ఆఫీసర్లా, చదువుకున్నవాడిలా, వున్నవాడిలా వున్నాడని- [illegible] కూచోండి. తర్వాత స్టేషన్ వచ్చేలోగా' వచ్చి, టిక్కెట్టు రాయిస్తాను." అంది మరీ జాలిపడిపోయిన అటెండెంటు గొంతు, 'థాంక్స్' అన్నాయి సుబ్బారావు పెదవులు.

వేగం పుంజుకుంటున్నానని సుబ్బారావుకు చెప్పడానికి కాబోలు, రైలు గట్టిగా ఓ కూత కూసింది. పెట్టె, బెడ్డింగూ తీసుకొని, గుమ్మం దగ్గర్నుంచి లోపలికి వెళ్ళబోతూ, మరోసారి తూలాడు. "డి" కోసం చూడబోయి, తలుపుని ఢీకుని సగం తెరిచివున్న తలుపును మోచేత్తో లాగి, లోపలికి పాదం పెట్టి- ఆగాడు! ఎవరో ఒక్క ఆవిడే కూచుని వుంది. ఓ క్షణం ఆలోచించి, 'ఫర్వాలేదు. అటెండెంట్ చెప్పాడుగదా....' అని సర్ది చెప్పుకుని ఎదురు సీట్లో పెట్టె, బెడ్డింగు పెట్టి కూచున్నాడు. కాలుమీద కాలు వేసుకుని, జేరబడి పుస్తకం చదువుకుంటున్న ఆవిడ, సుబ్బారావు కూచుంటూ వుండగా, కళ్ళెత్తి చూసి, ఓసారి కదిలి, మళ్ళీ చదవడంలో పడిపోయింది.

సుబ్బారావు 'సుబ్బరం'గా తేలిగ్గా హాయిగా నిదానంగా నిట్టూర్చాడు, కళ్ళజోడు తీసి, చిన్న టవల్‌తో ముఖమూ చేతులూ తుడుచుకున్నాడు. కిటికీ తలుపు వేసివుంటే, తెరిచి, ఉచితంగా పెద్ద మోతాదులో లభిస్తున్న గాలిని నిండుగా పీల్చుకున్నాడు.

ఇప్పుడు పడ్డాయి సుబ్బారావు కళ్లు ఆమె మీద. తలదించుకుని పుస్తకం చదువుకుంటోంది. అతినల్లగా వున్న ఆమె తలవెంట్రుకలు గాలికి కదుల్తూ, ఒక్కోసారి తీవ్రంగా 'స్టంటు' చేసుకుంటున్నాయి. మంచి ఖరీదైన చీరెలో 'స్టయిల్'గా వుందామె. కొద్దిగా కదిలి, కిటికీవేపు ఎందుకో ఆమె చూసినప్పుడు సుబ్బారావు ఆమె ముఖాన్ని చూడగలిగాడు. అందమైన ముఖమే. ముప్పై అయిదు, నలభై ఏళ్లుండచ్చు, అయినా అంత వయసున్నట్టు తెలియనివ్వకుండా నాజూగ్గా ఉంది. యీసారి అతని కళ్లు ఆమె చుట్టుపట్ల ప్రాంతాన్ని పరిశీలించాయి. ఇంగ్లీషు పుస్తకాలూ, పత్రికలూ అటూ ఇటూ పడివున్నాయి. మధ్యలో ఒకటి రెండు తెలుగు పత్రికలు కూడా వుండడంతో, 'ఫర్వాలేదు తెలుగావిడే' అని తేల్చుకున్నాడు.

కొత్తదనంతో మెరిసిపోతున్న హాండ్ బాగ్ మీద విదేశీయ పౌడరు డబ్బా, పెర్‌ఫ్యూమ్ సీసా రైలు కుదుపుకి ఒకదాంతో ఒకటి ఆడుకుంటున్నాయి. ఖరీదైన సూట్‌కేసూ, బ్యాగూ, బోషాణం' సైజులో మరోపెట్టె కింద కనిపిస్తున్నాయి. "ఎవరో డబ్బున్న ఆవిడ; చదువుకొన్న ఆవిడ" అని ఒక నిశ్చయానికొచ్చాడు. ఏ ఆఫీసరు భార్య అయివుంటుంది; లేదా ఆఫీసరే అయివుంటుంది. కాని, ఒంటరిగా ప్రయాణం చేస్తోందేం—

ఆమె కదిలి గడియారం చూసుకుంటూ అతన్ని చూసింది. ఆవేళకి ఆమెని పరిశీలిస్తున్న సుబ్బారావు, తను ఆమెనే చూస్తున్నాడని గ్రహిస్తుందేమోనని, టక్కున చూపు మార్చాడు.

డిక్షనరీ అంత లావుగా వున్న ఇంగ్లీషు పుస్తకంలో పేజీ తిప్పిందామె. ప్రొఫెసరా? లెక్చరరా? కలెక్టరా? ఆఫీసరా? ఆమె ఏమిటో కనిపెట్టాలని అతను ఆత్రుత పడిపోతున్నాడు. చుట్టూ వున్న పత్రికల్లో ఒకటి అడిగి, ఆమెతో మాట్లాడితే?.... బావుండదేమో! మరి, తనకెంతసేపు ఇలా కిటికీలోంచి బయట చెట్లనీ టెలిగ్రాఫ్ స్తంభాల్నీ చూస్తూ కూచుంటాడు! చదువుకోడానికి తనదగ్గర కనీసం పాతపత్రికకూడా లేదు! ఇలాంటి ఇబ్బందుల్లో వున్న సుబ్బారావుకి, గుండెలో తియ్యని 'ఝల్లు' వినిపించింది.

"బండి లేటుగా నడుస్తోందా?" అని అడిగిందామె. నిస్సందేహంగా తననే అడిగిందామె.

"లేదండి. చాలా కరెక్టు టైములో వుంది ఇవాళ...." అన్నాడు చివరి మాటలో చిన్న వ్యంగ్యం తొణికించానని చిర్నవ్వు చిందించి. ఇహ, ఆమెతో తనూ ఓమాట మాట్లాడాలి. అది తనవంతుగా భావించి, "చాలా దూరం వెళ్తున్నారా?" అని అడిగాడు. అవునని తలవూపింది.

ఐతే, తను ఈలోపలే సాయంకాలానికల్లా దిగిపోతాడు. అంతవరకూ ఇక్కడే కాలక్షేపం చెయ్యొచ్చునే, మళ్ళీ రెండోక్లాసుకి ఎందుకూ మారడం?- అన్న ఆలోచన వెంటనే కలిగింది. అటెండెంటు వస్తే టిక్కెట్టు పూర్తిగా రాయించాలి. అన్నట్టు అదో నామోషీ గదా తనకి! ఈమె చూస్తూ వుండగా రాయించకూడదు. బయటికి వెళ్లి అతన్ని పట్టుకుని, అక్కడే మార్పించుకోవాలి.

'మీరేమీ అనుకోకపోతే....' అన్న మాటని ఇంగ్లీషులోకి తర్జుమా చేస్తూ,

పక్కనే వున్న పత్రిక తీసుకున్నాడు. ఆమె మరో రెండు పత్రికలు కూడా అందించింది. గాలిహోరు ఎక్కువైందని కాబోలు, ఆమె కిటికీ ముయ్యబోయింది. కొన్ని నిమిషాలపాటు తనవల్లకాక! ఆమె అవస్థ పడుతూవుంటే, 'మీరేమీ అనుకోకపోతే....' అని మళ్లీ అని సుబ్బారావు వెళ్ళి సహాయం చేసి, కిటికీ అద్దం దించాడు. ఆమెకు దగ్గరగా వెళ్ళడంలో పరిమళాలు గుప్పున కొట్టడం, అతను పరవశించడం కూడా జరిగాయి.

"గాలి ఎక్కువగా ఉంది" అన్నాడు అతను ఏదో గొప్ప విశేషం కనిపెట్టిన వాడిలా, ఏం మాట్లాడాలో తెలీక. ఆమె పుస్తకం మడిచి పక్కనపెట్టి, లేచింది. 'వన్ మినిట్' అన్నట్టుగా ఏదో అని బయటికి వెళ్ళింది. వెళ్ళడంలోనూ ఒక 'స్టెయిల్' ఉంది. అలావుండాలి ఆడదంటే! ఎందుకూ, తన భార్యావుంది. పదిహేనేళ్లాయి కాపురం చేస్తోంది. ఓ టేస్ట్‌లేదు స్టెయిల్ లేదు. తనకెంత డబ్బుంటేనేం- ఎంత పలుకుబడి వుంటేనేం? ఈరోజుల్లో పల్లెటూరివాళ్లు కూడా ఎంతో స్టెయిల్‌గా కనిపిస్తున్నారు తన కాంతానికి ఎంత చెప్పినా అంతే. ఇద్దరు పిల్లల్ని కన్న తర్వాత మరీ అమ్మమ్మ అయిపోయింది. తన అభిరుచులు, సిద్ధాంతాలూ ఏవీ పనికిరావు. పెళ్ళి కాకముందు, తను కలలు గనే వాడు- భార్య అంటే ఎలా వుండాలో. అంతా విరుద్ధమైపోయింది. ప్రేమించిన పిల్లని చేసుకోడానికి తండ్రి అభ్యంతరం పెట్టాడు. ఆపిల్ల బీదది అయితేనేం- మంచి అభిరుచి వుంది. 'అభిరుచి ఎందుకురా' అని కొట్టిపారేసి, తండ్రిగారు ఈ 'ముద్ద'ని అంటగట్టాడు. తనకు ఊరూరూ తిరగడం అలవాటు. స్నేహితులతో కాలక్షేపం అలవాటు. కాస్త తాగడం అలవాటు. క్లబ్బులకు వెళ్ళడం అలవాటు. ఇవన్నీ మానుకోమంటుందే తనని? తను ఎలా తిరిగితే ఆమెకేం- వ్యాపారం చక్కగా సాగిపోతూ వేలకువేలు వస్తున్నాయా లేదా! ఎందుకూ చదువుకుంది మళ్లీ. అంతా పాతకాలపు కబుర్లు, సిద్ధాంతాలూ. తను పిల్లల్నీ తననీ సరిగ్గా చూడకుండా ఊళ్లవెంట తిరుగుతున్నాడనీ, తాగి తందనాలు ఆడుతున్నాడనీ ఫిర్యాదులు చేసి, విడాకులు ఇవ్వబోతోంది- ఇవ్వనీ. తనూ సిద్ధమే అందుకు. ఇవాళేమిటి- ఐదేళ్ళనుంచీ జరుగుతున్నవే ఈ గొడవలు! తానొచ్చి కొడతానుట! కొట్టనూ- నన్ను నిలవేసి ఆమాట అడిగితే! నా ఆరోగ్యం, బాధ్యతా నాకు తెలీవా- అదెవత్తె చెప్పడానికి!....

సుబ్బారావుకి ఇప్పుడు మరింత కోపం వచ్చేసింది భార్యమీద. విడాకులకి తనే ముందు సిద్ధం! ఎప్పుడో జరగాల్సింది. ఈ పాటికి దాన్ని వదిలేసి తన అభిరుచికి తగ్గట్టు ఇంకొకదాన్ని చేసుకొని హాయిగా తిరిగేవాడు. ఛీ! మూర్ఖురాలు! నోటికి ఎంత మాటొస్తే అంత మాటా అంటుంది. తన మాటే నెగ్గాలంటుంది. నేనేం గాజులు తొడుక్కున్నానా- మగాణ్ణి, రెండు చేతులా సంపాయిస్తున్న వాణ్ణి.

ధుమ ధుమలాడుతున్న సుబ్బారావు ఆలోచనల మీద చల్లని పిల్లతెమ్మెర వీచింది. ఆమె బాత్‌రూమ్‌కి కాబోలు వెళ్ళింది, వచ్చి కూచుంది. కూచుంటున్నప్పుడు, కుడి చేతినిండా వున్న గాజులు ఎంతో అందంగా గలగల్లాడాయి!

"మీరు పెద్ద ఉద్యోగస్థులనుకుంటాను...." బండి వేగం తగ్గడంలో శబ్దం తగ్గడంవల్ల, తక్కువ శృతిలోనే అనగలిగాడు, చేతిలో వున్న సిగరెట్టు విసిరేసి.....

"నో నో...." అందామె కటువుగా "ఐ యామ్ ఎన్ ఇండిపెండెంట్ లేడీ!"

అతనికి అర్థం కాలేదు అయినా ఊరుకున్నాడు.

"నేను చదువుకొన్నదాన్నే. చదువుకున్న వాళ్ళంతా ఉద్యోగస్థులే అన్న అభిప్రాయం ఎందుకనో మన వాళ్ళలో పాతుకుపోయింది. చదువుకోగానే, ఉద్యోగమేనా? చదువు చదువే, నేనిప్పుడూ ఆ దౌర్భాగ్య స్థితిలో పడలేదు. ఆ అవసరమూ నాకు లేదు!"

"ఆ అవసరం లేదు గనుక, ఆ దౌర్భాగ్య స్థితిలో పడలేదు- అలా చెప్పండి" అనుకున్నాడు సుబ్బారావు మనసులోనే. ఆమె గురించి వివరాలు తెలుసుకోవాలన్న ఆత్రుత పెరగడంతో ఇక మొహమాటం లాభం లేదని, ఇంటర్వ్యూ చేసే పత్రిక మనిషిలాగా ప్రశ్నలు ఆరంభించాలని నిర్ణయించుకొన్నాడు.

"అంటే.... ఏదో ఒక వ్యాపకంలో వుండాలి గదండీ ఎవరైనా.... మరి, ఏం చేస్తారు?"

"ఏమి చెయ్యను. మొదట్నుంచీ ఆస్తి పాస్తులున్నాయి. దర్జాగా స్వతంత్రంగా బతకడమే నాకిష్టం- అన్నదామె పుస్తకం మధ్యంలో 'గుర్తు' పెట్టి మూసేస్తూ.

"వివాహం చేసుకుంటే, స్వతంత్ర జీవనానికి అడ్డమేలెండి మరి. అందుక మానేసి వుంటారు" అన్నాడు. వివాహ విషయం తెలుసుకోవాలన్న తొందర్లో ఏం మాట్లాడాలో ఆలోచించలేదు.

"మానెయ్య లేదు. పెళ్ళి చేసుకున్నాను. ఐతే, ప్రస్తుతం నేను 'మిస్'ని. ఆర్నెల్లయింది విడాకులు తీసుకొని".

సుబ్బారావుకి చెప్పలేనంత ఉద్రేకం, ఉత్సాహం, ఉల్లాసం- అలాంటివన్నీ వచ్చేశాయి. 'చిత్రంగా వుందే' అనుకున్నాడు.

"మీ అభిరుచి అభిప్రాయాలే కారణం అనుకుంటాను".

"అవును" అందామె.

ఆమె పట్ల తనకుగల కుతూహలాన్ని ఎందుకు చంపుకోవాలని సుబ్బారావు వివరాలు అడగడం ఆరంభించి, కొంత తెలుసుకున్నాడు. ఆమె పేరు సురేఖ. వివాహమై పదిహేనేళ్ళయింది. ఒక అబ్బాయి పుట్టాడు. వాడికిప్పుడు పన్నెండేళ్లు. భర్త బాగా వున్నవాడే. పుట్టింటివారి ఆస్తి ఆమెకు బాగా కలిసింది. సురేఖ స్వతంత్ర జీవితం కోరుకుంటుంది. ఎలాంటి ఆంక్షలూ వుండకూడదు. అది భర్తకి నచ్చలేదు. "గృహిణి"గా ఎప్పుడూ ఇంట్లోనే వుండాలంటాడు.

"తొలినుంచీ నాకు స్నేహితులు క్లబ్బులూ ఇష్టం. సరదాగా గడపడం ఇష్టం. ఇంటినిండా నౌకర్లూ, వంటవాళ్లూ వున్నారు. వాళ్లే అన్నీ చూసుకుంటారు. ఇంకా నేనేం చూడాలి? కాదట, నేనే చూడాలిట. అబ్బాయిని నేనే రోజూ దగ్గరుండి, అంగుళం అంగుళం పెంచుతూ వుండాలిట. అలాంటివి నాకిష్టం లేదు. నా చెప్పు చేతుల్లో వాడెందుకు పెరగాలి? వాడిష్టం వాడికెలా పెరగాలని వుంటుందో, అలా పెరుగుతాడు! సర్లెండి. మొత్తానికి మా అభిరుచులు వేరు వేరు. ఒకరికీ ఒకరికీ ఎక్కడా పొత్తు కుదర్లేదు. ఒక ఐదేళ్ళపాటు అలా అలా గడిపాం. తర్వాత అసలు కుదర్లేదు. ఎప్పుడూ గొడవలే. ఓసారి, ఆయన నన్ను కొట్టాడు కూడా. ఇహ లాభం లేదని విడాకులు తీసుకున్నాం. ఈ మధ్యనే ఆయన ఇంకో పెళ్ళి చేసుకున్నాట్ట.

తేలిగ్గా చెప్పేసిందామె. కంఠంలో ఎక్కడా తీవ్రతలేదు.

"ఇప్పుడు హాయిగా వుంది నాకు. అభిరుచులు కలవనప్పుడు ఏం ప్రయోజనం! వ్యతిరేక భావాలు వున్నప్పుడు కలిసివుండీ ఏం లాభం?"

సుబ్బారావు చెవులకి ఆనందభైరవి బృందావన సారంగ లాంటి రాగాలు, పిట్టల కువకువలు, సెలవేటి గలగలలూ చిరుగాలి సవ్వడీ- ఇవన్నీ వినిపిస్తున్నాయి ....

సరిగ్గా తన అభిప్రాయాలే ఆమెవీనూ. ఎక్కడా తేడా లేదు. ఇలాంటి అభిరుచులు గల భార్య దొరికివుంటే ఎంత ధన్యుడయ్యేవాడు తను!

ఏదో స్టేషన్లో ఆగిన రైలు, నెమ్మదిగా బయల్దేరి, వేగం పుంజుకుంది. ఇహ లాభంలేదని, సుబ్బారావు తన కథ కూడా చెప్పేయాలనుకున్నాడు. తన సీట్లోంచి చెబితే సరిగ్గా వినిపించదని, ఆమె సీట్లోకే వెళ్ళి కూచుని, తను కూడా ఇవే కారణాలవల్ల అవస్థ పడిపోతున్నాననీ, తను మధ్య విడాకులు రాబోతున్నాయనీ, తనూ బాగా వున్నవాడినేననీ, తన వ్యాపారం, లాభాలూ ఫలానా అనీ- వివిరంగా చెప్పాడు..

అంతా విన్నాక,

"అభిరుచులు ఒకటి కానప్పుడు, కలిసి వుండడం అవివేకం. ఒకే అభిరుచి, అభిప్రాయం వున్నప్పుడు కలిసి వుండడంలో వున్నంత సుకం ఇంకోటిలేదు" అంది సురేక. ఆమాట సుబ్బారావుకి ఎంతో నచ్చినట్టయింది. నెమ్మదిగాలేచి మళ్ళీ తన సీట్లోకొచ్చి కూచున్నాడు. స్టేషనొస్తున్నట్టుగా వుంది- బండివేగం తగ్గుతోంది. టెలిగ్రాఫ్ తీగలమీద రెండు పిట్టలు దగ్గరగా కూచుని ఎంతో ప్రేమగా కబుర్లు చెప్పుకుంటున్నాయి. పనిపాటలు చేసుకొనే ఒక జంట రైలుపట్టాల పక్కనే వుండే దిబ్బమీద కూచుని, సరదాగా ఊసులాడుతూ గిన్నెలు అందించుకుంటూ తింటున్నారు. స్టేషన్ ప్లాట్‌ఫామ్‌మీద ఒక యువజంట దగ్గరగా నడుస్తూ, నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఈ దృశ్యాలు సుబ్బారావుకి మనోజ్ఞంగా కనిపించాయి. సురేక, ఏం తోచని దానిలా పత్రికతీసి పేజీలు తిప్పుతూ ఆగింది. ఏదో ప్రేమకథ. ఆ ప్రేమికుల జంట చిత్రం ఎంతో అందంగా కనిపించిందామెకు.

సురేఖ అందంగా వుంది; డబ్బు వుంది; అభిరుచులున్నాయి; అభిప్రాయ భేదాల కారణంగా విడాకులు పుచ్చుకుంది; తనూ పుచ్చుకోబోతున్నాడు. అంచేత- ఈమెను తను వివాహం చేసుకుంటే?......... కూచున్న సీట్లోంచి ఎగిరిపడ్డంత ఆనందం కలిగింది అతనికి. భేష్! దివ్యమైన ఆలోచన. కోర్టు ద్వారా విడాకులు పుచ్చేసుకున్న వెంటనే ఈమెను వివాహం చేసేసుకోవచ్చు. తన ఇల్లు, జీవితం స్వర్గమయం అవుతాయి. ఇద్దరూ కలిసి హాయిగా, ఏకాభిప్రాయాలతో, అభిరుచులతో ఏ ఆటంకాలూ లేకుండా జీవితం గడపొచ్చు. తను కన్న కల ఇన్నాళ్ళకి ఫలించబోతోంది. ఈభావం కలిగిన తర్వాత, సురేఖని చూస్తే ఆమె మరింత అందంగా కనిపించింది.

సుబ్బారావును సురేఖ పరిశీలనగా చూసింది. అందంగా, ఆరోగ్యంగా వున్నాడు. తనంత రంగు లేకపోయినా, నల్లనివాడు కాదు. అతని కళ్ళజోడు ముఖానికో అందం తెచ్చింది. జుట్టు అక్కడక్కడ తగ్గినా, మరీ 'బట్ట'గా కనిపించడంలేదు. అతని అభిరుచులు తాను విన్నది. ఉన్నవాడు, ఉద్యోగంలో లేనివాడు, వేల మీద వ్యాపారం చేస్తున్నవాడూ. ఫ్రెండ్స్, టూర్‌లు చెయ్యడం సరదా. తనకి తోడుగా రావడానికి అర్హతలన్నీ కనిపిస్తున్నాయి. మరి, తన ఉద్దేశం బయటపెడితే?.... అతని అభిప్రాయం ఏమిటో! తన గురించి అతనేం అనుకుంటున్నాడో!

రైలు కదిలి వెళ్ళిపోతోంది. జోరుగా మరీ జోరుగా 'ఈల'లు వేసుకుంటూ,

అడ్డూ ఆటంకం లేకుండా సాగిపోతోంది......... సుబ్బారావు వూహాలూ, సురేఖ వూహాలూ అలాగే అంత జోరుగానూ ఒక్కలాగే సాగిపోతున్నాయి! మనసులో విహరిస్తున్న ఆలోచన బయటపెట్టి ఎదుటివారికి చెప్పాలన్న తహ తహ ఇద్దర్లోనూ కనిపిస్తోంది...! కాస్సేపటికి-

"ఏమో!" అనుకున్నాడు సుబ్బారావు. తీరా, తను మనసు విప్పి ఆమెతో చెబితే, ఆమె అంగీకరించక పోతే? అనవసరంగా బయట పడి పోతాడు. తనొక 'ఫూల్' కింద ఆమె జమ కట్టవచ్చు. ఏదో, రైల్లో కొన్ని అరగంటలు కలిసి ప్రయాణించినంత మాత్రాన, పెళ్ళి వరకూ వచ్చేయడమేనా? తుదరపని పని! తన తొందరపాటు, అజ్ఞానం తప్ప మరేం కాదు ఇది! కాకపోతే, తన అభిరుచులే గల ఒక స్త్రీ మూర్తి, తనకి 'జోడు' అనిపించుకోదగ్గ ఒక వనితా రత్నం - సాక్షాత్కరించింది!.... అంతే....

"ఏమో" అనుకుంది సురేఖ. తన ఉద్దేశం బయటపెట్టి "మనం వివాహం చేసుకుందామా?" అని అడిగితే, ఏమంటాడో! "ఏదో మీరు చెప్పారు గదా అని, నేను చెప్పానుగాని, పెళ్ళి వరకూ తీసుకొచ్చేస్తారా? మీ అభిరుచి వున్నంత మాత్రాన, రైల్లో కలిసినంత మాత్రాన, పెళ్ళి చేసుకుంటా ననడమే? అని తీవ్రంగా మాట్లాడితే?".... ఎందుకొచ్చిన గొడవ! అనవసరంగా తను తొందరపడి పోయి నట్టవుతుంది!

అదృష్టవశాత్తు, తనలాంటి వ్యక్తి ఇంకొకడు కనిపించాడు-చాలు! అతని అడ్రసు తీసుకుని, అప్పుడప్పుడు వెళ్ళి స్నేహధర్మంగా కలుస్తూ వుంటే చాలు. అంతే!

చిన్న చిన్న స్టేషన్ల దగ్గర నెమ్మదించినా, రైలు తన పరుగును చూపిస్తూనే వుంది. ఆ పెట్టెలోకి ఇంకెవరూ రాలేదు. ఎవరో ఒకాయన రాబోయాడు గాని, 'భార్యాభర్తల మధ్య తనెందుకు' అన్నట్టు, వెళ్ళిపోయాడు! అటు తరువాత అటెండెంటు రావడం, రాయించిన పూర్తి టిక్కట్టు అందించి, తేడా డబ్బు తీసుకెళ్ళడం జరిగాయి.... ఒక స్టేషన్లో వచ్చిన కాఫీ ఇద్దరూ తాగడం జరిగింది.... మధ్యలో మరిన్ని విషయాలు ఇద్దరూ ముచ్చటించడమూ జరిగింది....

ఏమైనా, సుబ్బారావు ఆపుకోలేక పోతున్నాడు. మనసులో కోరిక చెప్పేయాలి. టైము గడుస్తున్నకొద్దీ మనసుకు ఆమె మరింత దగ్గరవుతోంది.... మాట్లాడుతున్నకొద్దీ మరింత అందంగా కనిపిస్తోంది.... ఎలాగైనా చెప్పేయాలి. ఆమె తప్పకుండా 'వూ' అంటుంది. తనంటే ఆమెకున్న అభిప్రాయం అర్థమైపోయింది. చూపుల్లో తెలిసి పోయింది. ఆమెనే చూసి తను మాట్లాడుతున్నప్పుడు, సిగ్గుతో తల వంచుకోడం, మధ్యమధ్యలో వయ్యారంగా కళ్ళు ఎత్తి చూడడం తను గమనిస్తూనే వున్నాడు. ఇద్దరూ కాఫీ తాగుతున్నప్పుడు, చేతులూ వేళ్ళూ కలిసినప్పుడు, ఆమె ముఖంలో 'పొడసూపిన' వెన్నెల రేకలు తను గమనించక పోలేదు. అంచేత తన ఊహ చెబితే సురేఖ కాదనదు. కాని -

సుబ్బారావు ఆలోచనా నాణెం రెండో ప్రక్కకి తిరిగింది. ఒకవేళ, అంతా సక్రమమై తాము పెళ్ళి చేసుకుంటే సుఖంగా వుండగలం అన్న గ్యారంటీ - ఏమిటి? - ఏమో, ఆమె తక్కిన గుణాలు ఎలాంటివో! ఫ్రెండ్స్‌తో తిరగడం అంటే ఏమిటో! స్వతంత్రం, స్వేచ్ఛ అన్న పేరుమీద వాడితోనూ వీడితోనూ తిరుగుతూ వుంటే? చదువుతున్నదే కావచ్చుగాని, సంస్కారం ఎలాంటిదో! ఒకసారి భర్తను కాదని వచ్చేసిన తర్వాత, ఇంకొకడి దగ్గర మాత్రం పేచీ రాదన్న నమ్మకం ఏమిటి?.... అనవసరంగా తను దెబ్బ తింటాడేమో! ఒక భార్యను కాదనుకుంటున్నాడు.... రెండో భార్య కూడా ఇంకేవో కారణాలవల్ల తనకి అచ్చిరాక పోతే?.... తన అలవాట్లు, తిరుగుళ్ళు ఈమెకూడా మానేయమంటే? తాగడానికి వీల్లేదని శాసిస్తే?.... ఏమో, చెప్పలేం. కబుర్లు చెప్పడం చెప్పొచ్చు. ఆచరణ కొచ్చేసరికి, ఎలాంటి దార్లు తొక్కుతాయో! సుబ్బారావు నిట్టూర్చాడు .... తన భార్యకి విడాకులిచ్చేసి హాయిగా

తిరక్కా- మళ్లీ ఎందుకీ రొంపిలో పడడం! వద్దు, అక్కర్లేదు. తను ఆమెను అడగనూ అక్కర్లేదు, ఆమె అవుననీ అక్కర్లేదు! 'పైలాపచ్చీసు'గా ఇహ తన జీవితాన్ని గడపాలనుకుంటున్నాడు.... చాలు, ఇంకే ఆలోచనా వద్దు!

'బొమ్మ' పక్కనే చూస్తున్న సురేక బొరుసువేపు కూడా చూసింది.... మగాళ్ల కబుర్లు నమ్మడానికి లేదు. తన అభిరుచులకు దగ్గరగా లేదని భార్యను వదిలేస్తున్నవాడు, ఇంకేదైనా కారణం చెప్పి తననీ అలాగే అంటే?....తను స్వేచ్ఛగా తిరగొచ్చుగాని, భార్య అలా తిరక్కూడదు- అని శాసిస్తే-? 'నా యిష్టం. నేను తాగుతాన'ని బుడ్డీలు బుడ్డీలు తాగొస్తే? ఆ మైకంలో గొడ్డును బాదినట్టు బాదితే?....ఛీఛీ. అసహ్యం! ఈ ఆరునెల్లూ ఏ బాదరబందీ, చీకూ చింతా, అడ్డూ ఆక్షేపణా లేకుండా హాయిగా జీవిస్తోంది తను! అభిరుచులు కలిశాయి గదా అని, మళ్లీ ఈ రొచ్చులో పడి జీవితాన్ని పాడుచేసుకోడం ఎందుకు?.... మొదట్లో తన భర్త మాత్రం తనతో ప్రేమగా మాట్లాడలేదా?- అభిమానంగా చూడలేదా? అవన్నీ అప్పటికప్పుడే. తర్వాత అందరూ ఒకటే. స్త్రీని వంటింట్లో వుండమని శాసించే వాళ్ళే! తనను చూడ్డానికి మగాళ్లు రాకూడదనవచ్చు; క్లబ్బులకి వెళ్ళడానికి వీల్లేదనవచ్చు; విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తూ వూరూరూ తిరగడానికి ఒప్పుకోనన వచ్చు! ఎలాగూ అనుమానాలూ, అపోహలూ వస్తాయి- 'నీకొకడున్నాడుగా....' అని సమయం వచ్చినప్పుడల్లా ఆక్షేపించవచ్చు! .... ఎందుకూ ఏమీవద్దు. తను ఇలాగే హాయిగా ఉంటుంది. ఎక్కడైనా కనిపిస్తే 'హలో' అని కాసేపు ముచ్చటించడానికీ, బంధాల పేరుతో జైలుశిక్ష అనుభవించడానికీ ఎంతో తేడా ఉంది.

వద్దొదు.... ఇంకే ఆలోచనా వద్దు.... మళ్ళీ ఈ పెళ్ళి రొంపిలో దిగొద్దు.... వద్దు!....

సడెన్ బ్రేక్‌తో రైలు ఆగింది. సీటు చివర్లో కూచున్న సుబ్బారావు ముందుకు తూలబోయి, నిభాయించుకున్నాడు. రైలు ఎందుకు ఆగిందా అని, కిటికీలోంచి చూశాడు. స్టేషనేం కాదు- సిగ్నల్ రాలేదు కాబోలు ఆగిందనుకున్నాడు. ఏ ఆత్రుతా, అల్లకల్లోలంలేని మనసుతో వున్న సుబ్బారావు తన స్టేషన్ రావడానికి ఇంకా ఎంతసేపు పడుతుందా అని, గడియారం చూసుకున్నాడు. గాలివాన వెలసిన వాతావరణంలా, ప్రశాంతంగా వున్న సురేక, పుస్తకం చేతిలోకి తీసుకొని అది పూర్తి చెయ్యడంలో నిమగ్నమైపోయింది!

★ ★ ★

ఆ అనుభవం కావాలి!



వి. మోహన్‌కుమార్

జరిగిన కథ

స్వప్న ప్రశాంత్‌ని ఆకర్షించింది. ప్రశాంత్‌లో చిరుకుంగారు మొదలైంది. స్వప్నకి మాలతి తన అనుభవంతోబాటు పామిష్ట్రీ కూడా చెప్పింది. స్వప్నకి లవ్ మే రేజ్ ఖాయం అని. పిట్టగోడ మీదనుంచీ చూసిన స్వప్నకి తనంటే దురభిప్రాయంలేదని మాత్రం తెలుసుకున్నాడు. వెంటనే పిల్లల పాటకచేరీకి జడ్డిలుగా మాలతీ స్వప్నలని పిలిచే సాహసం ఆరంభమైంది. సముద్రతీరంలో తడిసిన స్వప్నం ప్రశాంత్‌ని అయోమయంలో పారేసింది. సాహసానికి క్వశ్చన్ మార్కు.

-ఇక జరిగేకథ-


స్వప్న నాలుగడుగులు ముందుకి నడిచింది.

తడిసిన చీరె ఒంటికి అంటుకుని ఆమె ఒంపు సొంపుల్ని స్ఫుటంగా చూపిస్తోంది. తడిసిన పాదాలకి మెత్తటి ఇసుక అంటుకుని లేపనం పూసినట్టుగా వుంది. చెప్పులు జారిపోతున్నాయి. అలా నడవడం ఇబ్బందిగా వుందామెకి. ఇంకాస్త దూరం నడిచి ఓ రాయి పక్కకి వెళ్ళి ఎవ్వరూ చూడ్డం లేదని నిర్ధారణ చేసుకున్నాక చీరె అంచుల్ని పిండింది. మాలతి ఇచ్చిన రుమాలుతో ముఖం, చేతులు, మెడ తుడుచుకుంది.

"కాస్త ముందుకెడితే రిక్షా దొరుకుతుంది. రిక్షాలో వెడదాం" అంది మాలతి.

స్వప్న సరే అన్నట్టుగా తలూపింది.

ఓ నిమిషం ఆగి ముందుకి నడిచారు ఇద్దరూ. వందగజాల దూరం నడిచేలోగా వందమాటలు మాట్లాడే స్వప్న ఒక్క మాటకూడా మాట్లాడలేదు. స్వప్న మూడ్ చూసి మాలతి కూడా మాట్లాడకుండా ఆమె పక్కనే నడవసాగింది. రిక్షా కనిపించగానే మాట్లాడింది. ఇద్దరూ రిక్షా ఎక్కారు. ఇరవై నిమిషాల ప్రయాణంలో వాళ్ళు ఒక్క మాటకూడా మాట్లాడుకోలేదు.



రిక్షా దిగి ఇంట్లోకి వెళ్ళి బట్టలు మార్చుకుని వంటింట్లో కూరలు తరుగుతున్న మాలతి పక్కన కూర్చుంది స్వప్న.

"నువ్వొన్నావని వంట చేస్తున్నాను కాని నేను ఒక్కదాన్నీ వుంటే వండేదాన్ని కాదు" అంది మాలతి.

స్వప్న నవ్వింది.

అంతే మాట్లాడలేదు. అలా వుండడం ఆమె స్వభావానికే విరుద్ధం.

మామూలుగా అయితే "గుడ్ ప్రశాంత్‌గారు నాకు థాంక్స్ చెప్పుకోవాలి. నేనుగనక లేకపోతే ఆయన తిరిగి వచ్చేసరికల్లా నువ్వు తిండి తినక ఎండిపోయిన రాడలా అయిపోయేదానివి" అనేది. లేదా అలాంటిదేదో అనుండేది.

సాధారణంగా ముభావంగా కనిపించే స్వప్న నిజంగా ఆలా వుండదు. తనకు నచ్చినవాళ్ళు పక్కనుంటే తెగ కబుర్లు చెపుతుంది. ఆసంగతి తెలిసిన మాలతి ఆమె మూడ్‌లో లేద తెలుసుకుంది. ఆమెని మూడ్‌లోకి రప్పించడానికి రెండుసార్లు జోక్స్ కట్ చేసింది! అయినా కేవలం నవ్వడం తప్పించి స్వప్న ఏమీ మాట్లాడక పోడంతో ఆశ్చర్యపడి ఆమెవైపు చూసింది.

ఏదో ఆలోచిస్తోంది స్వప్న.

'బయటికి కనిపించదు కాని స్వప్న చాలా సెన్సిటివ్. సాయంత్రం బీచ్‌లో జరిగిందాన్ని గురించి బాధ పడ్తోందా? కొంచెం ఆలోచిస్తే దాంట్లో అంత బాధ పడ్డానికి ఏమీ లేదు. స్వప్న దాన్నెలా తీసుకుందో. అది తనకవ మానంగా భావించి వుంటుంది. అయినా అతను అలా పరుగెత్తుకురావడమేమిటి. తను పడ్డందుకు కాదు- అతను అలా పరుగెత్తుకొచ్చి చూసినందుకు స్వప్న బాధ పడుతూ వుండవచ్చు. ప్రణీత్ వచ్చాక అతనికి కాస్త బుద్ధి చెప్పించాలి' అనుకుంది మాలతి.

"స్వప్నా ఒంట్లో బాగోలేదా" అడిగింది మాలతి.

ఆమెకి ఒంట్లో బాగుందని, వంట్లో బాగోలేకపోవడం ఆమె ముఖావానికి కారణం కాదని స్పష్టంగా తెలిసినా, కావాలని ఉపోద్ఘాతంగా ఆ ప్రశ్న అడిగింది

"నాకేమయింది. నిక్షేపంలా ఉన్నాను"

మాలతి ఊహించిన సమాధానమే అది.

"మరి. మూడ్ బాగోలేదా"

"ఏం అలా కనిపిస్తున్నానా"

"ఏం లేదు. సాయంత్రం జరిగినదాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నావేమో అని. అతను చాలా అమాయకుడు. ఏదో పొరపాటు జరిగిపోయుంటుంది. పొరపాటు ఎవరికేనా జరుగుతుంది. ప్రణీత్ వచ్చాక అతన్ని ఓసారి మందలించమని చెప్తాను" అంది మాలతి.

"వద్దు అతన్ని నేనెప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు. దీన్ని ప్రణీత్‌కి చెప్పద్దు" స్వప్న ముఖం సీరియస్‌గా మారిపోయింది.

"సరె" అంది మాలతి.

"దీన్ని ప్రణీత్‌కి చెప్పద్దు. అంతేకాదు వేరే ఎవరికీ కూడా చెప్పద్దు. నాకిష్టం లేదు. ప్రామిస్" స్వప్న మళ్ళీ అడగడంతో స్వప్న ముఖంలోకి చూసింది మాలతి.

"ప్రామిస్. మరి ఎందుకలా ఉన్నావు" మాలతి అడిగింది.

"నేను మా ఊరు వెళ్ళిపోతాను"



స్వప్న సమాధానానికి నిర్ఘాంతపోయింది మాలతి.

"ఏం. మా ఆతిథ్యం అప్పుడే బోర్ కొట్టిందా"

"కాదు"

"నువ్వు వున్నట్టుండి ఇలా అంటే మా ఆతిథ్యంలో ఏదో లోపం జరిగిందేమో అందువల్ల నువ్వు అలిగి వెళ్ళిపోతున్నావని నేను బాధ పడాల్సి వస్తుంది."

"ప్లీజ్ అలా అనుకోవద్దు"

"మరి"

"ఏం లేదు, నాన్నగారు గుర్తు కొచ్చారు. ఒక్కరూ వుంటున్నారు, నేను వెడితే మంచిది. ఇంక ఇక్కడ వుండి చేసేదేముంది. నేను ఇక్కడ కొచ్చాను, మీ అన్యోన్యమైన దాంపత్యాన్ని చూసాను. ఈ ఊరు చూసాను. ఇంకో రెండు రోజులున్నా నేను చేసేదేముంది. అందుకే వెడదామనుకుంటున్నాను."

ఆ మాటలు ఎంత వరకు నిజమో మాలతికి తెలియలేదు. 'ఆమె ఒకసారి వెళ్ళాలని నిశ్చయించుకున్నాక ఇక దాని గురించి చర్చించడం అనవసరం' అనుకుంది మాలతి.

"ప్రణీత్ రాత్రో, రేపొద్దుటో వస్తారు. ఆయన వచ్చాక టికెట్ బుక్ చేయిస్తాను వెడుదువుగాని" అంది మాలతి.

స్వప్న మాట్లాడలేదు.

భోజనం చేసి పడుకున్నారు.

రాత్రి పదకొండు గంటలకు వచ్చాడు ప్రణీత్.

"స్వప్న వెళ్ళిపోతానంటోంది" అంది మాలతి పక్కనే పడుకుంటూ,


"ఏం, నేను లేనప్పుడేమన్నా చేశావా?"

"ఓహో తమాషాగా ఉందే. నేనేం చేస్తాను"

"బోరుకొట్టి ఉంటావు"

"అలా అయితే మీరు ఎప్పుడో పారిపోయుండేవారు"

"నేనా? ఎలా? నిన్ను కట్టుకుని సంసారబంధంలో ఇరుక్కుపోయానుగా" ఆమెను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.



"ఇరుక్కుపోడం కాదు, ఊబిలో కూరుకుపోయారు కదూ," అతని ముక్కు పిండింది మాలతి.

"వేదవ్వేషాలు, పత్రంగా చేసి పెడుతోంటే తిని కూర్చొక, బంధాల్లో ఇరుక్కుపోయాను, ఊబిలో కూరుకుపోయాను అంటూ వగలు పోతారా! ఇంకో సారి ఇలా అంటారా" "అనను".

"ఓ.కె" మాలతి వదిలింది.

"నువ్వు రాక్షసివి"

"అవును పెద్దవాళ్ళ పాలిట రాక్షసిని" అతనికి దగ్గరగా జరిగింది.

"మీకు ఓ సంగతి చెప్పాలి".

"ఏమిటి"

మాలతి చెప్పింది. ప్రశాంత్ తమ నిద్దరిని పిల్లల కార్యక్రమానికి రమ్మనడమూ ఆ తర్వాత సాయంత్రం బీచ్ దగ్గర జరిగింది, స్వప్న మూడ్ ఆఫ్ అవడం. అన్నీ పూసగుచ్చినట్టు చెప్పింది.

"అందుకు వెళ్ళిపోతానంటోందా" అడిగాడు ప్రణీత్.

"అందుకు అని అనటంలేదు. కాని అందుకే అనుకుంటున్నాను. నేను"

"సరే, నేను రేపు ఉదయం ప్రశాంత్‌తో మాట్లాడ్తాను".

"అతన్నేమీ అనకండి బాగుండదు"

"ఏమంటాను, అతనేం చిన్న పిల్లవాడా! స్వప్న అంటే మన ఇంటికి వచ్చే మామూలు పిల్లలాంటి పిల్ల అనుకుని ఆమె పట్ల మోజు పడుతున్నాడేమో. స్వప్న కోటీశ్వరుని కూతురని, అతనికి అందుబాటులో లేదని తెలిస్తే అతను అలా ప్రవర్తించడు అదే చెప్తాను."

"ఏమో మీ ఇష్టం. జాగ్రత్తగా చెప్పండి. ఈ సంగతి నేను మీకు చెప్పినట్టు స్వప్నకి తెలియకూడదు. ఎవరికీ చెప్పనని ప్రామిస్ చేసాను. కాని మీకు చెప్పకుండా ఎలా వుంటాను" ప్రణీత్ చేతుల్లో ఒదిగిన మాలతి తృప్తిగా కళ్ళు మూసుకుంది.

○ ○ ○ ○ ○ ○

మాలతి, స్వప్న బీచ్‌లో నడుస్తూ కనుమరుగవడం చూసిన ప్రశాంత్ లోకంలోకి వచ్చాడు.

నేల నుంచి లేస్తూ తను అందించిన చేతిని అందుకోకుండా స్వప్న తనవైపు చూసిన చూపును అతను మరిచిపోలేక పోతున్నాడు. అదే గుర్తొస్తోంది. ఎంత ప్రయత్నించినా ఆ చూపులో అంతరార్థాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాడు. అయితే ఒక విషయం మాత్రం సుస్పష్టం. తను అలా పరుగెత్తుకొచ్చి చెయ్యందించడం ఆ అమ్మాయికి ఇష్టం లేదు.

ఒక అపరిచితుడు అలా చొరవ తీసుకోడాన్ని ఏ అమ్మాయి హర్షించదేమో. అయితే తను అలా కావాలని చెయ్యలేదు. ఓ పెద్ద హీరోలా వెలగాలని చెయ్యలేదు, అప్రయత్నంగా, ఆలోచనా రహితంగా చేశాడు.

నువ్వెందుకలా చేశావు ? అని ఎవరేనా అడిగితే తన దగ్గర సమాధానం లేదు. తను అభిమానించే ఓ అమ్మాయి సముద్రపు అలలో కొట్టుకు పోతోంది అనిపించింది. అంతే తను పరుగెత్తాడు, ఆ అమ్మాయి నిజంగా కొట్టుకు పోతోందా ? నిజంగా కొట్టుకు పోతోంటే తను రక్షించగలడా ? అని ఆలోచించలేదు. తన దగ్గర ఏ పథకమూ లేదు. ఆ క్షణంలో అలా అనిపించింది. చేసాడు.

వివేకాన్ని సైతం తప్పివేసే ఆందోళన ఎందుకు కలిగింది. దానికి కారణం ఏమిటి ?

ప్రేమా !

ప్రేమంటే ఇదేనా ? దీన్ని ప్రేమంటే ఎవరేనా నమ్ముతారా ?

ఏమో ! తనకి తెలియదు. ఇలాంటి అనుభవం ఇంతవరకు ఎదురవ్వలేదు. ఇంతవరకు తను ఎప్పుడూ దీని గురించి ఆలోచించలేదు. ఆ అవకాశం రాలేదు.

కాని ఒకటి మాత్రం నిజం. తను దీని గురించి ఆ అమ్మాయికి తెలియ చెయ్యాలి. ఆ అమ్మాయి హర్షించినా సరే, ద్వేషించినా సరే, అప్పుడే తన హృదయం శాంతిస్తుంది.

○ ○ ○

ప్రశాంత్ ఇంటికి వెళ్లాడు.

బట్టలు మార్చుకుని పడుకుంటున్న ప్రశాంత్‌ని చూసి నివ్వెర పోయింది బామ్మ. రాత్రి పొద్దుపోయాక ఇంటికి రాగానే 'ఆకలి ఆకలి' అంటూ చంపేసే వాడు. ఇలా నిమ్మకు నీరెత్తినట్టుగా మంచమెక్కి పడుకోవడం ఆవిడని ఆశ్చర్యంగా ఉంది.

"ఏరా అన్నం తినవా" అడిగింది.

"నువ్వు తిని పడుకో" అవలి వైపు తిరిగి పడుకున్నాడు.

"నేను తినడానికి నీ అనుమతి అక్కర్లేదు. నీ సంగతి అడుగుతున్నాను. నువ్వు తినవా."

"అవును."


"ఎందుకు."

"ఆకలి లేదు."

"ఎందుకు."

"బయట తిన్నాను."

"ఎక్కడ."



"నన్ను ఊరికే విసిగించకు. నన్ను పడుకోనీ." దుప్పటి పైకి లాక్కుని ముసుగెట్టాడు ప్రశాంత్.

ఏం పిల్లలో ఏం లోకమో. క్షణ క్షణానికి మారుతూంటాయి వీళ్ళ ప్రవృత్తులు. తమకీ చిన్నప్పుడు కోపాలు, అలకలు వచ్చేవి. కాని ఎప్పుడేనా ఇలా అన్నం మానేసి పడుకున్నారా, లేదు. కాలం మారింది అనుకుంది బామ్మ.

అలా పడుకున్న ప్రశాంత్ మెదడు ఖాళీగా తయారైంది. ఆశ-నిరాశలకి అతీతమైన స్థితి అది. ఏం చెయ్యాలో తోచని అయోమయస్థితి.

అతను నిద్రపోయాడు అనడం కన్నా కళ్లు మూసుకుని పడుకున్నాడు అనవచ్చు. ఎక్కడలేని నిస్పృహ అతన్ని ఆవరించుకుంది.

○ ○ ○ ○

ఆరోజు సాయంత్రమే స్వప్న ప్రయాణం

ప్రణీత్ టిక్కెట్లు కొనుక్కొచ్చాడు.

స్వప్న సామాను సర్దుతుంది. స్నేహితురాళ్లు వంటింట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"నేనలా బయట కెళ్ళొస్తాను" ప్రణీత్ బయల్దేరాడు.

"తొందరగా రండి. కలిసి భోంచేద్దాం" అంది మాలతి. అతనెక్కడికి వెడుతున్నాడో తెలుసు.

"సరే" ప్రణీత్ ఇంట్లోంచి బయట పడ్డాడు. ప్రశాంత్ షాపు దగ్గర కొచ్చాడు. ప్రశాంత్ అక్కడే కూర్చున్నాడు.

ప్రణీత్‌ని చూడగానే ప్రశాంత్‌కి ఏదో చటుక్కున తట్టింది. తన మనసులోని మాటను స్వప్నకి ఎదురుగా నిలబడి చెప్పే ధైర్యంలేదు. మాలతిని కలుసుకుని చెప్ప గలిగిన స్వతంత్రం, చొరవాలేదు. ఇకపోతే తనకి ఉన్న ఒకే ఒక లింక్ ప్రణీత్. అతనికి చెపితే ?

ఆడవాళ్ళకి చెప్పాలంటే జంకు. వాళ్లేమనుకుంటారో అన్నసందేహం అదే ప్రణీత్‌కి చెప్పడానికి ఆ భయం లక్కర్లేదు. తోటి మగవాడు, కష్టం సుఖం తెలిసినవాడు తన మానసిక స్థితిని తెలుసుకోగలడు. మాలతిద్వారా దాన్ని స్వప్నకి తెలియజెయ్యగలడు. ప్రణీత్‌ని పిలవబోయాడు ప్రశాంత్, అయితే అతనే షాప్ దగ్గరకి రావడంతో అతని వైపు ఆహ్వాన పూర్వకంగా చూశాడు.

"రండి ఏం కావాలి" అడిగాడు ప్రశాంత్.


"మీతో అయిదు నిమిషాలు మాట్లాడాలి."

ప్రణీత్ అలా అనడంతో ఆశ్చర్యపోయాడు. అసలు తనే అతన్ని పిలిచి 'మీతో అయిదు నిమిషాలు మాట్లాడాలి' అని అడగాలనుకున్నాడు.... అలాంటిది అతనే అలా అనడం సంభ్రమం కలిగించింది. అతను ఏం మాట్లాడ్డానికి వచ్చాడు.

స్వప్న అతనితో సందేశం పంపిందా ? ఒక్కక్షణం అతని మనసు దూదిపింజలా ఎగిరింది. అయితే క్షణంలో వివేకం మేల్కొంది.

"ఇంకెప్పుడు స్వప్న జోలికి వెళ్ళద్దని" బెదిరించడానికి వచ్చాడా ప్రణీత్ ? ఆ ఆలోచన రావడంతో ప్రశాంత్ గుండె దడదడ లాడింది.

అతను ఏం చెపుతాడు ? అతనితో ఏంమాట్లాడాలి ? ప్రశాంత్ గుండెలో గుబులుచోటు చేసుకుంది. ఈ లోకంలోకి వచ్చి "తప్పకుండా. చెప్పండి. ఇక్కడే మాట్లాడ్తారా" అన్నాడు.



"వీలైతే పక్కకు వస్తారా" అడిగాడు ప్రణీత్.

"తప్పకుండా"

అక్కడున్న కుర్రాడితో షాపు చూస్తూండమని చెప్పి పక్కకి వెళ్లాడు.

నిటారుగా ధృడంగా నించున్నాడు ఆరడగులు ప్రణీత్. అతని కన్నా రెండంగుళాలు తక్కువగా ఉన్న ప్రశాంత్ అతని ఎదుట బెరుకుగా నించున్నాడు.

"మీరు ఏమనుకోక పోతే ఓ విషయం అడగాలి" అన్నాడు ప్రణీత్. తలెత్తి చూసిన ప్రశాంత్‌కి, చలవకళ్ళజోడు చాటున దాక్కున్న ప్రణీత్ కళ్ళలో భావాలు కనిపించలేదు.

"అడగండి" నెమ్మదిగా అన్నాడు ప్రశాంత్. అతని గొంతు తడారి పోతోంది.

"మా ఆవిడ స్నేహితురాలు స్వప్న అనే అమ్మాయి మా ఇంటికి వచ్చిరిదన్న సంగతి మీకు తెలుసనుకుంటాను" ప్రణీత్ గంభీరంగా అన్నాడు.

అనుకున్న విషయం ప్రస్తావనకు రావడంతో ప్రశాంత్ గుండె గబగబ కొట్టుకోసాగింది.

"తెలుసు" అన్నట్టు తలవూపాడు.

"ఆమె మీద మీ అభిప్రాయం ఏమిటి"

"క్షమించండి. ఈ విషయం గురించి నేనే మీతో మాట్లాడదామను కున్నాను. ఈలోగా మీరే వచ్చారు. నేను మీ మాటలకు అడ్డుతగులుతున్నానని అనుకోకపోతే నన్ను ఓ విషయం చెప్పనివ్వండి. ముందు మీరు అడిగినదానికి సమాధానం చెప్పకుండా ఇలా ఇంకో విషయం ప్రస్తావించడం సభ్యత కాదని నాకు తెలుసు. అయినా అడుగుతున్నాను. ఎందుకంటే నేనుచెప్పేవి విన్నతర్వాత కూడా మీరు మీక్కావలసినది అడగ్గలరు. కాని మీరు చెప్పేది విన్నతర్వాత నేను చెప్పదలచుకున్నది చెప్పగలనన్న నమ్మకం నాకు లేదు. అందువల్ల మొదట నేను చెప్పదలచుకున్నది చెప్పనివ్వమని అడుగుతున్నాను" స్థిరంగా అన్నాడు ప్రశాంత్.

"సరె. చెప్పండి"

"ఆ అమ్మాయిని చూసినప్పటి నుంచి నాలో ఏదో సంచలనం కలిగింది. దాన్నేమంటారో నాకు తెలియదు. ఎందుకో తెలియదుగాని నాకు ఆమెపట్ల ఆసక్తి పెరిగింది. నేను ఇలాచెపితే ఎవరూ నమ్మరు. హేళన చేస్తారు. లేదా తప్పు చేస్తున్నానని మందలిస్తారు. అయితే నాకన్నా ఎక్కువ తెలివి, అనుభవం ఉన్న మీరు దాన్ని అర్థం చేసుకుంటారని నమ్ముతున్నాను. నేను ఇన్నాళ్ళనుంచి ఎవరి కోసం ఎదురు చూస్తున్నానో ఆమె ఈ అమ్మాయే అనిపించింది"

"అది సరె...."


"సార్ నాది తొందరపడి వ్యామోహం పెంచుకునే వయసు కాదు. కనిపించిన అమ్మాయిల వెంటబడి అల్లరిపెట్టి ఆనందించాలన్న చిలిపితనమూ లేదు. నేను నిజంగా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. నా నిజాయితీని శంకించకండి"

ప్రణీత్ నవ్వాడు.

"సార్ ఇలా చెపితే ఎవరేనా నవ్వుతారని నాకు తెలుసు."

"సారీ అలా అనుకోకండి. నేను నవ్వటం లేదు"

"నేను బి.కాం పాసయ్యాను. ఈ రోజుల్లో అది గొప్ప చదువు కాదు. కాని నేను చదువుకున్నాను అనడానికి అర్హత నిస్తుంది ఈ డిగ్రీ. నాకు ఈ



ఉద్యోగం ఉంది. నేను గొప్పవాణ్ణి కాదుగాని నా భార్య పిల్లల్ని పోషించగలనన్న నమ్మకం ఉంది. ఆ అమ్మాయి ఇష్టపడితే నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను".

"మీరు ఒక విషయం ఆలోచించారా?" నిదానంగా అడిగాడు ప్రణీత్.

"ఏమిటి?" అన్నట్టు చూసాడు ప్రశాంత్.

"మీరు ఆ అమ్మాయి పట్ల మమకారం పెంచుకునేముందు ఆ అమ్మాయి మీకు అందుబాటులో ఉంటుందో ఉండదో తెలుసుకున్నారా"

ప్రణీత్ అలా అనడంతో ప్రశాంత్ ముఖం నల్లబడింది.

"అఫ్‌కోర్స్ మీరు తక్కువ అని నేను అనటంలేదు. కాని నేను తొందరపడి మమకారం పెంచుకుంటే ఆశాభంగం కలిగే అవకాశం వుంది"

"మమకారం పెంచుకోవాలనుకుంటే పెరుగుతుందా? ఆశాభంగం కలుగుతుందని భయపడి ఆగిపోతుందా" తనలో తను గొణుక్కుంటున్నట్టుగా అన్నాడు ప్రశాంత్.

"అందుకే మీతో మాట్లాడ్డానికి వచ్చాను నేను. స్వప్న ఓ కోటీశ్వరుని కూతురు. సరదాగా ఈ ఊరు చూడ్డానికి వచ్చింది. ఈ రోజు వెళ్ళిపోతుంది."

ప్రశాంత్ తల వంచుకున్నాడు. స్వప్న త్వరలో వెళ్ళిపోతుందని తెలుసు కాని యీ రోజే వెళ్ళిపోతుందని వినగానే అతని కాళ్ళకింద నేల జారినట్టయింది.

"చూడండి ఆ అమ్మాయి కలలేమిటో కోరికలేమిటో మనకి తెలియదు. అలాంటప్పుడు ఆమెను గురించి ఆలోచించడం, మనసు పాడు చేసుకోడం ఎందుకు. ఆ అమ్మాయి రేపట్నుంచి మీకు కనిపించదు. యీ విషయం మర్చిపోయి హాయిగా మునపటిలా కాలం గడపండి. మీకు అందుబాటులో ఉండే అమ్మాయి ఎదురయినప్పుడు పెళ్ళి చేసుకోండి" ప్రణీత్ ముగించాడు.

"సార్ ఓ చిన్న రిక్వెస్టు" ప్రశాంత్ తలెత్తి చూశాడు.

"చెప్పండి" అన్నట్టు చూసాడు ప్రణీత్.

"మీరు నవ్వినా పర్వాలేదు. నేను మీకు చెప్పిన విషయాలు ఆ అమ్మాయికి చెప్తారా"

"చెప్పడం మూలంగా ప్రయోజనం ఉంటుందనుకుంటున్నారా"

"ప్రయోజనం ఉన్నా లేకపోయినా మనసులోని మాటను తెలియజేసానన్న తృప్తి వుంటుంది."

"చెప్పాక తర్వాత వచ్చే సమాధానం అనుకూలంగా ఉండకపోతే."

"ఫర్వాలేదు. నా ధర్మం నేను నెరవేర్చానన్న తృప్తి వుంటుంది."

"సరె. ప్రేమలాంటి విషయాల్ని నేను తేలిగ్గా తీసుకోను. మీరు కోరినట్టుగానే చెప్తాను. జవాబు మీకు అనుకూలంగా వుంటే సాయంత్రంలోగా నేనే వచ్చి చెప్తాను. నేను రాకపోతే...."


"అర్థమయింది. మీరు రాకపోతే సమాధానం ఏమిటో నేనే ఊహించుకుని ఊరుకుంటాను. మీ ఇంటికి వచ్చి ఏమయిందని అడగను"

"నో, నో, నా ఉద్దేశం అదికాదు. మీరు మా ఇంటికి రావచ్చు"

"ఓ.కె. ఒకవేళ వచ్చినా ఈ ప్రసక్తి తీసుకురాను" ప్రణీత్ నవ్వాడు.

"నేను వస్తాను"

ప్రణీత్ వెనక్కి తిరిగి ఇంటి వైపు నడుస్తున్నాడు. అతన్ని చూస్తూ నించుండి పోయాడు ప్రశాంత్. ఒక్క క్షణం అతనికి ఏదో ఆలోచన వచ్చింది. పరుగున ముందుకి వెళ్ళి 'సార్' అన్నాడు,



చటుక్కున ఆగాడు ప్రణీత్.

"క్షమించండి, ఇందాక మీరు చెప్పిన విషయాలు........"

"ఏమిటి"

"ఏమీలేదు. అవి మీరే చెప్పారా లేక అలా నాతో చెప్పమని ఆ అమ్మాయి మిమ్మల్ని పంపించిందా"

"ఏం అలా అడుగుతున్నారు"

"ఒకవేళ అలా చెప్పమని మిమ్మల్ని ఆ అమ్మాయి పంపితే నేను చెప్పమన్నవి మీరు ఆమెకు చెప్పవలసిన అవసరంలేదు. మీరు చెప్పినదాంట్లోనే ఆమె సమాధానం ఉంది"

"మీకు సమాధానంతో నిమిత్తంలేదుగా. మీ మనసులో ఉన్నమాట ఆమెకి తెలియాలి, మీకు ఆ తృప్తి చాలు. ఇందాక మీరు అన్నది. అదేగా"

"అవును" ప్రశాంత్ తలవంచుకుని సమాధానం చెప్పాడు.

"ఏం చెయ్యమంటారు, చెప్పమంటారా, ఒద్దంటారా" అడిగాడు ప్రణీత్.

"చెప్పండి" అన్నాడు ప్రశాంత్. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏ క్షణంలోనైనా జారడానికి సిద్ధంగా ఉన్నాయి.

(సశేషం)



యంత్రం కెట్టి రాయి
హాస్యమరాలజీ

అబ్బో! అబ్బో! తెలుగుజాతి చరిత్ర ఎంత గొప్పది! తెలుగునాడులోనే రత్నాలు వీధుల్లో కుప్పలుగా పోసి అమ్మారుట! ప్రజలంతా ఎలాంటి కంప్లెయింట్సూ లేకుండా సకల సౌభాగ్యాలతో తులతూగారట!

మరిప్పుడో! ''ఆంధ్రప్రదేశ్'' ఆహ్హ హ్హ హ్హా—యు డి పవర్ ఆఫ్ ఇన్ఫినిటీ!

నిర్భయ్‌నగర్ కాలనీ చాలా హడావుడిగా వుంది. కాలనీ వాళ్ళందరూ కాలనీ మధ్యపార్కులో జేరారు.

"సోదరులారా!" అన్నాడు గోపాల్రావు అనిచుట్టూ చూశాడు. ఆడామగా పిల్లా పీచూ అతనేం చెప్తాడా అని ఎదురుచూడసాగారు. గోపాల్రావ్ జర్నలిస్టు. అంచేత ఎప్పుడూ ఒకరుచెప్పింది రాసుకోడమేగాని మాట్లాడడంతెలీదు అందుకని ఆతరువాతేం మాట్లాడాలో తెలీలేదు. రెండు క్షణాలాగిమళ్ళీ "పెద్దలారా" అన్నాడు. మరుక్షణం ఆగి పిల్లలారా!" అన్నాడు.

"పోనీలే-మామూలుగా మాట్లాడు" ఆ మాటతో గోపాల్రావు ఉత్సాహం పుంజుకున్నాడు.

"మన కాలనీకూడాఊరికి చివరగా వుంది కాబట్టి ఏ క్షణాన్నయినా దొంగలు "క్యూ" కట్టి దోచుకోవచ్చునిఅనుమానంగా వుంది, ఎందుకంటే మా న్యూస్ పేపర్ల వార్తలనుబట్టి దొంగలు ఇప్పటికే హైద్రాబాదులో ఊరిబయట కాలనీలన్నీ పూర్తి చేశారు, వాళ్ళలిస్టులో మనకాలనీ ఒక్కటే మిగిలిపోయింది. కనక మనం ముందే చోరనిరోధక చర్యలు తీసుకుంటే బావుంటుందని-ఇక్కడ కలుసుకున్నాం ఇవాళ! కనుక ఏ చర్యలు తీసుకోవాలో ఎవరికితోచింది వారుచెపితే బాగుంటుందని" అంటూ ముగించాడు.

కుటుంబరావు లేచి నిలబడ్డాడు.

"సోదరులారా! మన కాలనీని మనం రక్షించుకోవాలి. యూనిటీఈజ్ స్ట్రెంగ్త్ అన్నారెవరో. ఎందుకన్నారా మాట? ఇదిగో-ఇందుకే-ఈ దొంగల బాధ పడలేకే అన్నారని నేను గట్టిగా నమ్ముతున్నాను. కనుక అందరూ తమ తమ సలహాలను అందజేయవలసిందిగా కోరుతున్నాను—" అని అందరివంకా సలహాలకోసం చూశాడతను

జనం మధ్యలో నుంచి సీతాపతిలేచి నిలబడ్డాడు.

"ఈ సమస్యకు బెస్ట్ సొల్యూషన్ ఏమిటంటే మనందరం రాత్రుళ్ళుకాలనీకి కాపలా కాయటం" అన్నాడు సీరియస్‌గా.

"మనందమూనా?" ఎవరో అడిగాడు

"మనందరం అంటే నా వుద్దేశ్యం రోజుకి కొంతమంది చొప్పున కాలనీకి కాపలా కాయాలన్న" మాట.

అందరూ "అవునూ" అంటూఅరచారు.

"ఇదే చాలా పరఫెక్టుసిస్టమ్" అన్నాడు రాజేశ్వర్రావు.

ఓ మూలనుంచి శంకర్రావు లేచి నిలబడ్డాడు.

అందరూ చిరాగ్గా అతనివేపు చూశారు. ప్రతి విషయానికీ ఏదో ఒక అడ్డుచెప్పటం అతని కలవాటని అందరికీ తెలుసు.

"కానీ ఆ రామగిరి కాలనీలో దొంగలు, ముందుకాపలా తిరిగేవాళ్లని కత్తితో పొడిచి తరువాత దోచుకున్నారుగా?" అనుమానంగా అడిగాడతను.

దాంతో అందరూ నిశ్శబ్దమయి పోయారు.

"కుటుంబరావు కేం మాట్లాడాలో తెలీలేదు. తను చెప్పిన సూచనని అతనలా ఒక్క మాటతోకొట్టి పారేయడం సీతాపతికి అసలు నచ్చలేదు.

"అది వేరు-ఇది వేరు" అన్నాడు సీతాపతి.

"అవును-అదివేరు-ఇది వేరు" అన్నాడు రాజేశ్వర్రావు పుంజుకుంటూ

"ఏది వేరు?" అడిగాడు శంకర్రావు.

"అదే-రామగిరి కాలనీలో సంగతి వేరయ్యా! అక్కడ కాపలా తిరిగింది ఇద్దరే। అందుకని దొంగలు అంత ధైర్యం చేయగలిగారు. మన కాలనీలో రోజుకి నలుగురు తిరుగుతుంటారు.

"ఒకవేళ దొంగలు ఎనిమిదిమంది వస్తే?" మళ్లీ అడిగాడు శంకర్రావు, దాంతో అందరూ మళ్లీ నిశ్శబ్దంఅయి పోయారు. అందరికీ శంకర్రావుమీద వళ్లు మండిపోతుంది. ఇలా అదిలోనే హంసపాదు పెట్టేస్తాడనే అతనిని మీటింగ్‌కి పిలవలేదు. అయినా వచ్చి అందరినీ చెరిగేస్తున్నాడు.

"దొంగలు సాధారణంగా నలుగురే వస్తారని పేపర్లో చదివాను" అన్నాడు సీతాపతి ఓక్షణం ఆలోచించి.

"అవునవును" అన్నాడు రాజేశ్వర్రావ్.

"కనుక సోదరులారా - మనం అమలు చేయబోతున్న మొదటి సూచన ఏమిటంటే" - అంటూ శంకర్రావ్‌ని బైపాస్ చేయబోయాడు కుటుంబరావ్. కానీ శంకర్రావ్ మళ్ళీ అడ్డు పడి పోయాడు.

"మొన్న కాంతినగర్ కాలనీలో ఎనిమిది దొంగలొచ్చేకదా నానా రభసా చేసి, పదిమందిని పొడిచి వెళ్ళింది?"

మళ్లీ అంతా నిశ్శబ్దం అయిపోయింది.

చివరకు కుటుంబరావే కోలుకున్నాడు.

"వస్తే రానీవయ్యా! అంతగా ఎక్కువమంది వస్తే - వాళ్ళకు అడ్డు తొలిగిపోతేసరి - గొడవుండదుగా?"

"అయితే మరింక రాత్రుళ్ళు అలా నిద్రలు పాడు జేసుకుని తిరగటం ఎందుకు?" రాజేశ్వర్రావ్ తల రెండు చేతులతో పట్టుకున్నాడు.

"ఎందుకేమిటి? దొంగలు నలుగురు కంటె తక్కువ వచ్చినప్పుడు ఉపయోగం కాదూ?" అన్నాడు గోపాల్రావ్.

"అవునవును- సో! అది పెటిలయిపోయింది. ఇక రెండో సలహా ఎవరయినా ఇవ్వగలరా?"

జనంలో నుంచి డిటెక్టివ్ నవలా రచయిత్రి రాజేశ్వరి లేచి నిలబడింది.

అంతా నిశ్శబ్దం అయిపోయింది.

'మనం ఓ కొత్తపద్ధతి అవలంబిస్తే బాగుంటుంది" అందామె.

"ఏమిటది?"

"ప్రతి పది ఇళ్ళకూ కలిపి మనం కంబైన్డ్‌గా ఒక వార్నింగ్ బెల్ ఏర్పాటు చేసుకోవాలి. దానిమీట బెడ్‌రూమ్స్‌లో మంచం పక్కనే ఉంటుదన్నమాట. ఏ ఇంట్లో దొంగలు పడ్డా వాళ్ళు ఆ మీట నొక్కితే మిగతా తొమ్మిది ఇళ్ళల్లోనూ బెల్ మోగుతుందన్నమాట! దాంతో అందరూ కలసి వచ్చి ఆ దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించవచ్చు- ఎలా వుంది?"

"వండర్‌ఫుల్" అంటూ తప్పట్లు కొట్టారందరూ.

"ఈ వార్నింగ్ బెల్ సిస్టం వెంటనే అమలు చేయాలి-" అంటూ అరచారెవరో.

శంకర్రావ్ మళ్ళీ లేచి నిలబడేసరికి మళ్ళీ అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"మళ్ళీ ఏమిటి? ఈ సిస్టంలో కూడా నీకు లోపం కనిపించిందా?" అడిగాడు రాజేశ్వర్రావ్ చిరాకుగా.

"అవునూ! వార్నింగ్ బెల్ మోగుతుంది! రైటే! వప్పుకున్నాం! కానీ పదిళ్ళలో ఆ బెల్ ఎవరిచ్చారో- అంటే ఏ ఇంట్లో నుంచి వచ్చిందో ఎలా తెలుస్తుంది?"

కుటుంబరావుకి శంకర్రావు మీద వళ్లు మండిపోతోంది.

"ఎందుకు తెలీదూ ? బాగానే తెలుస్తుంది" అన్నాడు కోపం అణచుకుంటూ.

"అదే - ఎలా తెలుస్తుందీ అనడుగుతున్నాను-"

రాజేశ్వరికి శంకర్రావుమీద కోపం ముంచుకొచ్చింది. తను తన డిటెక్టివ్ మెదడు నుపయోగించి, ఎన్నో రోజులు ఆలోచించి కనుక్కున్న అద్భుతమయిన ఉపాయాన్ని అతగాడలా ఎలాంటి శ్రమా లేకుండా - తీసి పారేయడం భరించలేకపోయింది.

"ఎలా తెలుస్తుందేమిటి? ఆ వచ్చిన వాళ్ళందరూ కలుసుకుంటే - ఏ ఇంటి మెంబరు రాలేదో తెలిసిపోదూ?" అంది అతనో వట్టి తెలివి తక్కువ వెధవాయి అన్నట్లు చూసి.

"అలా నడిరాత్రి అందరి అటెండెన్స్ తీసుకుని, అబ్సెంటెవరో చూసి తేల్చుకునేలోగా ఆ దొంగల పని కాస్తా పూర్తయిపోతుం కదా ? అదీగాకుండా ఒకవేళ వాళ్ళు మెయిన్ స్విచ్ ఆఫ్ చేశారనుకోండి".


"ఇంక చాలు - ఆపు" అరచాడు కుటుంబరావు.

శంకర్రావు ఆపేసి మళ్ళీ కూర్చున్నాడు.

"శ్రీమతి రాజేశ్వరిగారు చెప్పినట్లు పదిళ్ళకు కలిపి ఓ కాలింగ్ బెల్ ఏర్పాటు చేసే పద్ధతి ప్రవేశపెట్టాలని నిర్ణయించడమైనది" అన్నాడు కుటుంబరావు.

"సోదరసోదరీమణులు ఇంకేమయినా సలహాలు ఇవ్వగలిగితే త్వరగా చెప్పండి" అడిగాడు రాజేశ్వర్రావు.

"కాలనీవాళ్ళ డబ్బు బాంక్‌లోనూ, నగలన్నీ బాంక్ లాకర్లలో పెట్టటం మంచిదని ఇందుమూలముగా నేను



మనవి చేస్తున్నాను" అన్నాడు కొత్తగా కాలనీ బాంక్ బ్రాంచికి మేనేజరుగా వచ్చిన మార్తాండరావు. "అలా అయితే దొంగలకు దొంగిలించేందుకు ఏమీ ఉండదు-"

అందరూ ఉత్సాహంగా "అవునూ" అంటూ అరచారు.

శంకర్రావు మళ్ళీ లేచి నిలబడ్డాడు.

మార్తాండరావు చిరునవ్వుతో అతనివేపు చూచాడు. తను చెప్పినదాంట్లో లోపాలు ఎన్నటం ఎవరివల్లవుతుంది?

"అయ్యా ! నాదో సందేహం-" అన్నాడు వినయంగా.

"ఆ విషయం వేరే చెప్పఖ్ఖర్లేదులే" అన్నాడు గోపాల్రావు తాపీగా

"ఏమిటో అఘోరించు!" లోపల అనుకోబోయి సైకిలానేసి నాలిక్కరుచుకున్నాడు రాజేశ్వర్రావు.

"మార్తాండ రావ్‌గారి సలహా నాకేం నచ్చలేదు. నగలు చేయించేది ఎందుకు? అన్నీ లాకర్లలో పెట్టి దాచుకోడానికా! సరే- చెవుల - దుద్దులు, గాజులు, నెక్లెస్ తీసి బాంక్ లాకర్లో పెడతాం! మరి ముక్కు పుడక, మంగళ సూత్రం మాటేమిటి? అవి కూడా లాకర్లో పెట్టాలా?"

శంకర్రావ్ పాయింట్ ఆడాళ్ళను బాగా ఆకర్షించినట్లు కనిపించింది.

"అవునూ మంగళసూత్రం లాకర్లో ఏమిటి- నాతలకాయ" ఎవరో అనడం

ప్పష్టంగా వినిపించింది కుటుంబరావ్‌కి.

"ఇక డబ్బా అంతే!. కనీసం అయిదారువందలయినా ఇంట్లో ఉంచుకోకుండా అంతా బాంక్‌లో పడేస్తే- సడెన్‌గా ఎవరికయినా ప్రాణంమీది కొస్తే ఏం చేయాలి? ఎవడిస్తాడు డబ్బు?" అడిగాడు శంకర్రావ్.

"అవునూ-మొన్న సీతారామయ్య గారి ఆఖరి పిల్లకి ఇలాగే ప్రాణం మీదను ముంచుకొస్తే పాపం-చేతిలో పట్టుమని పాతిక రూపాయలు లేక పాయె-" ఇంకో తల్లి కొంచెం గట్టిగా వత్తాసు పలికిందతనికి.

మార్తాండరావుకి మొఖం చిన్న బోయింది. తన సలహాల్లోని రెండు అంశాల్ని కూడా శంకర్రావ్ అలా చీల్చి చెండాడడం అతనికి సభ్యలేదు. అందుకని ఎదురు తిరిగాడు.

"దాన్దేముందీ? డబ్బు ఎప్పుడు కావాలంటే అప్పుడు విత్‌డ్రా చేసుకోవచ్చుగా! బాంక్ ఎలాగూ కాలనీ లోనే ఉంది- ఉదయం సాయంత్రం ఓపెన్ ఉంటుంది-

కాని శంకర్రావ్ ఏమాత్రం బెదర లేదు.

"మరి అర్ధరాత్రి సంగతేమిటి? అప్పుడు డబ్బు కావాలంటే ఎలా! సరే అదలా వదిలేయండి. మనదేశంలో సంవత్సరానికి మూడునెలలు మొత్తం ఆఫీసులూ, బాంకులకూ శెలవు లుంటాయ్. మరి ఆ మూడునెలలూ డబ్బు దాచుకున్నవాడేం చేయాలి. అడుక్కుతినాలి. మొన్నటికి మొన్న వరుసగా మూడు రోజులు బాంక్ మూసే శారు. అప్పుడు నేను మన కాలనీ వాళ్ళందరినీ అడుక్కుని భోజనం చేయగలిగాను."

"అవును బాంక్ వద్దూ, గుద్దూ వద్దు" అన్నారొకరు. దాంతో శంకర్రావ్ విజృంభించాడు.

"ఇంకో విషయం కూడా చెప్తున్నాను- మన నగలకు బ్యాంకుల్లో మాత్రం ఏమి రక్షణ వుంది? ఆ మధ్య మా ఆవిడ గొలుసు బాంక్‌లో తాకట్టు పెట్టి, తరువాత విడిపించుకుంటే ఆ గొలుసులో చిన్నముక్క కొట్టేసి అతుకు పెట్టారెవరో! గాజులకు చిన్న చిన్న ముక్కలుకోసి కనిపించాయ్-"

అంతా హాహాకారాలు చెలరేగాయ్.

"అవును! నాకూ అలాగే జరిగింది" అన్నాడో ముసలయ్య లేచి నిలబడి.

మార్తాండరావు ముఖాన్న నెత్తురు లేదు.

"సోదరులారా! ఎక్కడో ఓ వ్యక్తి అలాంటి దురాగతానికి పాల్పడినంత మాత్రాన అన్ని బాంక్‌లూ అంతే నంటారా!" అనడిగాడు దీనంగా.

ఓ లావుపాటావిడ కోపంగా లేచింది.

"బాంక్‌లన్నీ దగా-దొంగలు- నా గొలుసువి కూడా రెండు లింకులు కొట్టేశారు" అంది మెడలోని గొలుసు తీసి గాలిలో ఊపుతూ.

చాలా మంది ఆడాళ్ళు లేచి ఆమె చుట్టూ మూగారు.

కుటుంబరావ్, రాజేశ్వర్రావ్, గోపాల్రావ్ కలిసి అందర్నీ కూర్చోమని బ్రతిమాల సాగారు.

అంతా సర్దుమణిగాక చూసేసరికి మార్తాండరావు ఎక్కడా కనిపించలేదు.

ఆ తరువాత ఇంకెవ్వరూ సలహాలివ్వలేదు.

అంచేత అప్పటికప్పుడే కాలనీ సభ్యులందర్నీ నలుగురు నలుగురు చొప్పున గ్రూపులుగా విభజించి ఎవరు ఏ రోజు నైట్ వాచ్‌మన్ ఉద్యోగం చేయాల్సిందీ నిర్ణయించారు.

డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరికే ఆమె సూచించిన వార్నింగ్ బెల్‌లని అమర్చే కార్యక్రమం అప్పజెప్పారు. ఆమె వారం రోజులు గడువు అడిగింది. దాంతో సభ ముగిసింది. సరిగ్గా ఆ రాత్రే రెండింటికి కుటుంబరావింట్లోకి దొంగలొచ్చారు.

వాళ్ళంతట వాళ్ళేలేపే వరకూ కుటుంబరావుకి మెలకువరాలేదు. నలుగురూ నిక్కర్లు చొక్కాలు తొడుక్కుని చేతుల్లో మెరిసే కత్తులు పట్టుకుని నిలబడి ఉన్నారు. కుటుంబరావుకి వణుకూ, దడా వచ్చేసినయ్.

"దొ.... దొ.... దొ.... దొంగలు" అన్నాడు వణికిపోతూ.

"ష్ ! ఏటా ఎదవ కూతలు ! దొంగలు కాపోతే దొరలొత్తారా, సీబోడీ కొంపకి ! నోర్మూసుకుని ఆ ఇనప బీరువా తాళాం సేతులివ్వు !"

"కుటుంబరావు మాట్లాడకుండా తలగడకిందున్న తాళం చేతులు వాళ్ళకిచ్చాడు.

అవి తీసుకుని ముగ్గురు లోపలికెళ్ళారు.

ఇదే అదనుకుని "దొంగ-దొంగ" అని తీతువులా అరిచాడు కుటుంబరావు, మరుక్షణంలో దొంగ ఆతని నోరు మూసి చేతి మీద ఒక్కపోటు పొడిచాడు కత్తితో !

"నోర్మూసుకో పోయావంటే ఛాతీలో గుచ్చుతాను" అన్నాడు కోపంగా

కుటుంబరావు నోరు మూసేశాడు.

స్టీలు అల్మారాలోని నగలూ, డబ్బూ. ఇంకా కొన్ని విలువయిన వస్తువులూ అన్నీ చక్కగా పాకింగ్ చేసుకు వెళ్ళి పోయారు వాళ్ళు. కుటుంబరావు భార్య స్వల్పంగా గాయమయిన భర్త చేయి చూసి శోకాలు పెడుతూ పాత చీర చింపు కొచ్చింది

కుటుంబరావు అర్జంటుగా చేతికి కట్టు కట్టుకుని బయటకు పరుగెత్తి "దొంగలు" "దొంగలు" అంటూ కేకలు వేశాడు.

నలుగురు సభ్యులున్న వాచ్‌మన్ పార్టీ అతని ఇంటి ముందున్న మల్లె పందిరి కిందినుంచీ బయటి కొచ్చారు. ధైర్యంగా.

"వెళ్ళిపోయారా ?" అడిగాడు కుటుంబరావు.



"ఇప్పుడే-ఇటే వెళ్ళారు-"

"హమ్మయ్య ! ఈ ఒక్క-ఇంటితో వదుల్తారో వద్రో అని హడలిచచ్చాం అన్నాడొకతను

"వాళ్ళురావడం మీరు చూశారా ?" ఆశ్చర్యంగా అడిగాడు కుటుంబరావు

"చూడక పోవడం ఏమిటి ? వాళ్ళే మమ్మల్ని కత్తి చూపి తీసుకొచ్చి ఈ మల్లెపందిరి కింద కూర్చోబెట్టారు-"

"మరి మీరు కత్తులతో ఎదురు తిరగ లేదూ ? "

"వాళ్ళు తిరగనిస్తే కదా ! మేము నలుగురం ఆ చివరింటి వేపు వెళ్తొంటే వెనుకనుంచి మెడ మీద కత్తి పెట్టారు. తిరుగుతే చస్తారు-పదండి" అన్నారు. ఇంకేం చేస్తాం ! పల్లెపందిరి కింద వెళ్ళాం ! అక్కడినుంచీ కదతోద్ద న్నారు-కదల్లేదు"

కుటుంబరావుకి వళ్ళు మండి పోయింది.

అప్పటికే కాలనీ వాళ్ళంతా ఒక్కొ రొక్కరే గుమికూడి పోయారక్కడ.

"నేను చెప్పలేదు ? వాళ్ళు గలుగు రున్నా - మనం పదిమందున్నా ఒక్కటే !" అన్నాడు శంకరావు.

"అవును-మనకేమో పెళ్ళాం బిడ్డ లుండిరి-వాడేమో ప్రాణాలకు తెగించిన వాడాయె-" అన్నాడు ఇంకో పెద్ద మనిషి.

అంతరూ కుటుంబరావు పోగొట్టు కున్న ఆస్తి లెఖ్ఖలు వేశారు. మొత్తం పదకొండు వేల ఆస్తి గొవింథా!

"పదండి ! పోలీసులకు రిపోర్టి ద్దాం !" అన్నాడు గోపాల్‌రావు ఆవే శంగా.

"పోలీసు స్టేషన్‌కి ఎందుకు ? ముందు పోలీసు కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేయండి" ఎవరో అరచారు.

"అవును ! ఆ దొంగలు ఎంతో దూరం వెళ్ళి ఉండదు. ఈ రోడ్డువెంట ఇప్పుడే వెళ్తున్నారని చెప్తే. కంట్రోల్ రూము వాళ్ల వైర్‌లెస్‌లో అందరూ మాట్లాడుకుని ఆ దొంగల్ని ఇట్టే పట్టే స్తారు "

"అయితే పదండి! మార్తాండరావు గారింట్లో ఫోన్ ఉంది".

అందరూ మార్తాండరావు ఇంటి దగ్గర కెళ్ళారు. "గోపాల్రావుని మాట్లాడమనండి ! జర్నలిస్ట్ అంటే భయపడతారు పోలీసులు" అన్నా రొకరు.

గోపాల్రావు కంట్రోల్ రూమ్ నెంబర్ డయల్ చేశాడు గర్వంగా.

'ఎంగేజ్‌డ్' అన్నాడు వెంటనే. మరోక్షణం ఆగి మళ్లీ రింగ్ చేశాడు. మళ్లీ 'ఎంగేజ్‌డ్' అన్నాడు. అక్క



డున్నవాళ్ళందరికీ ఆశ్చర్యం కలిగింది.

"కంట్రోల్ రూమ్ ఫోన్ ఎంగేజ్ ఎలా ఉంటుందయ్యా - అదీ ఇంత రాత్రప్పుడు? ఒకవేళ అది చెడిపోయి అఘోరించిందేమో ! లోకల్ అసిస్టెన్స్‌కి కొట్టోరింగ్" సలహా ఇచ్చాడు రాజేశ్వర్రావు.

లోకల్ అసిస్టెన్స్ కూడా ఎంగేజే వినిపించింది.

"భలే తమాషాగా ఉందే ! అర్ధరాత్రికూడా ఇంతడిమాండ్ ఉంటుందా కంట్రోల్‌రూమ్‌కీ, లోకల్ అసిస్టెన్స్‌కీనూ" ఆశ్చర్యంగా అన్నాడు కుటుంబరావు.

గోపాల్రావు మళ్లీ కంట్రోల్‌రూమ్‌కి రింగ్ చేశాడు_ఊహూ! ఇంకా ఎంగేజ్ చూపిస్తూనే ఉందది. పావుగంట గడచిపోయింది. అనుకోకుండా లోకల్ అసిస్టెన్స్ నెంబరు రింగయింది.

"హలో అసిస్టెన్స్" అంది ఆపరేటరు.

"ప్లీజ్ కంట్రోల్‌రూమ్ ఎంగేజ్ చూపిస్తోందక్కడ - ఇరవై నిమిషాల నుంచీ! అర్జెంటుగా అక్కడికి కనెక్షన్ ఇవ్వండి - దొంగలు పారిపోతున్నారు"

ఆమె క్షణం తర్వాత మాట్లాడింది.

"సారీ! ఇట్ ఎంగేజ్‌డ్-"

"ఎంగేజ్‌డా?"

"అవును"

ఇందాకట్నుంచీ ఎంగేజ్‌డేనా?"

"అవునండీ!"

"ఇంత రాత్రప్పుడు ఎంగేజ్ ఏమిటండీ నా మొఖం? స్టైలుగా అన్నాడు అన్నాడు గోపాల్‌రావు."

"మీ మొఖం సంగతి నాకు తెలీదుగానండీ! ఆఫోన్ మాత్రం ఎంగేజ్ ఉంది!"

గోపాల్‌రావు ఖంగారుగా చుట్టు చూశాడు. పొరపాటున ఆ మాట ఎవరయినా విన్నారేమోనని.

"ఇదిగో చూడండి! నేను న్యూస్ పేపర్ జర్నలిస్టుని! ఈ టైమ్‌లో కంట్రోల్‌రూమ్ ఎంగేజ్ ఎలా వుంటుంది_ మరోసారి ట్రై చేయండి"

కంట్రోల్‌రూమ్ ఎప్పుడు బిజీగా ఉండేదీ తెలీని జర్నలిస్టులుకూడా ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అందామె


"అంటే రాత్రి రెండు గంటల సమయంలో అదెప్పుడూ ఎంగేజ్ ఉంటుందన్నమాట!"

"అవును స్వామి అవును!" అనేసి ఫోన్ పెట్టేసిందామె.

"రాత్రంతా ఆఫోన్ అలా ఎంగేజ్ ఉంటుం దేమిటి?" ఆశ్చర్యంగా కుటుంబరావు నడిగాడు గోపాల్‌రావు.

"అవునయ్యా! ఎడతెరిపి లేకుండ దొంగతనాలు జరగబట్టే-ఇలాపోన్లకెగబడుతున్నారు జనం!" ఎవరోఅన్నారు

"ఒక్క దొంగతనాలేమిటీ! మనం ఉన్నది ఆంధ్రప్రదేశ్ రాజధానిలో కదా! దోపిడీలు, మర్డర్‌లు, కార్లలో తిరిగి ఒంటరిగా కనిపించిన ఆడవారిని ఎత్తుకు పోయి మానభంగాలు చేయిడం



రౌడీలు వీరవిహారాలు చేయడం-ఇవన్నీ రాత్రుళ్ళే ఎక్కువగా జరుగుతాయ్ కదా! అందుకే కంట్రోల్ రూమ్ తెగ బిజీగా ఉంటుంది-"

మరోసారి కంట్రోల్ రూమ్‌కి రింగ్ చేశాడు గోపాల్‌రావు. అతని మొఖం వెలిగి పోయింది. కూతాత్తుగా చెయ్యి పైకెత్తి" సైలెన్స్! నిశ్శబ్దంగా ఉండండి! దొరికింది" అంటూ వెర్రి కేక వేశాడు,

"హలో" అన్నాడు అవతలివ్యక్తి

"హలో" నేను జర్నలిస్ట్ గోపాల్‌రావుని మాట్లాడుతున్నానండీ! నిర్భయ్ నగర్ కాలనీ నుంచి మాట్లాడు తున్నా నన్న మాటండీ! సంగతేమిటంటే కుటుంబరావుగారింట్లో దొంగలు పడ్డారండీ ఇప్పుడు సూట్‌కేస్‌లతో సహ నాగార్జునసాగర్ రోడ్డు వేపువెళ్ళారండీ! వాళ్ళు మొత్తం నలుగురు నలుగురు చేతుల్లో నాలుగు కత్తులు-ఇవే ఆనవాళ్ళు కుటుంబరావు గారింట్లో సొమ్ము అన్నీ తీసుకొని వాళ్ళ సూట్‌కేస్‌లలో పెట్టుకొని పోయారండీ - చాలాండీ ఇంకేమయిన వివరాలు కావాలా? గుక్కతిప్పకుండా మాట్లాడడం చేత ఆయాసపడ సాగాడు గోపాల్‌రావు. అందరూ అతనివేపు అభినందనపూర్వకంగా చూశారు.

"ఫుల్ డిటెయిల్స్- బట్ క్రిస్ప్! ఎంత చక్కగా ఇచ్చాడండి వివరాలు!" మెచ్చుకోలుగా అన్నాడు రాజేశ్వర్రావ్.

"అతనెప్పుడూ అంతేనండీ! జర్నలిస్ట్ కదా! టు ది పాయింట్- మాట్లాడతాడు! అంతే!" ఇంకెవరో పొగిడారు.

"హలో-" అన్నాడు గోపాల్రావ్ పొంగిపోతూ మళ్ళీ.

"హలో-" అంది అవతలి గొంతు

"నేను చెప్పినవన్నీ నోట్ చేసుకున్నారా? ఏమిటి? నేనా? నేను ప్రముఖ జర్నలిస్ట్ గోపాల్రావ్‌ని!"

"..................."

గోపాల్రావ్ మొఖం పాలిపోయింది.

"ఆ! ఏమిటి? మీరు కంట్రోల్ రూమ్ నుంచి కాదా! మరెక్కడినుంచి? మీ ఇంట్లోనూ దొంగలు పడ్డారా? గంట సేపటినుంచీ మీరూ కంట్రోల్ రూమ్ కోసం ప్రయత్నిస్తున్నారా? మరా సంగతి ముందే చెప్పరే- అనవసరంగా సంబర పడ్డాను- కంట్రోల్ రూమ్ దొరికిందని—"

అంతా మళ్ళీ నిరుత్సాహ పడిపోయారు.

"ఇలా కంట్రోల్ రూమ్ కోసం కూర్చుంటే పుణ్యకాలం కాస్తా పూర్తయిపోతుంది. త్వరగా మన పేట పోలీస్ స్టేషన్ వెళ్దాం పదండి!" అన్నాడు సంగీతరావ్.



"అవును- పదండి!" అన్నాడు రాజేశ్వర్రావ్.

"అందరూ ఎం... ...ండి! ... నలుగురు వెళ్తే సరిపోతుం... అందరం వెళ్ళామంటే మ... దొం...ల క్యాలి బాచ్ వచ్చి అన్నీ ఇళ్ళు ఊడ్చుక పోతారు- అన్నాడు మార్తాండరావ్.

"గోపాల్రావుని తీసు...ండి. జర్నలిస్ట్ అంటే కొంచం త...రగా యాక్షన్ తీసుకుంటారు" అన్నా...వర...

గోపాల్రావు, రాజేశ్వర్రావు, సీతాపతి, కుటుంబరావు కలసి పోలీస్ స్టేషన్‌కి బయల్దేరారు.

"ఎవరది?" అంతదూరంలో ఉండగానే అరచాడు సెంట్రీ.

"నిర్భయ్‌నగర్ కాలనీ వాళ్ళం" అన్నాడు గోపాల్రావు.

"ఏం కావాలి!"

"మా కాలనీలో దొంగతనం జరిగింది. కంప్లయింట్ ఇవ్వాలి-"

"అదుగో - ఆయనతో చెప్పం" అన్నాడు లోపల కుర్చీలో నిద్రన్నతనిని చూపుతూ.

అందరూ లోపలికెళ్ళి అయిదు నిషాల పాటు తంటాలు పడి అతని లేపారు. తన నిద్రకలా భంగం కలిగినందుకు అతనికి కోపం వచ్చింది.

"ఏంగావాలి?" అన్నాడు చిరాకుగా.

"దొంగతనం జరిగింది"

"ఎక్కడ?"

"కుటుంబరావు గారింట్లో"

"ఏ కుటుంబరావు?"

"సి. హెచ్. కుటుంబరావు"

"నేనడిగేది అదికాదు - ఎవరా కుటుంబరావు?"

"నేనే" అన్నాడు కుటుంబరావు ముందుకొచ్చి.

"ఆ! ఏం జరిగింది?"

"దొంగలు వచ్చి కత్తి చూపించి నగలూ, డబ్బూ, ఇంకా ఇతర వస్తువులు ఎత్తుకుపోయారండీ"

"ఎంతమంది ఉన్నారు వాళు?"

"నల్గురండీ"

"ఎలా వున్నారు?"

"నల్లగా-పొడుగ్గా వున్నారండి"

"ఇంతకు ముందెక్కడయినా చూసిన గుర్తుందా?"

"లేదండీ"

"నీ పేరేమిటి?"

"కుంబరావు—"

"ఏ కుటుంబరావు?"

"సి. హెచ్. కుటుంబరావు"

"మీ అయ్య పేరేమిటి?"

"మా ఫాదర్ పేరా?"

"అవును"

"ఆయన పేరు యెందుకు?"

"కావాలన్నయ్యా"

"శంభులింగం"

"ఏ శంభులింగం?"

"సి. హెచ్. శంభులింగం"

"నీ తాత పేరేమిటి?"

"తాత పేరు కూడా కావాలా?"

"కావాలన్నయ్యా"

"బసవరావు"

"ఏ బసవరాజు"

"సి. హెచ్. బసవరాజు"

"దొంగతనం ఎన్నిగంటలకు జరిగింది?"

"రెండు గంటలకు-"

"తలుపులు తెరచి ఉంచావా నువ్వు?

"నేనెందుకు తెరుస్తాను?"

మరెలా వచ్చిను వాళ్ళు?

"తలుపులు పగల గొట్టుకుని వచ్చారు-"

"అంత పని కూ నువ్వెందుకు లొల్లి పెట్టలేదూ?"

"పెట్టేంత టైముంటే ఈ గొడవంతా ఎందుకొస్తుంది?"

"ఆళ్ళనింకె వరయినా చూసినోళ్ళున్నారా?"

"నైట్ వాలంటిర్ పార్టీ వాళ్ళు చూశారు—"

"ఎవరాళ్ళు?"

"శ్రీధరం, రత్నాకరం, కిషోర్, రాజేష్-"

"వాళ్ళంతా నమ్మదగిన వాళే నా?"

కుటుంబరావు ఉలిక్కి పడ్డాడు.

"అదేంటండీ! వాళ్ళుమా కాలనీ వాళ్ళే ?"

"కాలనీ ఏమిటయ్యా! ఇంట్లో సొంత మనుషులే మర్డర్లు చేస్తున్నా- ఇయ్యాల్రేపు."

"అట్నే-వాళ్ళంతా నమ్మకస్తులే!"

"మీదే కాలనీ?"

"నిర్భయ్‌నగర్ కాలనీ!"

"నిర్భయ్‌నగర్ కాలనీయా?" ఇంకా చిరాకుగా అన్నాడు తను-

"అవును-"

"మరి ఇక్కడి కెందుకొచ్చారు?"

"ఇంకెక్కడి కెళ్ళాలి! రిపోర్టివ్వాల్సింది పోలిస్ స్టేషన్లోనేగా?

"పోలిస్ స్టేషన్లో కాకపోతే మంగలి షాప్‌లో ఇస్తారేమిటి? నేననేది అది కాదయ్యా! ఇది మీ ఏరియా పోలీస్ స్టేషన్ కాదు!"

"మరి మా ఏరియా పోలీస్‌స్టేషనెక్కడ ఉంది?"

"ఆ రోడ్డు చివర ఉంది-"

"అంత దూరం వెళ్లాలా ఇప్పుడు?"

"రిపోర్టివ్వాలంటే-"

అనేసి మళ్ళీ నిద్ర కోసం వెనక్కివాలాడతను.

నలుగురూ బయటికొచ్చారు.

"ఇంక ఇప్పుడెందుకులే రిపోర్టివ్వటం! పొద్దున్న వెళ్దాం!" అన్నాడు రాజేశ్వర్రావ్.

"అవును. యెలాగూ దొంగలీ పాటికి మరో రెండు మూడు ఇళ్ళు కూడా చూచుకుని వాళ్ళిల్లు చేరుకుని ఉంటాడు-" అన్నాడు సీతాపతి.

నలుగురూ మళ్ళీ కాలనీకి చేరుకున్నారు. అప్పటికే కాలనీ అంతా నిశ్శబ్దం అయిపోయింది. అందరూ నిద్రపోయినట్లున్నారు. వాళ్ళను చూడగానే కుక్కలు హఠాత్తుగా నాలుగు వేపులనుంచీ వచ్చి మొరగసాగాయ్. హఠాత్తుగా వాలంటరీ పార్టీవాళ్లు కర్రలు తీసుకుని పెద్దగా కేకలు వేసుకుంటూ పరుగుతో వచ్చారు. మరు క్షణంలో అందరిళ్ళల్లోనూ లైట్లు వెలిగిపోయినయ్. క్షణాల్లో కాలనీ వాళ్ళందరూ వాళ్ళ చుట్టూ మూగిపోయారు.

"ఇందాకా వచ్చిన దొంగలేనా?" అన్నాడు మార్తాండరావ్ వాళ్ళ మొఖాల మీద టార్చ్‌లైట్ వేస్తూ.

కుటుంబరావుకి వళ్లు మండిపోయింది.

"సిగ్గులేకపోతేసరి. నిజంగా దొంగలొచ్చి దోచుకుపోయినప్పుడు ఒక్కడూ దిక్కులేడుగానీ ఇప్పుడు భూమి ఈనినట్లు వచ్చేశారు" అన్నాడు చిరాకుగా.

"అవును - కుక్కలూ అంతేగా" అన్నాడు తాపీగా సీతాపతి.

"మీరిద్దరూ స్కూటర్ మీద వెళ్ళి మన ఏరియా పోలీస్ స్టేషన్లో రిపోర్టిచ్చిరండి. నేనూ సీతాపతి వెళ్ళి మాపేపర్లో ఈ వార్త ఎక్కించేసి వస్తాను —" అన్నాడు గోపాల్రావు.

"ఏమని రాస్తావు న్యూస్?" ఎవరో అడిగారతనిని సంబరంగా.

"నిర్భయ్‌నగర్‌లో భయంకరమైన డెకాయిట్రీ! ఇంటి యజమాని కుటుంబరావుతో ట్రీ! పదకొండు వేల ఆస్తి రా! చేతికి కత్తిపోట్లు - పోలీసువారి నిర్లక్ష్యం" ఇదంతా మెయిన్ హెడ్డింగ్ అన్నమాట. కింద నాలుగు పేరాలు వివరాలు రాస్తాను".

"అబ్బ ఒండర్‌ఫుల్-" అన్నాడు రాజేశ్వర్రావు.

మర్నాడు ఉదయం ఆరుగంటలకల్లా న్యూస్ పేపర్ కొని కాలనీ వాళ్ళంతా

తమ కాలనీ దొంగతనం వార్త ఉత్సాహంగా చదువుకోసాగారు. మరి కాసేపట్లో పోలీస్‌వానూ, జీపూ వచ్చేసినయ్ అక్కడకు.

అందులో నుంచి బిలబిలమంటూ పోలీసులు, పోలీసు కుక్కలు, పోలీస్ అధికారులు, ఓ ఫోటోగ్రాఫరూ దిగి కుటుంబరావు ఇంట్లోకి జొరబడ్డారు. దాంతో కాలనీవాళ్ళంతా కుటుంబరావు ఇంటిముందు మూగిపోయి ఉత్సాహంగా చోద్యం చూడసాగారు. కుక్కలు దొంగలవాసన గుర్తెట్టుకుని వాళ్ళను పట్టుకోడానికి బయటికొచ్చాయ్. అందరూ వాటి వెనుకే బయల్దేరారు. అవి కాలనీచుట్టూ రెండు రౌండ్లు గోపాల్రావు ఇంట్లో దూరి మొరగసాగాయ్.

"అదేమిటి? అతన్ని చూసి మొరుగుతాయ్?" అన్నారు జనం.

"మీరెవరు?" అన్నాడు పోలీసు అధికారి గోపాల్రావుని చూసి.

"జర్నలిస్ట్ గోపాల్రావు ఇతనేనండీ ఈ దొంగతనం గురించి ఇవాళ పేపర్లో రాసింది ఇతనే" పరిచయం చేశాడు రాజేశ్వర్రావు.


"ఓహో" అనుమానంగా తల పంకించాడతను.

"అయితే పోలీస్ స్టేషన్‌కి పదండి"

గోపాల్రావు అదిరిపడ్డాడు. "పోలీస్ స్టేషన్‌కా? ఎందుకు?"

"మిమ్మల్ని ప్రశ్నించాల్సి ఉంది-"

ఈలోగా కుక్కలు మళ్లీ జుయ్‌మంటూ పరుగెత్తి సీతాపతి ఇంట్లో దూరాయ్. అదిచూసి సీతాపతికి చలి జ్వరం వచ్చేసింది. "ఇదేం అన్యాయం



సార్. చిన్నప్పటినుంచీ పూచిక పుల్ల కూడా ముట్టుకుని ఎరగను"

కుక్కలు అక్కడినుంచీ గుంపులో నిలబడ్డ రాజేశ్వర్రావుని చూసి మొరగటం ప్రారంభించేసరికి పోలీసు అధికారికి చిరాకేసుకొచ్చింది.

"అంటే మేమందరం దొంగలమేనంటారా ?" అడిగాడు రాజేశ్వరావు. అంధరూ ఘొల్లున నవ్వారు.

"ఇంక వీటిని తీసుకుపోండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కుక్కలు మళ్ళీ వాన్ ఎక్కి వెళ్ళిపోయాయ్.

కాలనీ వాళ్ళంతా పోలీస్ అధికార్ల చుట్టూ ముగారు

"ఇలా విచ్చల విడిగా దొంగతనాలు జరుగుతూంటే మీరేం చేస్తున్నట్లు ?" అందరి తరపునా వకాల్త పుచ్చుకున్నట్లు అడిగాడు గోపాల్‌రావు.

పోలీస్ అధికారికి వళ్ళుమండి పోయింది.

"నువ్వెవరివి ?"

"జర్నలిస్ట్‌ని !"

"ఓహో-అయితే పోలీస్ డిపార్ట్‌మెంట్ ఏంచేస్తూందో అది వరకు మీ పేపర్లు రాయలేదా ? "

"రాశాం !"

"మరిమళ్ళి అడుగుతారేం ?"

"డెకాయిటీలు ఎక్కువయి పోయాయ్ కాబట్టి !"

"డెకాయిటీలు ఎక్కువ్వలేదు-" కోపంగా అన్నాడు పోలీస్ అధికారి.

"అబద్ధం !" అరచాడు గోపాల్.

"అవును అబద్ధం" అన్నారు అందరూ వక్తాసుగా.

"అబద్ధం ఏమీ లేదు-"

"అయితే మరి డెకాయిటీలు రోజు కొటి జరుగు తూంటే లేదంటారేది ?"

పోలీస్ అధికారి తలరెండు చేతుల్తో పట్టుకున్నాడు.

"అవి దొంగతనాలు ! అంటే వాటిని 'రాబరీ' అంటారు. డెకాయిటీలు వేరు-"

"రెండు ఒకటేగా ? ఏరాయి అయినా మావిళ్ళేగా ఊడేది ?" ఎవరో అరచారు.

"కాదయ్యాబాబు ! రెండు వేరు-"

"ఏమిటో ఆతేడా ? "

"నలుగురు గానీ- ఇంకా తక్కువ గానీ దొంగలు వస్తే అది రాబరీ ! అయిదుగురు గానీ ! ఇంకా ఎక్కువ గానీవస్తే అది డెకాయిటీ-"

"అయితే ఇప్పుడు కుటుంబరావు గారింట్లో జరిగింది డెకాయిటీ కాదంటారు ?"

"మేము దాన్ని 'రాబరీ' కేటగిరిలో వేసు కుంటాం !"

"మీరు దేనికిందేసుకుంటే మాకెందు కండీ ! ఇప్పుడీ దోపిడీ-"

"ఇది దోపిడీ కాదన్నా నా. దొంగ తనం అనుఅ.

"అబ్బా -ఏదొకటి లెండిసార్"

"అలా వీల్లేదు దేనికదే. మీఇష్టం వచ్చినట్లు మీరు పేర్లు పెడితే ఎలా?"

ప్రతిదానికీ ఓపేరూ, ఓ మెయిన్ హెడ్డూ, ఓ ప్రొసీజరూ వుంటాయ్"

"అయితే ఇప్పుడే మంటారు?"

"ఇది రాబరీకింద వస్తుంది. డెకాయిటీ అనడానికి వీల్లేదు-


"సరే అనం, అయితే ఇప్పుడు రాబరీ కిందవచ్చింది కాబట్టి మనకేమయినా లాభం వుందా?"

"ఎందుకులేదు? అన్నీ ఒకటిగా లెక్కవేసి-ఆ సంఖ్య చూస్తే గుండె పగిలిపోదూ అందరికి? అందుకే ఇలా విభజించేస్తే చాలా తక్కువగా కనబడతాయ్"

పోనీ ఇంకోపనిచేయకూడదాసార్"

"ఏమిటది?"

"సరదా దొంగతనాలు, అవసరం కొద్దీ దొంగతనాలు, ఆకలి దొంతతనాలు. అలవాటు చొప్పున చేసిన దొంగతనాలు, మానసిక బలహీనతవల్లచేసే దొంగతనాలు- ఇలా బోలెడు భాగాలుగా విభజిస్తే అన్నరా తగ్గిపోతాయిగా.



ఇంచుమించుగా ఏమీలే స్టేట్‌మెంట్లి వ్వచ్చు-"

ఆయన అర్జంటుగా జీపెక్కి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం మళ్లీ కాలనీ మీటింగ్ జరిగింది.

"నేను ఆరోజే చెప్పాను-పది ఇళ్లకు కలిపి వో వార్నింగ్ బెల్ ఏర్పాటుచేయమని. కానీ యెవరూ వినిపించుకోలేదు. ఇప్పటికయినా దాని విలువ గుర్తించి యేర్పాటు చేశారంటే ఆ దొంగల్ని మనమే పట్టుకోవచ్చు-" అంది డిటెక్టివ్ రచయిత్రి ఆవేశంగా; అప్పటికప్పుడే చందాలు పోగుజేశారు నలుగురు ఎలక్ట్రిషియన్లు ఆ రాత్రంతా పని చేసి మర్నాటికి వార్నింగ్ బెల్స్ ఏర్పాటు జేసేశారు. చాలా సార్లు వాటిని ప్రయోగాత్మకంగా మోగించి సంతృప్తి చెందారు.

రాజేశ్వరే రాత్రిళ్లు రాబరీ డ్రిల్స్ నిర్వహించింది. అంటే రాత్రి రెండింటికి ఏదోక ఇంట్లో నుంచి వార్నింగ్ బెల్ వస్తుందన్నమాట. దాంతో అందరూ బయటకు పరుగెత్తుకు రావాలి. ఆ డ్రిల్స్ విజయవంతంగా పూర్తయినాయి. ఆ మర్నాడే సీతాపతి ఇంట్లో దొంగలు పడ్డారు. వాడు ఎలాగోలా ధైర్యం తెచ్చుకుని వార్నింగ్ బెల్ కొట్టాడు. కానీ అ చుట్టు పక్క వాళ్ళందరి ఇళ్ళ ముందే బయటనుంచీ గొళ్ళాలు పెట్టేశారు దొంగలు. అంచేత దొంగలు అన్నీ ఎత్తుకుపోయాక సీతాపతే వెళ్ళి అందరి తలుపు గొళ్లాలూ తీయాల్సివచ్చింది.

ఆ మర్నాడు మళ్ళీ కాలనీ మీటింగ్ జరిగింది.

"సోదరులారా! మనం చేయగలిగినవన్నీ చేశాం! ఇప్పుడు మనకు తెలిసొచ్చిన విషయం ఏమిటంటే మన ఉపాయాలేమీ పనికిరావని! ఇంకా కొత్త ఉపాయాలేమయినా ఎవరయినా సూచించగలరా?" అడిగాడతను. ఎవ్వరూ మాట్లాడలేదు. చివరకు శంకర్రావే లేచి నిలబడ్డాడు.

"ఈ సమస్యకు ఒకే ఒక్క పరిష్కారం ఉంది" అన్నాడతను.

"ఏమిటది?"

"దొంగలకు మనమే స్వాగతం చెప్పడం!"

అందరూ నవ్వారు.

"వీడికి పిచ్చి పట్టింది" అనుకున్నారు కొందరు.

"అయ్యా! నాకేం పిచ్చి పట్టలేదు. ఫాక్ట్స్ చెబుతున్నాను. దొంగలకుమనందరంకలసి స్వాగతం చెప్దాం. బాబూ మా ఇళ్లు అలా ఇష్టం వచ్చినట్లు దోచుకోకండి. మీకు నెలనెలా మేమే ఎంతో కొంత ముట్టజెబుతాం అని రిక్వెస్ట్ చేద్దాం". మళ్లీ కేకలూ-నవ్వులూ చెలరేగినయ్.

కాసేపు కోలాహలం తరువాత కుటుంబరావు లేచాడు.

"మన సోదరుడు శంకర్రావు సూచించిన ఉపాయమే బాగున్నట్లు తోస్తోంది" అన్నాడు వినయంగా.

"అవును నాకూ అదే మంచిదనిపిస్తోంది" అన్నాడు రాజేశ్వరరావు.

మరి కాసేపట్లో అందరూ శంకరరావు ఆలోచన బాగానే వుందనే నిర్ణయాని కొచ్చారు.

వెంటనే శంకరరావు అధ్యక్షుడిగా దొంగల స్వాగతం కమిటీ ఒకటి వేశారు. కుటుంబరావు, రాజేశ్వరరావు గోపాలరావు, సీతాపతి అందులో సభ్యులు,

"ఇంతకూ దొంగలకు ఆహ్వానం పంపడం ఎలా?" అడిగాడు వో సభ్యుడు.

"దానిదేముంది? అన్ని న్యూస్‌పేపర్లలోనూ ఆహ్వానపత్రాలు పబ్లిష్‌చేద్దాం వాళ్లెలాగూ న్యూస్‌పేపర్లు చదువుతారు కాబట్టి తెలుసుకుని సంప్రదింపులకు వచ్చేస్తారు."

ఆరోజే టాక్సీలో సిటీ అంతా తిరిగి నాలుగుభాషల్లో ఎనిమిది న్యూస్‌పేపర్లలో ఆహ్వానాలు ప్రకటింప జేశారు వాళ్లు.

"మహారాజశ్రీ దొంగలకు నిర్భయ్ నగర్ కాలనీ వాసుల సుస్వాగతం! ఆర్యా మా కాలనీలో మీకు వచ్చే శనివారం రాత్రి ఘనమయిన స్వాగతసభ యేర్పాటు చేయబడుతుంది. కనుక మీరెల్లరు మా స్వాగతాన్ని మన్నించి, సభకు విచ్చేసి మాతో సంప్రదింపులు జరపవలసిందిగా ప్రార్థిస్తున్నాము. మీరు జరుపుతున్న దొంగతనాలవల్ల రాత్రుళ్లు మీకూ, మాకూ నిద్రాభంగము జరుగుచున్నది, అంతే కాదు. తరచుగా మీ కత్తి పోట్లవల్ల మాశరీరాలకు గాయాలు వాటిని మాన్పించుటకు డాక్టరు బిల్లులు, మీ మీద రిపోర్ట్ ఇచ్చుటకు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం. దానికి ఆటోటీ కర్చులు, కొన్ని నగలు బాంక్ లాకర్లలో దాయడం ములాన దా కయే లాకర్ ఛార్జీలూ, నగలలో కొంతబంగారం బాంక్ వారు కొట్టేయడం-లేదా బాంక్‌లోనే దొంగ తనం జరగడం. ఇవన్నీ ఆలోచించి మేమీ నిర్ణయాని కొచ్చాము. కనుక మీరు తప్పక శనివారం రాత్రి మాచే ఏర్పాటు చేయబడిన ఆహ్వానసభకు విచ్చేసి మాతో సంప్రదింపులుజరిపి, పరిష్కారపత్రాల మీద సంతకము చేసి, ఆ తరువాత మే మొసంగు చందన, తాంబూలాది సత్కారములు గైని మమ్మానందింప జేయవలసిందిగా ప్రార్థిస్తున్నాము- ఇట్లు ఆహ్వాన సంఘం."

శనివారం రాత్రి కాలనీ ఆవరణ అంతా పండగ వాతావరణం అలుముకు పోయింది. పెద్ద షామ్యానాలు, పెద్ద వేదిక, రంగు రంగుల దీపాలు, మైకులు రికార్డులతో కూడా వుడిగా ఉంది.

"దొంగ మహాశయులకు సుస్వాగతం" అన్న బోర్డు దేదీప్యమానంగా వెలుగుతుంది. సరిగ్గా రెండింటికి ఆరుగురు దొంగలు కారు దిగారు.

వెంటనే శంకరరావు, మిగతాకమిటీ సభ్యులు ఎదురు వెళ్ళి పూల దండలు వేసి స్వాగతం పలికారు. అందరూ వేదిక మీద కూర్చున్నారు. ఆదొంగల్లోకందరికీ ఛీఫ్ దొంగను మాట్లాడ వలసిందిగా కోరాడు. దొంగ లేచి మైక్ దగ్గరకొచ్చాడు.

"సోదర సోదరీ మణులారా! మేము దొంగలమే! వప్పుకుంటున్నాను కానీ మేము దొంగల మయింది మాకేం సరదా పుట్టికాదు. అది ఒక్క వృత్తిగా స్వీకరించాం! అందులో తప్పేమిటో నాకు అర్థం కావటంలేదు. రాజకీయాలు ఒక వృత్తి. అలాగే గూండాయిజం ఒక వృత్తి అలాగే మర్డరు చేయడం ఒకవృత్తి ఈ వృత్తులన్నీ కూడా మనం చేసేది కేవలం డబ్బు సంపాదనకే నని అందరికీ తెలుసు. మరి దొంగ తనం కూడా డబ్బు సంపాదనకే కదా చేసేది! దీన్ని 'ఇల్లీగల్' అని ఎందుకంటున్నారో నాకు తెలేటం లేదు. ఇప్పటికయినా మీలో చైతన్యం కలిగి దీనిని చట్టసమ్మతం చేయడానికి ప్రయత్నిస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది. మాక్కావలసిందేమీ లేదు. మాకూ, మా భార్యాబిడ్డలకూ మూడు పూటలా తిండీ, కొంచెం ఖరీదయిన బట్టలూ, సొంతిల్లూ, కారు మెయింటెనెన్స్ ఖర్చులు, పెట్రోలు ఖర్చులూ, రోజుకో విస్కీ బాటిలూ-ఇంతే మాక్కావలసింది. వీటికోసమే మేము దొంగతనం చేస్తున్నాం - మిమ్మల్ని కత్తులతో పొడుస్తున్నాం! మీరు సరి వీటన్నిటికీ సరిపోయే డబ్బు నెల నెలా మాకు పడేస్తే మేము ఇంక మీ జోలికెందుకు వస్తాం. ఛస్తే రాము - జై

హింద్-" అంటూ స్పీచ్ ముగించా డతను.

అందరూ తప్పట్లు కొట్టారు.

మరుక్షణంలో సంప్రదింపులు ప్రారంభమయ్యాయ్.

చివరకు అందరూ ఓ నిర్ణయాని కొచ్చారు. ఒప్పందం మీద సంతకా లయాయ్.

కాలనీ రిజిష్టర్‌లో దొంగగా నమో దయిన వారందరికీ నెలకు పదిహేను వందలచొప్పున జీతం (కన్సాలిడేటెడ్) ఇవ్వబడుతుంది. సంవత్సరానికో సారి దీపావళి పండుగ ముందు వేతనానికి సమానమయిన బోనస్‌కూడా ఇవ్వబడు తుంది. దీనికి ప్రతిఫలంగా వారు నిర్భయ్ నగర్ కాలనీని "సురక్షిత ప్రాంతంగా" ప్రకటిస్తారు. అంటే వారు దొంగతనాలు చేయరు. ఆ కాల నీలో ఇంకొకరిని చేయనీరు.

అందరూ ఆ ఎగ్రిమెంట్‌కి హర్షం వెలిబుచ్చారు. ఆ తరువాత అల్పాహాల విందు జరిగింది.

విందులో దొంగల నాయకునితో తన ఇంటర్వ్యూ ప్రారంభించాడు జర్న లిస్ట్ గోపాల్రావు.

"అయ్యా తమరి స్వగ్రామంఏది?"

"దొంగల లీడర్ నవ్వాడు. "మా గ్రూపులో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వారెవరూ లేరు ప్రస్తుతానికి" అన్నాడు.

"అదేమిటి? మీ రాష్ట్రంలో మీరు దొంగతనాలు చేసుకోకుండా, పరాయి రాష్ట్రాల్లో ఎందుకు చేస్తున్నారు?"

దొంగల నాయకుడు ఆ ప్రశ్నకు చిరాకు పడ్డాడు.

"నీళ్ళు ఎటు ప్రవహిస్తున్నాయ్ ?" అనడిగాడు గోపాల్రావ్‌ని.

"పల్లం వేపు."

"అవునా? మరి మేమూ అంతే! ఏ రాష్ట్రంలో పోలీస్ డిపార్ట్‌మెంట్ చేత కానిది ఉంటుందో- అక్కడ హాయిగా బతకొచ్చుకదా మేము!"


"ఓహో అదా సంగతి!" అసలు రహస్యం తెలిసినట్లు రాసుకున్నాడు గోపాల్రావ్.

"అంటే మీ ఉద్దేశ్యం- కేవలం పోలీస్ డిపార్ట్‌మెంట్ దీనికి పనికిరాదు అన్న రాష్ట్రంలోనే దొంగతనాలు చేస్తా రన్నమాట! అంతేనా?"

"అంతేకాదు. ఇంకోటి కూడా ఉంది!

"అదేమిటి ?!"

"ప్రజలు! ఇక్కడి ప్రజలు గంగి గోవుల్లాంటి వారు. కత్తి చూపించగానే సర్వస్వం ఇచ్చేస్తారు. ఎన్ని దొంగ తనాలు చేసినా- ఎంత మందిని చావ గొట్టినా- కిక్కురు మనకుండా పడి ఉంటారు. ఇంత చేతకాని ప్రభుత్వాన్ని



తీసిపారేయాలని కోరుకోరు! కనుక మేము హాయిగా రిటైరయేవరకూ సుఖ ప్రదమయిన జీవితం గడపొచ్చు ఈ రాష్ట్రంలో।"

"సరే- ఇప్పుడు మీరు ఇంత ధైర్యంగా వచ్చారు కదా ఇక్కడికి! ఒకవేళ పోలీసులు వచ్చి పట్టుకుంటే ఏం చేసేవారు?"

ఆ దొంగల నాయకుడు పకపకా నవ్వాడు.

"ఏమిటి నవ్వుతారు?"

"ఇంత చిన్న విషయం తెలీలేదంటే ఆశ్చర్యంగా ఉంది"

"ఏమిటా చిన్న విషయం?"

"పోలీసులెప్పుడయినా దొంగతనం జరుగుతుండగా గానీ, మర్డర్ జరుగు తుండగా గానీ లేక ఇంకేదైనా క్రైమ్ జరుగుతుండగా ఎవరినయినా పట్టుకోవ డం గురించి విన్నారా?"

"లేదు-"

మరింకా ఇప్పుడు మాత్రం ఎలా పట్టుకుంటారయ్యా. భలే జర్నలిస్ట్‌వే నువ్వు. నీలాంటి తెలివి తక్కువ జర్న లిస్ట్‌లుండబట్టే దేశం ఇలా అఘో రించింది - వస్తా" అంటూ లేచాడతను.

అందరూ కారువరకూ వెళ్ళి వాళ్ళకి వీడ్కోలు ఇచ్చారు. అంతే! ఆ తరువా తెప్పుడూ ఆ కాలనీలో దొంగతనం జరగలేదు. ★

20 జ్యోతి సంవత్సరాల వెలుగు

ఆ రోజు సంక్రాంతి... పంథొమ్మిది వందల అరవై మూడు


ఓ వేపు కృష్ణవేణి, ఓ వేపు కనకదుర్గమ్మ, ఈ వైపు నగరం, రద్దీ, హడావుడి, బస్సులు, జనం.... జనప్రవాహంలో మరోవేపు

ఆ సాయంత్రం జ్యోతి వుదయించింది.

మేధావులు, కళాకారులు ఎందరెందరో కూడిన ప్రశాంత సమూహంలో జ్యోతి మాస పత్రిక ఆనందోత్సాహారంభం జరిగింది. శ్రీ అక్కినేని సంచికని విడుదల చేయగా సభకి శ్రీ నార్ల అధ్యక్షత వహించడం.... శ్రీ రాఘవయ్య గారు సంచిక వెలువరించడం.... ఉత్సాహంగా జరిగాయి....



అనాటి ప్రారంభోత్సవ సభలో జ్యోతిని అందజేస్తున్న శ్రీ రాఘవయ్య, జ్యోతిని ఆవిష్కరిస్తున్న శ్రీ అక్కినేని, శ్రీ నార్ల.



జ్యోతికి వెలుగు నందించిన శ్రీ రాఘవయ్య, శ్రీ నార్ల. శ్రీ అక్కినేని, శ్రీ నండూరి రామ్మోహనరావు....ఆపైన శ్రీ బాపు. శ్రీరమణ, శ్రీ వి.ఎ.కె. రంగారావు, శ్రీ వి కొండలరావు

జ్యోతి 20 సంవత్సరాల యవ్వన ప్రాయం సందర్భంగా



శ్రీ అక్కినేని తో జరిపిన ఇంటర్వ్యూ

★ నలభై సంవత్సరాల చిత్ర జీవితం వెనక్కి తిరిగి చూసుకుంటే మీకేమనిపిస్తోంది ?

ఎక్కువ అభిరుచిగల చిత్రాల ద్వారా ముందుకు, కొన్ని తక్కువ అభిరుచిగల చిత్రాలద్వారా వెనక్కి వెడుతున్నాం అనిపిస్తోంది. చిత్రాల ముఖ్య ఉద్దేశం నా దృష్టిలో ప్రధానంగా వినోదం. వినోదం అంతర్లీనంగా ఏ విషయాన్నైనా చెప్పవచ్చు. చేదు మాత్రకి, తీపి మాత్రకి ఎంత తేడా వుందో, ఇందులోనూ అంతే వుంది. ఒక చిత్రం చూస్తుంటే చక్కటి అనుభూతి కలగాలి. అలా కలగనప్పుడు ఆ చిత్రం మన మనసులో నిలవదు. అలా నిలవని దానికి మనుగడ లేదు.


సెక్స్, సెక్స్, సెక్స్ అని ప్రతివాళ్లూ అదేదో కాని పని అన్నట్టు, చెప్పుకోవడమే పాపం అన్నట్టు ప్రవర్తిస్తుంటారు. నా దృష్టిలో సెక్స్ ఐ మీన్ శృంగారం పవిత్రమైంది. కాకపోతే పవిత్రమైన దేవాలయాల మీద శృంగార క్రీడలకు సంబంధించిన బొమ్మలు ఎందుకు చెక్కుతారు? ఒక్కసారి ఆలోచించండి.

కాలంతోపాటు మనుషుల ఆలోచన్లో వచ్చే మార్పు, లేదా స్పీడు చిత్రాల మీద కూడా పడింది. అప్పుడు నిలకడగా వుండి నీళ్లు త్రాగుదాం అనుకుంటే ఇప్పుడు పరుగెత్తి పాలు తాగుదాం అనుకుంటున్నారు. ఆలోచిస్తే మీకే తెలుస్తుంది.

★ ఒకప్పటికీ ఇప్పటికీ నటుడుగా, స్టూడియో అధినేతగా, నిర్మాతగా వచ్చిన మార్పులు గురించి మీ అభిప్రాయం ఏమిటి ? రేపు చిత్రాలలో వచ్చే మార్పు ఎలా వుంటుందని మీరు భావిస్తున్నారు ?

వచ్చిన మార్పులు మీకందరికీ తెలిసిందే. మళ్ళీ నేను ప్రత్యేకంగా ప్రస్తావించనక్కర్లేదు. రాబోయే మార్పు గురించి అంటారా ? ప్రపంచంలో వచ్చే మార్పు ఎలా వుంటుందో, అలాంటి మార్పే చిత్రరంగంలో కూడా వస్తుంది. కాకపోతే ఇంకాస్త పాపం పండాలి. పెరుగుట విరుగుట కొరకే

అన్నారు కదా, అంచేత మరి కొంత టైం కావాలి. అప్పుడే పూర్తిగా విప్లవం వస్తుంది. ఐతే నేను నటుడుగా వుండగా ఆ మార్పు వస్తుందో, రాదో చెప్పలేను కాని, జీవించి వుండగా మాత్రం తప్పకుండా మార్పు వస్తుంది.



★ మీ నట జీవితంలో మిమ్మల్ని కష్టపెట్టిన పాత్ర ఏది ? మిమ్మల్ని చాలా కాలం వెంటాడిన పాత్ర ఏది ? ఈ పాత్ర నేనెందుకు ఒప్పుకొన్నాను ? అని పశ్చాత్తాపపడిన పాత్ర ఏది ? మీరు ఊహించని విజయాన్ని తెచ్చిపెట్టిన పాత్ర ఏది ?

ఒక తండ్రి తన బిడ్డల్లో అనేక దుర్గుణాలు వున్నా పైకి చెప్పుకోలేడు. అది కుటుంబ వ్యవహారం కాబట్టి గుట్టుగా వుండాలి. ఇదీ అంతే. లోపాలు వున్నా బయటకు చెప్పడం మంచి లక్షణం కాదు. అలా బయట పెట్టినవాడు తండ్రి కాడు.

★ ఎవరి దర్శకత్వపు శైలి అంటే మీకు ఎక్కువ ఇష్టం? మీలో నటుడిని బాగా ఎక్స్‌ప్లాయిట్ చేసిన దర్శకుడెవరు? అసలు దర్శకుడికి మీరు ఇచ్చే నిర్వచనం ఏమిటి?

ప్రశ్న బాగానే వున్నా సమాధానం చెప్పాలంటే ఇబ్బందులొస్తాయి. నటుడుగా ఇంకా కొనసాగుతున్న నేను వీటికి సమాధానం చెప్పడం భావ్యం కాదు.

★ ఇన్ని సంవత్సరాల నటజీవితానుభవం వున్న మీరు దర్శకుడుగా మారక పోవటానికి కారణం ఏమిటి?

దర్శకత్వం అనేది చాలా బాధ్యతాయుతమైన పని. అనుకున్నంత సులువు కాదు. ఇటు నటన, అటు దర్శకత్వం, వేరే పనులు ఇన్నింటిని చూసుకుంటే ఏకాగ్రతగా పనిచేయడం కష్టం. అయినా నవరసాలు పండించే ముఖం వుంది దాన్ని తీర్చిదిద్దుకోవాలనుకున్నాను. దర్శకత్వపు ఆలోచన ఇప్పటిదాకా కలుగ లేదు. ముందు చెప్పలేను చేయవచ్చు. చేయకపోనూవచ్చు.

★ రెండువందల చిత్రాలకు పైగా విభిన్నమైన పాత్రలలో నటించారు. ఇవికాక ఇంకా మీలో కదలాడే పాత్రలు ఏమైనా వున్నాయా?

ఉన్నాయి. పోతన, వేమన, త్యాగయ్య, స్వామి వివేకానంద. రామానుజాచార్య, శంకరాచార్య మొదలైనవి. ఎప్పటికైనా చెయ్యాలని ధ్యేయం.

★ సుడిగుండాలు, మరోప్రపంచం చిత్రాలు విజయవంతం అయితే అలాంటి చిత్రాలే నిర్మించి వుండేవారా? అంత చక్కటి సామాజిక ప్రయోజనం వున్న నిర్మించిన మీరు మళ్ళీ అలాంటి ప్రయత్నం తలపెట్టకపోవడానికి కారణం ఏమిటి?

తప్పకుండా తీసేవాడిని. ఆదుర్తి మరణంతో కొంత నిరాశపడ్డాను. చక్కటి చిత్రాలు నేనూ వప్పుకుంటాను. కాని, అది విజయవంతం కాలేదు.

కనీసం ప్రభుత్వపరంగా గుర్తింపు కూడా రాలేదు. అందుకే నీతులు చెప్పడం ఎందుకు చేతులు కాల్చుకోవడమెందుకు అని భావించాను. అటువంటి ప్రయత్నాను అంతటితో స్వస్తి చెప్పాను.

★ ఆదుర్తి + అక్కినేని + ఆత్రేయ + ఘంటసాల + సావిత్రి = సక్సెస్‌ఫుల్ చిత్రం అని అంటారు. మీరు వప్పుకుంటారా?



ఒప్పుకోను. కథ అందరికీ నచ్చినప్పుడు అది విజయవంతం అవుతుంది. నా ఉద్దేశంలో కథకి యాభై మార్కులు. సంగీతానికి ఇరవై ఐదు.

దర్శకత్వానికి పదిహేను. నటీనటులకు పది. దీనిని బట్టి ఆలోచించుకోండి. ఎవరి శాతం ఎంత వుంటుంది!

★ సినిమా మీడియా తరువాత, శక్తివంతమైనవి పత్రికలు. అంచేత నేటి పత్రికా రంగంమీద మీ అభిప్రాయం ఏమిటి?

సినిమా రంగం ఎలా వుందో, పత్రికారంగం కూడా అంతే.

★ నటులైన తరువాత రాజకీయ నాయకులైన యం.జి.ఆర్., శివాజీ, యన్.టి.ఆర్. మీద మీ అభిప్రాయం 2 ప్రాంతీయ పార్టీలవల్ల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?


ఏకీభవిస్తాను. అయితే ప్రాంతీయ పార్టీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో నేను అప్పుడే చెప్పలేను. కాని, ప్రతిపక్షంలో వుంటే ప్రజలకు కొన్ని మంచి పనులు జరగటానికి అవకాశం వుంది. ఐ ఓపెనింగ్.

★ ఘంటసాల, సావిత్రిలేని లోటు మీకు కన్పిస్తోందా?

ఎందుకు కన్పించడం లేదూ? ఘంటసాల, సావిత్రి, నా కుడి ఎడమ చేతుల వంటివారు. ఆ రెండూ పోయినంత బాధగా వుంది. మా ముగ్గురికీ పెర్ఫెక్ట్ కాంబినేషన్.

★ ఈ దేశంలో చచ్చిపోయిన తరువాత మేధావులకు కళాకారులకు గుర్తింపు అనే దానితో మీరు ఏకీభవిస్తారా?


చచ్చిపోయిన తరువాతే గుర్తింపు అన్నదానితో నేను ఏకీభవించను. నన్ను ఎంతో మంది గుర్తించి గౌరవిస్తున్నారు. లేకపోతే పద్మశ్రీ, నట సామ్రాట్, డాక్టరేటు వచ్చేవా? అసలు అందరూ గుర్తించకపోతే నలభై సంవత్సరాలు నటుడుగా వుండగలనా? ఇంకా ఎన్నో గుర్తింపులు ఎదురు చూస్తున్నాయి మరి.



★ ఇరవై సంవత్సరాల క్రితం మీరు ప్రారంభించిన "జ్యోతి" ఇంతై, అంతై ఎంతో ఎదిగి నేడు అనూహ్యమైన రీతిలో పాఠకుల ప్రశంసలందుకుంటోంది. మీరు ప్రారంభించిన పత్రిక ఇలాంటి విజయాన్ని సాధించిందని మీరు విన్నప్పుడు మీరు పొందే అనుభూతి ఏమిటి? "జ్యోతి" పాఠకులకు మీ సందేశం?

జ్యోతి కంటే జ్యోతి పాఠకులనే ముందు నేను అభినందించాలి. ఇది నిజంగా జ్యోతి అని గుర్తించింది వారే. ఇది సినిమా బొమ్మల పత్రిక కాదు రంగు రంగుల బొమ్మలు వుండటానికి. చక్కటి కథల పత్రిక. అందుకే ఇంకా చదువుతున్నారు. అందుకే వారిని కంగ్రాట్యులేట్ చెయ్యాలి. పోతే, ఇటువంటి వాటితో లక్షలు గడించాలన్న అభిప్రాయంలేని జ్యోతి వారినికూడా అభినందిస్తున్నాను.

జ్యోతి మరింత అభివృద్ధి చెందాలని నా ఆకాంక్ష.




ఛీ! ఎన్నికల
ప్రభావం అనుకుంటా!!

వి.ఎస్.కె. రంగారావు సంజెదీపం

ఏదీ నా బాల్యం !
ఎక్కడ దాగింది నా బాల్యం ?

చిన్నతనంలో చిలిపిచేష్టలు చేసిన
గున్నమావి తోటలేవీ ?
రమ్మని ఉయ్యాల లూగిన
దయ్యాల చింతలేవీ ?

అదేమిటి ! అదెవరు !!
అద్దంలోని ఆ అపరిచితుడెవరు ?

పసిడి కాంతుల పాలబుగ్గల బదులు
బతుకు గతుకుల అతుకుపోయిన చెక్కిళ్లు....
కమ్మని కలల తేనె కనులున్నచోట
కఠిన దృశ్యాలు పడే గనులు....

చిరు నవ్వులతో వంగే పెదవి వింటిలో
చిరాకుటమ్ములను సంధించిన దెవరు ?
అవలీలగా దాటిన గోడలు యీనాడెందుకు
అవరోధమై నిలిచాయి?

ఆకుపచ్చ లారని మంకెన మొక్క
ఆశ్చర్యం, నేను నాటి పెంచినది
వయసు వచ్చిన వారకాంత లాగ
వగల పోయలు కురుస్తున్నది!


ఎఱ్ఱపూల చీర కట్టి
విఱ్ఱవీగి పోతున్నది!

ఆనాడేనుగుల్లా నటించిన మనుషులు
ఈనాడెలుకల్లా పారుతున్నారు
పలకరించకపోయినా పళ్ళికిలిస్తున్నారు.
చేతులు నలుపుకొంటూ చిత్తం చిత్తమంటున్నారు.
పనివున్న మంగలి చాటుగా
పేకాటలు నేర్పిన దొరకూనలు
పెద్దాటలు మొదలెట్టారు
రాజబందుగులు కదా రాజకయ్యాలు నేర్చారు.

ఉబలాటం పట్టలేక మీదబడి
ఉక్కిరి బిక్కిరి చేసే
మూడు జతల మూగ కన్నులు
ముద్దులు కురిపించే కన్నులు
మంటిలో కలిశాయా? నన్ను
ఒంటిగా వదిలేశాయా?

తోడునేనున్నా లేకపోయినా తమ్ముడేడనే
తోబుట్టువు లేమయ్యారు?
నాయనా అని నన్నాడించిన తరుణులు
నలుగురు పిల్లల తల్లుల తల్లులయ్యారు!


ప్రతి యేటా వసంతాన్ని తెచ్చే కాలమా
ప్రతి భూమినీ పండించి యెండించే కాలమా
అందరికీ వయసు రప్పించే కాలమా
కొందరికే వలుపు అందించే కాలమా
నీవేనా యింత ఘాతుకం చేసింది !




నీవేనా యిన్ని గొంతులు కోసింది !!
ఇన్ని తీపి జ్ఞాపకాలలో
ఇంత చేదు కలిపింది?

కానీ ఒక్కటి మాత్రం గుర్తుంచుకో
ఖబడ్దార్ నా జ్ఞాపకాలను తాకలేవు
మట్టిలో నన్ను కలిపినా
మట్టినే మాయం చేయలేవు
ప్రతి రేణువులో దాగే అనుభూతుల
ప్రతిబింబాలు నిన్ను చూసి
పకాలుమని నవ్వుతాయి
పరిహాసం చేస్తాయి.
నిత్యంగా సాగేది నీ గమన మొకటే కాదు
సత్యం కూడానని ఋజువు చేస్తాయి.

(పై రచన నా స్వంతం కాదనీ రామకృష్ణునికీ, రామచంద్రునికీ, రామ వర్మకూ అనుకరణ అని హామీ యిస్తున్నాను).



శ్రీ శ్రీ పదబంధ ప్రహేళిక





అడ్డము

1. ఏ పక్షి ఒంటరి?
3. ఇది చెయ్యడం మన విస్తరిముందు
5. పిల్లికి బిచ్చం పెట్టడు
7. సంపెంగవనంలో తిరిగీ దుఃఖమా?
8. ఇక్కడే నా ఊతకు ముందు మేత?
10. తేనె తాగే ఛందోవిశేషం.
11. మతం మార్కు ప్రసాదం
12. ఇంగ్లీషు ఔషధం.
14. అప్రాచీనం.
16. కొత్తదారిలో కాదు, పాత రస్తాలో బయలుపడుతుంది.
18. మూడువందలు.
20. భూమి విషయంలో ఒప్పందం
21. గ్రహణం ముగింపు
22. తెనాలి రామలింగని రచనల్లోనిది.
24. కొన్ని ఉపన్యాసాల ముడిసరుకు
25. ఈ రమి సుమారు.
27. దీపానికి ముందు స్వర్గం, తర్వాత తేనీరు.
28. భారతంలో ఒకరోజు.

నిలువు

1. అడవి మృగం.
2. దూరం! భారం!
3 సింహాలుకు జూలుండును.
4. తీగకాని తీగ.
6. నేటివు డాక్టరు
7. దగ్గర బంధువు
9. అయ్యో!
11. నీవు, నేను, అదీ వాడూ!
13. చండశాసనుడు
15. సారాకొట్లో వేదాంతి. (చూ. కన్యాశుల్కం)
16. భాగం తాగవచ్చు
17. భారవి కవిత్వంలో కంచుకం.
18. ఒక రాష్ట్రం.
19. మూడు
20. కార్తిక పూర్ణిమ.
23. నియమమే భాగ్యం.
24. చల్లని చోటు
26. రామాయణంలో పిడికలవేట.







Phone : 64°37

Dr. SUNKU BALARAM
(Asthma Specialist)

(Regd No. 16029) L.A.M. & S.

D. No : 3-6-369/8. Himayat Nagar,
HYDERABAD - 500 029.

ప్రతి నెలా క్యాంపు వివరములు

తేది	టైమ్	స్థలము
1-16 ఒంగోలు	7-9	గౌతమీ ప్రజా వైద్యశాల తాతా బిల్డింగ్స్ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద
1 గుంటూరు	11-4	శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయము వద్ద లాలపేట.
2 విజయవాడ	7-9	శ్రీ బృందావన్ లాడ్జి. బిసెంటు రోడ్డు. గవర్నరుపేట.
2 గుడివాడ	9-12	జిల్లాపరిషత్ ట్రావలర్స్ బంగ్లావద్ద
2 ఏలూరు	1-30-3	శ్రీ ఆంజనేయస్వామి ధర్మసత్రం వద్ద
2 రాజమండ్రి	6-8	హోటల్ అప్సరా.
3 విశాఖపట్టణము	9-30-1-30	మనోరమ లాడ్జి, డాబా గార్డెన్సు
4 ఖమ్మం	9-30-1-30	మయూరి లాడ్జి.
10 చిలకలూరిపేట	12-30-3-30	హోటల్ సతీష్ లాడ్జి (పాత గంగాభవన్ లాడ్జి)
25 నర్సారావు పేట	6-8	శ్రీనివాస లాడ్జి.
14 అనంతపురం	9-30-12-30	బృందావన్ లాడ్జి
15 తిరుపతి	9-30-12	హోటలు విక్రమ్, ఆర్.టి సి. బస్టాండు ఎదురుగా
15 పలమనేరు	5-6	ట్రావెలర్స్ బంగ్లా

1, 2, 3, 4, 10, 14, 15, 16, 25.

నోటు : పై తేదీలు మినహా మిగతా తేదీలలో డాక్టరుగారు హైదరాబాదులో రోగులను పరీక్ష చేసెదరు.



పాపము నుండి విముక్తి ఎలా?

మానవులెందుకు నీతి తప్పి నడుస్తుంటారు? ఎందుకు చెడు మార్గమును ప్రేమిస్తుంటారు? ఎందుకని తెలుసా? పాపపు పనిలో కనిపించే ఆనందం, ఆకర్షణ వారికి పవిత్ర ప్రేమలో కనిపించదు. కన్నులకు కనిపిస్తున్న ఈ స్వర్గాన్ని కాలదన్ని, కన్నులకు మరుగైన, ఆ స్వర్గం కోసం, ఇప్పటి నుండి ఎందుకు పరితపించాలి? అని తమతో తామె సరిపెట్టుకొంటారు.

తాను నడుస్తున్న మార్గం కంటకావృత్తం అని తెలుసు. దీనివలన తన్ను నమ్ముకొన్న భార్యాబిడ్డలు, తన మీద వెర్రి ఆశలు పెంచుకొన్న వృద్ధ తల్లి తండ్రులు, తీరని ఆవేదనకు గురికాగలరని కూడ తెలుసు. త్రాగుడు, జూదం, పరస్త్రీ వ్యామోహంవలన, ధన వ్యయం, పరువు నష్టం అనికూడా బాగుగా తెలుసు. పాపం నిప్పువంటిది. నీవు తెలిసి ముట్టుకొన్నా, తెలియక ముట్టుకొన్నా నీ చెయ్యి కాలక మానదు. బాధ పెట్టినంత కాలం, మనిషిని బాధించి, చివరికి అసహ్యమైన మచ్చలుగా మిగిలిపోతాయి. అందుకే పాపమనే నిప్పుతో చెలగాటలాడక దూరంగా తొలగిపోవటం శ్రేయస్కరం. అక్కడ నుండి దూరంగా తొలగిపోగలిగిన హృదయం కూడ దేవుని వలన కలగాలి. దేవుని కృపవలన మార్పు పొందిన మనస్సే మనస్ఫూర్తిగా పాపాన్ని ద్వేషించగలదు. పాపము వలన కలిగే భయమువలన గాని, రాబోయే శిక్షను తప్పించుకొనవలెననే కోర్కె వలన స్వాభావికముగానే ఈ పాప ద్వేషము కలుగుతుంది. మీరు కూడా మీ హృదయములో మార్పు పొందగోరుచున్నారా? అయితే మాకు వ్రాయండి.

Apology of Manepalle Satyanarayana to Sri R. Kameswara Rao

I, Manepalli Satyanarayana, wrote a Stroy, 'Kameswara rao Mastaru' which was published in the Telugu Monthly 'JYOTI' of April 1982 issue

In that article I portrayed the life, and character of a teacher at School and at home. I wrote this story as a piece of fiction.

Now, I admit that Sri R. Kameswara Rao is known to me as a colleague and good friend at Chodavaram and Narsipatnam. I was not really either mindful or intentional about the wrath of Sri R. Kameswara Rao who filed a case under IPC 500 at Narsipatnam, J.F.C.M. Court.

Now, I make known to all the readers of the said magazine, and the public in general, that I have no animosity against Sri R. Kameswara Rao, and tender my aplogy to him.

In this connection, I tender my unconditional apology to the Managing Editor & Publisher, JYOTI (Telugu Monthly) of Hyderabad, as an unconditional apology was tendered to Sri R. Kameswara Rao, who is the complainant in CC 54/82 on the file of JFCM, Narsipatnam and is accepted by him.

R. Kameswara Rao 27-11-82	M. Satyanarayana 27-11-82

సీరియల్

సౌభాగ్యలత

అరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి రామశాస్త్రి

(జరిగిన కథ)

(బోర్డాఫ్ డైరక్టర్లు అడగిన సంజాయిషీకి మహేష్ మిత్రులు ఖంగారు పడ్డారు. కొందరు ట్రాన్స్‌ఫరవగా, మహేష్ తనకుడిభుజం శివరాంకి వేరే ఉద్యోగం చూపించి, బాధ్యత తప్పించాడు. కుమార్‌ని హాస్పిటల్‌లో చేరాడు, ఎంక్వయిరీ ఇబ్బందిలేకుండా... వర్కర్ల చేత గొడవలు రేపించి కంపెనీని డైవర్ట్ చేసి తన పాపాలని పాతిపెట్టే ప్రయత్నాలలో వున్నాడు మహేష్. ఇక శ్రీమంత్ పని పట్టాలని ప్లాన్. శ్రీమంత్ సతీసమేతంగా తన ఇంటికి ప్రయాణమయ్యాడు.) (ఇక చదవండి)

"అంతే?"

"పదిహేను, ఇరవై రోజులలో ఆయన స్టేట్స్‌కు వెళ్తున్నారు."

"ఆఁ చెప్పావు కావేం మరి!"

విపరీతానంద ప్రకటించాడు శ్రీమంత్.

"తండ్రి ఠెనచూచి శారద లోపలికి వెళ్ళిపోయింది.

కోటయ్య విషయ వివరణ ప్రారంభించాడు.

"శారదకు కూడ భర్తతో వెళ్ళిపోవాలని వుంది. నాకూ అదేమంచి దన్పిస్తోంది అతగాడిది ఒక్కడినీ వదలకుండా. అక్కడ రెండేళ్లుంటుందట అతడి కోర్సూ, ట్రైనింగూ"

"మంచిదేగా శారద వెళ్ళడం?"

వకుళ ఉపాహార పానీయాలు తేవడంతో సంభాషణ అప్పటికి ఆగింది.

తరువాత కోటయ్య స్నేహితులను కల్సుకోవడానికి శారద ఎవరో బంధువులను కల్సుకోవడానికి వెళ్లారు.

"అయితే నువ్వు నాన్నగారికి రాసి మంచి పని చేశావు. నాకసలు దేనికో తీరికే వుండడంలేదు."

భర్త మాటలకు వకుళ నవ్వింది.

"నీకు అన్నీ ఆనంద వార్తలే!"

"ఏమిటోయ్?"

"మామా" అని చెవులు పట్టుకు ఆడించే వాడొస్తున్నాడు!" అతి ఆనందంగా చెప్పింది.

"ఆ!" కొద్ది క్షణాలు ఆశ్చర్యంలో వుండిపోయాడు శ్రీమంత్.

"శ్రీమంత్."


"ఊ!"

"ఇన్నాళ్ళ తర్వాత శారదా మామయ్యలను చూచిన నువ్వు వుండవలసినంత సంతోషంగా లేవేందుకని?"

"ఏముంది? కంపెనీలో పెద్ద బాధ్యత స్వీకరించిన రెండవ రోజునే పెద్ద గొడవలు రేగాయి. వర్కర్లు వారం రోజులు గడచినా ఏవిధమైన రాజీకీ రాలేదు. వర్కర్లు ఊరేగింపులూ, చెడు ప్రచారాలూ చాలా పెద్ద గొడవలు చేస్తున్నారు. చూడగా దీని వెనక ఏవో పెద్ద చేతులున్నాయని అనుమానంగా వుంది."

"తప్పకుండా వుంటాయి, నువ్వు చేసిన పని సామాన్యమైనది కాదుగా?"

"వకుళా!"



"ఔను శ్రీమంత్. అసలే గంభీరంగా వుండే నువ్వు యిటీవల మరీ గంభీరంగా మారిపోయావు. ఏమి మాటాడాలన్నా నాకు సందేహంగా వుంటోంది."

"మాట్లాడు వకుళా. నీకు అడ్డేమిటి?"

"ప్రస్తుతం ...."

"ఊ" చెప్పు?"

"ఈ జరుగుతున్న గొడవల వల్ల బావకేమీ ప్రమాదం వుండదు కదా?"

జాలిగా, బాధగా చూచాడు శ్రీమంత్.

"ధర్మమార్గంలో రక్తబంధాలను విస్మరించాలి వకుళా. అప్పుడే మనం సరి అయిన పౌరులుగా జమఔతాం. నేను తప్పుచేసినా నువ్వు ప్రభుత్వానికి వెంటనే పట్టి యివ్వాలి నన్ను."

తన సుతార హస్తాన్ని అతడి పెదవులకు అడ్డుగా వుంచింది.

"అంతవరకూ ఎందుకు పోవాలి శ్రీమంత్?"

భర్తను సరిదిద్దుకోవచ్చుగా భార్యగా?"

"ఆ, చూశావామరి? కానీ భార్యగా రక్షించుకోగల స్థితిని కూడ అతిక్రమించాననుకో.........."

"అబ్బబ్బ! ఈ డొంక తిరుగుడు వద్దు శ్రీమంత్, నాదొక్క రిక్వెస్ట్."

"ఏమిటి?"

"బావకు ఏమీ ప్రమాదం జరగకుండా చూడు. వాళ్ళూ మనమూ కూడ బాగుంటేనే కదా అమ్మా నాన్నగార్లకు సుఖశాంతు లుండేది?"

శ్రీమంత్ మౌనంగా వుండిపోయాడు.

"శ్రీమంత్ చెప్పు? బావకేమీ ప్రమాదం జరగదు కదా?"

"ప్రస్తుతం ఏమీ జరుగదు, ఎందుకంటే అతడు చాలా నేర్పరి. ఎంత ఘాతుకమైన పనికైనా ఏ ఆధారాలూ దొరకనీయక జాగ్రత్త పడ్తుంటాడు. నేను జాగ్రత్తలు తీసుకుంటూన్నది కేవలం మా కంపెనీ నాశనం కాకుండా, ప్రస్తుతం ప్రమాదం మా పాత ఆఫీసర్స్‌కే."

"ప్రస్తుతం....... అంటే? తర్వాత వుంటుందా బావకు ప్రమాదం?"

"వుండవచ్చు- అతడికి యిప్పటికైనా బుద్ధి రాకపోతే, ఆఫీసర్స్ కంపెనీ నుండి దొంగతనంగా బయటకు తెస్తున్న సరుకును కొనుగోలుచేసే వ్యక్తులలో ఒకడుగా అతడు అధికారుల దృష్టిలోనికి వెళ్ళాడు!"

"అయితే జాగ్రత్తగా వుండమని మనం హెచ్చరించవచ్చు కదా!"

విరక్తిగా నవ్వాడు శ్రీమంత్.

"అతడి దృష్టిలో మనం మనుషులలాగే కన్పించం, ఏముఖంతో వెళ్తాం? అయినా యింత జరిగాకనైనా అతడికి కొంచం జంకూ గొంకూ వుండకుండా వుంటాయా?"

"మన బాధ్యతకొద్దీ మనం..........."

"హెచ్చరించి వద్దామంటావా? అనవసరం! వాళ్ళ హద్దులు మీరి వాగే వాగుళ్ళు భరించాల్సిన అవసరం మనకు లేదు!"

"శ్రీమంత్! నువ్వేనా యిలా మాట్లాడుతున్నావు?"

"నువ్వే చెప్పు, మీ అమ్మగారి దగ్గరగానీ, అక్కవద్ద గానీ ఏనాడైనా అవమానాలు లేకుండా నువ్వు తిరిగివచ్చావా?"

"...................."

"మాట్లాడవేం?"

"మనమధ్య కలతలూ, కేకలూ వద్దు శ్రీమంత్. కాని....... కాని...."

"ఏమిటి?"

"నువ్వు అక్కమీద కోపంతో గానీ యిదంతా చేయడం లేదు కదా?"

పట్టరాని ఆగ్రహంతో అతడి చేయిపైకి లేచింది. కానీ అంతలో తమాయించుకున్నాడు.

"పద, నీకు అటువంటి అనుమానమే వుంటే ఇప్పుడే వెళ్ళి వాళ్ళతో మాట్లాడి వద్దాం."

"నీకు చాలా కోపం తెప్పించాను, క్షమించు"

"కోపం కాదు, బాధ వకుళా బాధ! నువ్వు నన్ను యింతేనా అర్థం చేసుకున్నది? సరేలే, అప్పుడదంతా ఎందుకు? వెళ్దాం నడువు."

43

అరగంటపైగా వీధిగేటు వద్దనే శ్రీమంత్ వకుళలను ఎరుగనట్లే అనేక ప్రశ్నలతో విసిగించారు మహేష్ నౌకర్లూ, ఇద్దరు కుటుంబ సభ్యులూ కూడ.

ఆ తర్వాత మేడ పోర్టికోలో మహేష్ దర్శనమైంది.

"ఎవరదీ?............ఓ! రానీయండి పైకి. ఎవరనుకున్నారు వారు? మా తోడల్లుడుగారు!"

అది ఆదరణో, అవహేళనో అర్థంకాలేదు శ్రీమంత్‌కు.

వకుళకు మాత్రం శ్రీమంత్ ముఖం చూడలేనంత సిగ్గుగా వున్నది ఈ పరిస్థితిలో.

"రండి రండి."

భార్యాభర్తలు ముక్తకంఠంతో ఆహ్వానిస్తూ తమ గదిలోనే కూర్చుండ చేశారు శ్రీమంత్‌నూ వకుళనూ

శ్రీమంత్‌కు చాలా యిబ్బందిగా వున్నది పరిస్థితి. మహేష్ మాటలు లేకుండా కూర్చున్నాడు.

వకుళ ఆగది వైభవాన్ని అట్టహాసాన్ని కొద్ది నిముషాలు చూచింది వాగ్బంధన జరిగినట్లు.

అటు శశిరేఖ పరిస్థితీ భిన్నంగా ఏమీలేదు. ఫ్రిజిడైర్‌లోని పళ్ళు పానీయాలు తీసి తెచ్చే మిషతో అక్కడే వుండిపోయింది ఆలోచింపుతూ.

ఇంత జరిగిన తర్వాత రాకపోకలూ సంబంధబాంధవ్యాలూ వుండబోవని వారనుకున్న సంగతి సత్యం కాదంటూ వకుళా శ్రీమంత్‌ల రాక చెబుతున్నా ఏదో శంక, భయం మహేష్‌ను, శశినీ కూడ మూగగా నిలబెట్టాయి.

"ఇటురా అక్కా. అవన్నీఎందుకు పరాయివాళ్ళకులాగా. వచ్చికూర్చో."

అంటూ ముందు వకుళే సంభాషణ మొదలుపెట్టింది.

"మీరెప్పుడూ రానేలేదని మేమే వచ్చాం బావా ముందు. మీకేమీ అభ్యంతరం లేదుగా?"

ఆలోచనలు ఎక్కడెక్కడో వున్నాయి మహేష్‌కు.

"శ్రీమంత్ భార్యగా వకుళ ఎంత ఉల్లాసంగా కన్పట్టుతోంది. నిరాభరణంగా వున్నా ఏమిటా నిండుదనం ఆమెలో? సంపదలు లేకున్నా ఈ జంట యింత సంతోషంగా ఎలా వున్నారు? గర్భవైరం ప్రదర్శింపుతూన్న శ్రీమంత్ ఎందుకిలా హఠాత్తుగా వచ్చినట్టు?"

మహేష్ మౌనం శ్రీమంత్‌ను కుపితుని చేసింది.

కుర్చీనుండి లేచి సరళ స్వరంతోనే అన్నాడు :

"మహేష్! మేమెటూ మర్యాదల కోసం రాలేదు. ఒక్క విషయంలో నీతో మాట్లాడాలని వచ్చాను."

"నాకు తెలుసు నువ్వేం మాట్లాడుతావో?"

"తెలుసా!"

"ఆ, నీవాటా ఎంతో తేల్చి చెబితే నాకు అడ్డురావని! అందుకేగా? ఇది నువ్వు ముందే అడిగినా ఇచ్చేవాడినేగా? ఇప్పుడైనా వచ్చావు, సంతోషం!" వింటూనే శ్రీమంత్ ముఖం జేవురించింది.

ప్రయత్నపూర్వకంగా సహనం కొని తెచ్చుకుంటూ వకుళ దెస చూచాడు.

వకుళ పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఏమీలేదు.

"చెప్పు శ్రీమంత్ ఎంత కావాలి నీకు?"

సవిలాసంగా సగరెట్ పీల్చుతూ అడుగుతూన్న మహేష్‌ను అసహ్యంగా చూచాడు శ్రీమంత్.

"నాకు 'ఎంత కావాలి' అనడుగుతున్నావు. [ఏమీ వద్దు 'నావారు' అను

కున్న అందరి సుఖశాంతులూ మినహా, నువ్వు ప్రమాదాలలో పడకుండా క్షేమంగా వుండడం కావాలి నాకు మహేష్! అందుకే- అది చెప్పిపోవడానికే వచ్చాను!"

మహేష్ కనుబొమ్మలు ముడివడ్డాయి.

"బెట్టు - నటనా వద్దు శ్రీమంత్. నాకట్టే టైమ్ లేదు, ఏమి అడగదాని కొచ్చావో స్పష్టంగా తేల్చు."

శశిరేఖ తెచ్చిన డ్రింక్స్ ఎవరూ అందుకోలేదు.

"ఈ మర్యాదల కోసం రాలేదక్కా. అవతల కొంపలు మునుగుతున్నాయి నువ్వైనా బావకు చెప్పు."

శశికి కూడా కోపం వచ్చినట్టు ఆమె కనులే చెబుతున్నాయి.

"ఏమిటే? నీకు ప్రపంచం ఏమి తెలుసని మాట్లాడుతున్నావు? మీకు బాగు పడడం రాదు. మరొకరు బాగుపడడం చూడలేరు!"

"బాగుపడడమంటే ఏమిటి? ఘరానా దొంగతనాలతో బ్రతకడమా? ఏ క్షణంలో ఎవరు మన రహస్యాలను వెలికి తీస్తారోనని భయపడుతూ నిత్యం ఛస్తూ బ్రతకడమా?"

శశి నిర్లక్ష్యంగా నవ్వింది,

"చాలా మాటలు నేర్చావు కానీ- మమ్మల్ని చూడడం కాదు- నిన్ను నీవు- నీ వేషాన్ని ఒక్కసారి అద్దంలో చూచుకో, నీ బీద బ్రతుకునే బాగు చేసుకోలేని నువ్వు కంపెనీకి రక్షగానిలుస్తావా? హు-! అయినా చూచుకోవ డానికి ఇంట్లో నిలువుటద్దంకూడా లేదేమో?"

ఈ హేళన విని కూడా వకుళ చెక్కు చెదరలేదు.

తాము కూర్చున్న ఆ గదిలోవున్న నిలువుటద్దాలనూ ఖరీదైన వస్తువులనూ అసహ్యంగా చూస్తూ అన్నది.

"తలకు తగని ఐశ్వర్యాల మాటున వుండే హైన్యత నాకు తెలుసు అక్కా. అక్రమంగా వచ్చే ఐశ్వర్యం అనర్థ హేతువు, నీ చుట్టూ వున్న ఈ ఖరీదైన అద్దాలు నిన్ను చూచి నవ్వేరోజు, ఈ ఖరీదైన షాండ్లియర్స్ నెత్తిన కూలే రోజు, నీ కాలిక్రిందనున్న ఖరీదైన కాశ్మీర్ తివాచీలు కప్పిపెడుతున్న అగాధాలు నిన్ను తమలోనికి లాక్కునే రోజు రాకూడదనే నా కోరిక. కానీ

మీరింత నిర్లక్ష్యంగావుంటే ఆ రోజు రాక తప్పదు. కావలసిన వారని శ్రీమంత్ వద్దంటున్నా వినక హెచ్చరించడానికి వచ్చాను!"

మహేష్ లేచి పచార్లు ప్రారంభించాడు.

"ఇంత దూరం భార్యను వెంటబెట్టుకొని కేవలం హెచ్చరించ డానికే వచ్చావా శ్రీమంత్? కమాన్! ఎందుకు చల్లకొచ్చి ముంత దాచడం, నీ కెంత కమిషన్ కావాలో చెప్పు? కుమార్ శివరాంల కంటె పెద్ద పొజిషన్స్‌లో నిన్ను

కూర్చుండ చేస్తాను. నా యింటిని మించిన ఇళ్లు నీకూ వుంటాయి. ఇలాంటి గొప్ప అవకాశాలు అందరికీ వస్తాయా?"

"థాంక్స్! కానీ ఎప్పుడు కాటువేస్తాయో తెలియని విషసర్పాలవంటి ఈ అధికారాలూ, ఐశ్వర్యాలూ నాకొద్దు మహేష్. ప్రజలసొమ్మును కైంకర్యం చేసి నా ఒక్కడిని యింట మేట్లు వేసుకొనే పాపపుబుద్ధి నాకు లేదు."

"నువ్వు వచ్చింది ఈ మాత్రానికే అయితే ఇక వెళ్ళవచ్చు!"


మహేష్ కంఠం మూల్గోమ్గింది.

"వెళ్తున్నాను. వెళ్ళేముందు ఒక హెచ్చరిక విను. కుమార్ శివరాంలు అరెస్ట్ అవ్వలేదని సంతోషించకు. వాళ్ళ చర్యలన్నీ గమనించే అవకాశాల కోసమే వాళ్ళను అలా వదలి పెట్టారు. తీగ కదలిన నాడు డొంక అంతా కదులుతుంది. కదలినప్పుడు నీ ఈ వైభవం తాలూకు ప్రతివస్తువూ ఎక్కడిదనే ఆరా వస్తుంది. ఆ సమయంతో నీవు తిరిగే కారును ఏ కంపెనీ ఉద్యోగి నీకు దానం చేశాడో, నీవు కట్టుతూన్న సినిమాహాలుకు ప్రతి ఇటుకా, కడ్డా, సిమెంటూ ఎక్కడినుండి వచ్చాయో, నీవు ఏ దుకాణంలో ఎంతెంత ఖరీదైన నగలు కొని ఎక్కడెక్కడికి పంపావో అన్నీ బయటకు వస్తాయి. నీ భార్య ఒంటిమీది ఖరీదైన చీర నీవు కొనలేదని ఋజువు కావడమే కాదు. ఆఖరుకు నీ కాలి కాన్పూర్ చెప్పులు కూడ నీకొక ఆఫీసర్ భార్య బహూకరించిదనీ, ఆ కాలి క్రింది ఖరీదైన కాశ్మీర్ తివాచీ ఒక కంపెనీ గెస్ట్‌హౌస్‌నుండీ, నీ గుమ్మాల సిల్కు తెరలు మరొకటి కంపెనీ గెస్ట్‌హౌస్‌నుండీ తస్కరింప బడ్డాయనీ, నీ కబర్డ్‌లోని ఫారిన్ విస్కీ బాటిల్సన్నీ కూడ కొన్ని కంపెనీలు పార్టీల నిమిత్తం కొనుగోలు చేసిన సరుకునుండి తస్కరింపబడినవేననీ నువ్వే ఒప్పుకుంటావు! బై! పదపకుళా!"

నిస్సహాయంగా భర్త వెంట నడుస్తూ వకుళ పదేపదే కనులు తుడుచుకో సాగింది.

గుమ్మం దాటబోతూ వెనక్కు తిరిగిచూచి, మలా ఒక్క పరుగున వచ్చి శశిరేఖను చుట్టివేసింది.

"అక్కా, మరొక్కసారి ఆలోచించుకోండి. మీమీద మాకేం కోపం



ద్రు.........బావా! మీరెప్పుడూ ఇలాగే కళ కళ లాడాలని నా కోరిక.. కానీ లేపమాదాలలో పడకండి. సెలవ్!"

పరుగిడినట్లే వెళ్ళిపోయింది.

మహేష్ శశిరేఖలు చాల తడవు చిత్రప్రతిమలే అయ్యారు.

తాను తెచ్చిన డ్రింక్స్ చెల్లెలుగాని, మఱదిగానీ తీసుకోనే లేదనేకోపం కొలది వాటిని తిరిగి పెద్ద శబ్దంతో ఫ్రిజ్‌లో పడవేసింది శశిరేఖ.

"ఈ వకుళకూడా శ్రీమంత్ లాగే తయారైంది. నూతిలో కప్ప! ఛీ" అన్నది గట్టిగానే,

"నోర్ముయ్!"

బిగ్గఱగా భయంకరంగా అరిచాడు మహేష్! ఆ ఆగ్రహ కారణం తెలియక శశి నిర్ఘాంతపోయి చూచింది.

"వకుళ అంటే నాకు చాలా అభిమానం. ఇంకెప్పుడూ అలా మాట్లాడకు!" అన్నాడు నిప్పులు రాల్చే చూపులతో.

విస్మయావస్థనుండి తేరుకొన్ని శశిరేఖ ఇంకా అలాగే చూస్తోంది అతడి దెస.

"మగనిని మంచి దారిలో నడప వలసినది భార్య! ఆ ఔన్నత్యం ఆమెలో వున్నది! నువ్వామె కాలిగోటికి కూడా తగవు!"

శశిరేఖ పాదాల అడుగున భూమి కదలినట్లే అయ్యింది.

"ఏ.........ఏమంటున్నావు నువ్వు మహేష్?"

"శ్రీమంత్‌లో చిందులు వేస్తూన్న గర్వం నైర్మల్యం, నిశ్చింతా మనకు వెయ్యి జన్మలెత్తి నా రావంటున్నాను!"

"మహేష్!"

"ఔను. నల్గురిచేతా 'శభాష్!' అనిపించుకొనే అతడి బుద్ధిని చూచే వరించింది వకుళ! భార్యాభర్త లిద్దరిదీ ఒకటేమాట! ఒకటే అభిరుచి! ఎంతటి అదృష్టవంతుడు శ్రీమంత్."

"నువ్వు మతివుండే మాట్లాడు తున్నావా? శ్రీమంత్ అంటే నీకు అయిష్టంకదా?" అయోమయంగా అడిగింది.



"ఔను. అన్యాయపు దారులలో తమను తాము బంధించుకున్న సాలె పురుగులకు ఆదర్శవంతులను చూస్తే అసూయ, - అదే అయిష్టమూ, వైరమూ. ఎన్నికోట్లు గడించితేనేం? అతడికున్న నిశ్చింతా, సుఖమూ నాకేవి? విలువైన వస్తువులు కావాలని వేధించని భార్య. నాలాగా అడ్డమైన గడ్డీ కరవక్కర్లేదతడు: అడ్డమైన వాళ్ళకూ తలవంచి లంచాలు సమర్పించ నక్కర్లేదు... అతడు... నెల జీతాన్నే మహా ప్రసాదంగా భావించి బ్రతికే మహా ఇల్లాలు వకుళ. మగవాడి అదృష్టమంటే అది."

శశిరేఖ సహనం కోల్పోయింది.

"ఒక్కోరోజు ఒక్కో పిచ్చి ప్రలాపన వస్తుంది నీకు. ఏం? నేనేం తక్కువ వకుళకంటె? నేను నిన్ను గడ్డి కరవమన్నానా? అది నీ అలవాటు.. అంతే."

"కాదు!!!"

గది దద్దరిల్లేట్టు అరిచాడు మహేష్.

"నువ్వు శ్రీమంత్‌ను కాదని నన్ను కట్టుకున్న కారణం నేనెప్పుడూ మరువలేను. నీకు కావలసింది వ్యక్తి కాదు. డబ్బు! డబ్బు! నాకే ఈ లక్షలు లేకపోతే నువ్వేం చేస్తావోననే శంక నిత్యం నన్ను తినివేస్తుంటుంది. నీ మొదటి స్నేహితుడు శ్రీమంత్ అనే నిజం నన్నెప్పుడూ నిలువునా దహించి వేస్తుంటుంది. అందుకే నువ్వు వచ్చాక నా త్రాగుడూ చెడు అలవాట్లూ ఎక్కువయ్యాయి. భార్య మంచిదైతే ఎంతటి త్రాగుబోతైనా గుణవంతుడౌతాడని విన్నాను. కాని నువ్వు? ఛీ. నువ్వూ, రోహిణీ.... ఛీ, మీరూ ఆడవాళ్ళే? ఛీ! ఛీ!"

శశిరేఖ అహం బాగా దెబ్బతిన్నది. నాగిని వలె కస్సుమన్నది.

"ఆదర్శాలు అసమర్థులు కప్పుకొనే ముసుగులు. అవంటే నా కసహ్యం. ఈనాడు ఏదో కాస్త చీకాకు వచ్చినందుకే యింత తల్లక్రిందులై పోతున్న నువ్వేం సాధించగలవు? ఏమి సంపాదించగలవు? ఆ చీకాకు కూడా ఎవరివల్ల? ఆఫ్ట్రాల్ ఒక మధ్యతరవాడు. మన ఒక్కరోజు ఖర్చుకూడా కానంత నెలజీతగాడు. అతి మామూలు మనిషివల్ల ఈ చీకాకు. అతడివల్ల నీకు అంత తల

నొప్పిగా వుంటే ట్రాన్స్‌ఫర్ చేయించి పారేయ్ ఇక్కడినుండి. దేవాంతకపు పనులన్నీ చేసే నీకు యిదేమీ కష్టంకాదు. అంతేకానీ యితరులకోసం నన్ను తూలనాడకు. ఇప్పటికే చాలా సహించాను. ఇక సహించేదిలేదు."

నిరసన నంతనూ పదధ్వనిలో పలికించుతూ ప్రక్కగదిలోనికి వెళ్ళిపోయింది శశిరేఖ.

మతిపోయిన మహేష్ గబ గబా రెండు సీసాలు ఖాళీ చేశాడు.

"నీ కాలి చెప్పులు కూడానీవి కావని.................... కాలి క్రింది ఖరీదైన తివాచీని తస్కరించానని................ కబర్డ్‌లో ఖరీదైన విస్కీకూడా తస్కరింపబడినదేనని............ నీవు తిరిగే ఖరీదైన కారు ఏ కంపెనీ ఉద్యోగి దానం చేశాడో నువ్వే ఒప్పుకుంటావు............ నువ్వే ఒప్పుకుంటావు.......... అహ్హా హ్హా హ్హా!"

శ్రీమంత్ మాటలు చెవులలో గింగురు మంటున్నాయి.

"నీ భార్య ఒంటిమీది ఖరీదైన చీర నీవు కొనలేదని................ నువ్వే ఒప్పుకుంటావు!"

"కుమార్ శివరాంలు అరెస్టు కాలేదని సంతోషించకు. ముందుంది ముసళ్ళ పండగ."

శ్రీమంత్ అనిన మాటలతోపాటు అననివి కూడ జోడించి పిచ్చెక్కిస్తోందతడి మనసు.

ఆలోచించిన కొలదీ అతడిలో కంగారూ, ఆవేశం అధికం కాసాగాయి.

"అయితే? అయితే.. అన్నీ బైటకొస్తే నాకు జైలుకటకటాలే శరణ్యమా?" భయంకరమైన ఊహ!

"నో! నో!"

బిగ్గరగా అరిచాడు గదిలో ఎవరూ లేకున్నా.

"ఔను, ట్రాన్స్‌ఫర్! శశి చెప్పినదే నిజం. వాడికి పెద్ద ట్రాన్స్‌ఫర్ అవసరం."

మరో సీసాను ఖాళీ చేశాడు.

[illegible] గర్వం విజృంభించగా, పదిలంగా పథకాలు వేస్తూ బయలుదేరాడు [illegible]టికి.

"శ్రీమంత్. [illegible] తిస్తావు [illegible]దురా, చూస్కో నా తడాఖా." పళ్ళు పటపట నూరుతూ [illegible] శ్రీమంత్‌ను ఉద్దేశించి.

మీ అత్తగారికీ నీ పై ఏ మాత్రమూ సదభిప్రాయం లేదు."

అన్నాడు కోటయ్య భోజనం చేస్తూ.

"ఫర్వాలేదు, మామయ్య వున్నారా? ఏమన్నారు?" అన్నాడు శ్రీమంత్.

"అతడిది ఎప్పటి అమాయక ధోరణే అనుకో. కానీ ఎందుకు ఆమెకు మనపై హఠాత్తుగా యింత చులకన ఏర్పడింది?"

"డబ్బుమహిమ నాన్నా అంతా. పోనీ లేండి. వకుళవింటే బాధపడు తుంది. ఆ విషయం యిక మాట్లాడ వద్దు"

"ఔనులే వకుళ నీకు తగిన భార్య. అదేనాకు సంతోషంగా వుంది."

శ్రీమంత్ మాట్లాడలేదు.

"అబ్బాయ్! వచ్చినప్పటినుంచీ చూస్తూన్నాను. నువ్వు ఏమిటో చాలా ఆలోచనలలో వుంటున్నావు. ఏమిటది?"

"ఏం లేదు నాన్నా. ఏవో ఆఫీసు వ్యవహారాలు."

"అహా! పోనీలే. కానీ నీ జీతం ప్రస్తుతం ఎన్నివేలు?"

"వేలా?"

నిర్ఘాంతపోతూ అన్నాడు శ్రీమంత్.

"మరి? నీ ఉద్యోగం హోదా అన్నీ ఎదిగాయి కదా? 'చాలా రాబడి వుంటుందీ. అదీ కాక అంత ధనవంతుల అల్లుడు కదా. నాకు ఓ ముప్పైవేలు సర్దండి ప్రస్తుతం విదేశాలు వెళ్తున్నానూ. శారదనుకూడా తీసుకుపోతున్నానూ' అంటున్నాడు శారద భర్త.

"........................"

"మాట్లాడవేమిటీ?"

హుం-! ఏం మాట్లాడను నాన్నా? ఈ విషయం నాకు అతగాడు స్వయంగా ఉత్తరం కూడ వ్రాశాడు. పదిరోజులైంది."

"అలాగా? మరి ఏమాలోచించావు?"

(సశేషం)

Edited & Published by V. Leelavathy Raghavaiah. at 3-5-1039/1 Narayanaguda. Hyderabad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers. 1-2-4/1/1. Chikkadpalli. Hyderabad-500 020.

Jyoti
FEBRUARY 1983
Regd No. H/S 73

